సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 141

SUNDAY Special | ఆదివారం 5-2-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



బృహస్పతి... ఉపగ్రహాల రాజు

సౌరకుటుంబంలో అతిపెద్దదైన గురుగ్రహం చుట్టూ మరో 12 ఉపగ్రహాలను సైంటిస్టులు కనిపెట్టారు. దీంతో దాని ఉపగ్రహాల సంఖ్య 92కు పెరిగింది.

- వివరాలు 6లో



సుప్రీంకోర్టులో మరో తెలుగు న్యాయమూర్తి

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలుగు బిడ్డ జస్టిస్ పీవీ సంజయ్ కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 6లో



కేజ్రీవాల్ ఆఫీసు వద్ద నిరసన

మద్యం స్కాంపై ఈడీ చార్జిషీట్‌లో పేరున్న సీఎం కేజ్రీవాల్ రాజీనామా కోరుతూ బీజేపీ.. ఆయన ఆఫీస్ వద్ద నిరసన తెలిపింది.

వివరాలు 6లో ▸



కర్ణాటక ఎన్నికల ఇన్‌చార్జిగా ప్రధాన్

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీజేపీ అధిష్టానం నియమించింది.

వివరాలు 6లో ▸



11 మందికి విముక్తి

పౌరసత్వ(సవరణ) చట్టానికి వ్యతిరేకంగా జామియా నగర్‌లో చెలరేగిన హింస కేసులో 11 మందిని ఢిల్లీ కోర్టు నిర్దోషులుగా తేల్చింది.

వివరాలు 6లో ▸



లాటిన్ అమెరికాపై చైనా బెలూన్

చైనాకు చెందిన మరో నిఘా బెలూన్‌ను లాటిన్ అమెరికాపై గుర్తించినట్లు యూఎస్ రక్షణ శాఖ కార్యాలయం తెలిపింది.

వివరాలు 6లో ▸

ఏది నిజం?

సీబీఐ నుంచి రామోజీ 'లై'వ్ రిపోర్టింగ్

- ఇద్దరు మాట్లాడుకున్నది 'ఈనాడు'కెలా తెలుస్తోంది?
- బాబు అనుకూల మీడియాకే లీకులెందుకు ఇస్తున్నారు?
- ఇంట్లో కాఫీ,టీలిచ్చే వారిని 'పీఏ' అంటారా?.. ఇంట్లో వ్యక్తులు బిజీగా ఉన్నప్పుడు వారి పనివాళ్లకు సమాచారమివ్వరా?
- అదే పెద్ద నేరమైనట్లుగా పదేపదే భారతమ్మ పేరు తెస్తున్నారెందుకు?
- మరణించిన వివేకా... అవినాశ్ రెడ్డికి చిన్నాయనే కదా?
- పీఏ కృష్ణారెడ్డి దగ్గర దొరికిన లేఖ నాన్న రాసిందే: వివేకా కుమార్తె
- తామొచ్చే వరకూ ఆ లేఖను ఎవరికీ ఇవ్వొద్దని కూడా ఆమె చెప్పారు
- ఈ విషయాన్ని ఆమె డీజీకి చెప్పినట్లు వెల్లడించిన ఎస్పీ
- వివేకా మరణించారని తొలుత చెప్పింది ఆయన బావమరిది శివప్రకాశ్ రెడ్డి.. గుండెపోటుతో మరణించారని ఆయనే చెప్పారన్న ఆదినారాయణ రెడ్డి
- తనకూ ఆయన చెబితేనే వచ్చానని వెల్లడించిన అవినాశ్
- మరి కావాలని దుష్ప్రచారమేల?


4లో

అప్పర్ భద్రపై న్యాయ పోరాటం

తక్షణమే నిలిపివేసేలా కర్ణాటకను ఆదేశించండి

నీటి కేటాయింపులే లేని ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులు, జాతీయ హోదా సరికాదు

- ఏపీ హక్కుల పరిరక్షణ కోసం న్యాయ పోరాటం దిశగా ఏపీ సర్కారు అడుగులు
- సుప్రీంకోర్టులో రేపు స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుకు రంగం సిద్ధం
- 29.9 టీఎంసీల తుంగభద్ర జలాలను తరలించేలా 2015లోనే ఈ ప్రాజెక్టుకు కర్ణాటక శ్రీకారం
- అధికారంలో ఉండగా నోరెత్తని చంద్రబాబు
- ఇది పూర్తయితే తుంగభద్ర డ్యామ్, కేసీ కెనాల్, ఆర్డీఎస్ ఆయకట్టుపై ప్రతికూల ప్రభావం



సాక్షి, అమరావతి: బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేయకున్నా 29.9 టీఎంసీల తుంగభద్ర జలాలను వాడుకునేందుకు కర్ణాటక సర్కార్ చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుపై న్యాయ పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రాజెక్టు పనులను తక్షణమే నిలుపుదల చేసేలా కర్ణాటకను ఆదేశించి, దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ హక్కులకు పరిరక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో సోమవారం ఎస్ఎల్‌పీ (స్పెషల్ లీవ్ పిటిషన్) దాఖలు చేయనుంది. అప్పర్ భద్ర పూర్తయితే తుంగభద్ర డ్యామ్, కేసీ కెనాల్, ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీం), శ్రీశైలం, నాగార్జునసాగర్‌తో పాటు కృష్ణా డెల్టాలో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయని నివేదించనుంది. తమ అభ్యంతరాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా అప్పర్ భద్రకు కల్పించిన జాతీయ హోదాను, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన సాంకేతిక అనుమతులను రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించనుంది.

హక్కులు తాకట్టు పెట్టిన చంద్రబాబు

తుంగభద్ర డ్యామ్‌కు ఎగువన 295 టీఎంసీలకు మించి కర్ణాటక వాడుకోవడానికి వీల్లేదని బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1) స్పష్టం చేయగా..

మిగతా 2వ పేజీలో ▶



మూగబోయిన వాణి

ప్రముఖ గాయని వాణీ జయరామ్ కన్నుమూత

- చెన్నైలోని నివాసంలో నెత్తుటి గాయాలతో మృతి
- అనుమానాస్పద మరణంగా కేసు నమోదు
- పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల నివాళి

- వివరాలు 12లో

లత-ఆశా-వాణి

భర్త ప్రోత్సాహంతో...

కొత్త నాయికలకు ఆ వాణీయే...

న్యూస్‌రీల్

'హైటెక్ సెక్స్‌రాకెట్'లో అసిస్టెంట్ డైరెక్టర్



హైటెక్ సెక్స్‌రాకెట్ కేసులో అసిస్టెంట్ డైరెక్టర్ సురేశ్ బోయినతో పాటు మరొకరు అరెస్టు అయ్యారు. సురేశ్ ముంబై, ఢిల్లీ నుంచి మోడల్స్‌ను హైదరాబాద్‌కు తరలించి.. వాట్సాప్, వెబ్‌సైట్లలో ఫొటోలు పెట్టి వ్యభిచార దందా నిర్వహిస్తున్నాడు.

వివరాలు 14లో ▸

మార్చి 29 నుంచి కువైట్‌కు విమాన సర్వీస్



ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మార్చి 29 నుంచి విజయవాడ(గన్నవరం)-కువైట్ సిటీ మధ్య కొత్త సర్వీస్‌ను ప్రారంభించబోతోంది. ప్రతి బుధవారం ఈ సర్వీస్‌ను నడపనున్నట్లు సమ్మర్ షెడ్యూల్‌లో ఎయిరిండియా సంస్థ పేర్కొంది.

వివరాలు 14లో ▸

ఏపీలో మహిళాభ్యుదయం

- సగం పదవుల్ని సీఎం జగన్ మహిళలకే కట్టబెట్టారు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని
- విశాఖపట్నంలో ప్రారంభమైన జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ సదస్సు
- దేశవ్యాప్తంగా హాజరైన మహిళా శాసనసభ్యులు



విశాఖలో శనివారం జరిగిన సదస్సుకు హాజరైన వివిధ రాష్ట్రాల మహిళా శాసనసభ్యులు

14లో


చంద్రబాబునూ సీబీఐ విచారించాలి

- వివేకా హత్యలో ఆయన ప్రమేయం..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని డిమాండ్
- తండ్రిపై ఆక్రోశంతో సీఎం జగన్‌పై లోకేశ్ పిచ్చి విమర్శలు
- టీడీపీలోకి ఎన్టీఆర్ వారసులు వస్తుంటే.. ప్రమాదాలు, గుండెపోట్లు
- ఆ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి.. ఎన్టీఆర్ మృతిపై దర్యాప్తు చేయాలని మోదీ, అమిత్‌షా, కేసీఆర్, జగన్‌ను కోరుతా

2లో



పాత పద్ధతిలోనే కృష్ణా జలాల పంపిణీ



- 2022-23కూ ఇదే విధానం
- ట్రిబ్యునల్ కేటాయింపులు చేసే వరకు ఇదే పద్ధతి
- కృష్ణా బోర్డుకు తేల్చిచెప్పిన కేంద్ర జల్ శక్తి శాఖ

14లో

'అసైన్డ్' సమస్యలకు చెక్ పెడతాం

రాష్ట్రంలో అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి సీఎం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారని విశాఖలో జరిగిన ప్రాంతీయ సదస్సులో మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. అనంతరం సీఎం ఆదేశాల మేరకు అసైన్డ్ భూముల చట్టం 77ఏలో అవసరమైతే సవరణలు చేస్తామని వివరించారు. - వివరాలు 3లో



'ఉపాధి'కీ ఆధార్

- ఉపాధి హామీ పథకం వేతనాల చెల్లింపుల్లో కేంద్రం కొత్త నిబంధన
- ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న ఖాతాల్లో మాత్రమే కూలీ డబ్బు జమ
- ఈ నెల 1 నుంచే దేశవ్యాప్తంగా అమలు
- రాష్ట్రంలో ఇప్పటికే కూలీల బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం
- ఇప్పుడు దేశమంతటా తప్పనిసరి



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారికి ఇక నుంచి ఆధార్ కార్డు వివరాల ఆధారంగా మాత్రమే కూలీ డబ్బులు చెల్లిస్తారు. ఈ నెల 1 నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారికి ఏబీపీఎస్ (ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్) విధానంలో మాత్రమే వేతనాలు చెల్లించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నరేగా విభాగం డైరెక్టర్ ధర్మవీర్ ఝా రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శులకు లేఖ రాశారు. అంటే.. పనిచేసిన వ్యక్తి జాబ్‌కార్డు, అతడికి వేతనం చెల్లించేందుకు ఉద్దేశించిన బ్యాంకు ఖాతాలో ఉన్న వివరాలు ఆధార్‌లో వివరాలతో సరిపోవాలి. అప్పుడే వారికి వేతనం అందుతుంది. దేశవ్యాప్తంగా 2017-18 నుంచే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం వేతనాలను బ్యాంకు ఖాతాలలో జమ చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ ప్రక్రియ అంతా ప్రత్యేక పోర్టల్ ద్వారా జరుగుతుంది. అయితే.. ఆధార్‌తో సంబంధం లేకుండా కూలీలు సూచించిన బ్యాంకు ఖాతా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారు ఎప్పుడు పనికి హాజరైనా ఆ ఖాతాలోనే ప్రభుత్వం డబ్బు జమ చేస్తోంది. ఇక నుంచి కూలీ సూచించే బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేయాలి. ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు వివరాలు ఆ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసే వరకు ఆ కూలీ వేతనాల చెల్లింపులు ఆగిపోతాయి.

రాష్ట్రంలో ఇప్పటికే అమలు

ఆధార్ ఆధారంగా ఉపాధి హామీ పథకం వేతనాల చెల్లింపులు ఇప్పటికే రాష్ట్రంలో కొంత మేరకు జరుగుతున్నాయి. అయితే, వేతనాలు జమ చేసేందుకు కూలీ సూచించే బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానం అయి ఉండాలన్న నిబంధనను తప్పనిసరి మాత్రం చేయలేదని అధికారులు తెలిపారు. ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతా, అనుసంధానం కాని ఖాతా అయినా వేతనాలు జమ చేస్తున్నట్లు చెప్పారు. 2006లో ఉపాధి హామీ పథకం తొలిసారి దేశంలో అమల్లోకి వచ్చాక.. మరే రాష్ట్రంలో లేని విధంగా పారదర్శకత కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే తొలి రోజు నుంచే స్మార్ట్‌కార్డుల విధానంలో కూలీలకు వేతనాల చెల్లింపును అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలులోకి తెచ్చారు. అప్పట్లోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించింది. పథకం మొత్తాన్ని ఆన్‌లైన్ విధానంలో అమలు చేసేది. ఆ తర్వాత ఈ విధానాన్నే కేంద్రం కూడా అనుసరించిందని అధికారులు వివరించారు.


దేశ వ్యాప్తంగా కూలీల వివరాలు	మన రాష్ట్రంలో ..
దేశవ్యాప్తంగా ఉపాధి హామీపథకంలో నమోదైన కూలీలు : 30,22,64,049 మంది	ఉపాధి హామీ పథకంలో పేర్లు నమోదు చేసుకున్న కూలీలు: 1,58,65,097 మంది
గత మూడేళ్లలో కనీసం ఒక్కరోజైనా పనికి హాజరై యాక్టివ్‌గా ఉన్న కూలీలు : 15,13,65,815 మంది	పనికి హాజరై యాక్టివ్‌గా ఉన్న కూలీలు : 97,67,443 మంది
ఈ ఏడాది జనవరి 31 వరకు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న వారు : 20,37,66,318 మంది	జనవరి 31 వరకు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న వారు : 1,23,74,522 మంది

వాడిన పూలూ గుబాళిస్తున్నాయ్

దేవుళ్లకు అలంకరించిన పుష్పాల పునర్వినియోగం

- అగరువత్తులు, సాంబ్రాణి కడ్డీల తయారీతో ఏటా కోటిన్నర వ్యాపారం
- టి.తిమ్మాపురం మహిళల విజయగాథ.. అంతర్జాతీయంగా మార్కెట్ చేసేందుకు అమెజాన్‌తో ఒప్పందం

మహాకవి శ్రీశ్రీ రాసిన 'వాడిన పూలే వికసించెనే..' అన్న పాటను నిజం చేస్తున్నారు తుని మండలం టి.తిమ్మాపురం మహిళలు. 'బంతి.. చామంతి.. మా చేతిన పడితే అగరువత్తి' అంటూ వారంతా కొత్త పాటను ఆలపిస్తున్నారు. వాడిన పూలను పౌడర్‌గా మార్చి పర్యావరణ హితమైన అగరువత్తులను తయారు చేస్తూ పూల పరిమళాలను వెదజల్లుతున్నారు.






అగరువత్తులను ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వాడిన పూలు పనికి రావనేది ఒకప్పటి మాట. ఇప్పుడు అవి కూడా విపణి వీధిలో వికసిస్తూ పరిమళాలు విరజిమ్ముతున్నాయి. దేవుడికి అలంకరించిన పుష్పాలు ఆ తరువాత మహిళల చేతుల్లో అగరువత్తులుగా మారిపోతున్నాయి. ఏడాది క్రితం ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియ లాభదాయకమై విజయవంతంగా నడుస్తోంది. ప్రపంచ మార్కెట్‌లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. కాకినాడ జిల్లా తుని మండలంలోని టి.తిమ్మాపురం ఒక చిన్న పల్లెటూరు. ఆ ఊళ్లో 15 కుటుంబాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు అగరువత్తులు, సాంబ్రాణి కడ్డీలు వంటివి తయారు చేస్తున్నారు. గత ఏడాది ప్రారంభించిన వీటి టర్నోవర్ రూ.కోటిన్నర దాటేసింది. శ్రీసత్యదేవ స్వయం సహాయక సంఘానికి చెందిన మహిళలు అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయం నుంచి సేకరిస్తున్న పుష్పాలను నిత్యం తిమ్మాపురం తీసుకెళ్లి ఎండబెట్టి పౌడర్‌గా మారుస్తున్నారు. ఆ పౌడర్‌తో అగరువత్తులు తయారు చేసి 60 గ్రాములు, 120 గ్రాముల ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నారు. పూల పౌడర్‌తోనే

మిగతా 3వ పేజీలో ▶



క్లుప్తంగా...

వాణీ జయరాం మృతిపై గవర్నర్ దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: ప్రముఖ గాయని వాణీ జయరాం మృతిపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శనివారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వాణీ జయరాం చిత్ర సీమకు చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం రోజు పద్మ భూషణ్ ప్రకటించిందన్నారు. ఆ అవార్డు అందుకోక ముందే ఆవిడ కన్నుమూయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పాడిన తొలి పాటకే ఐదు అవార్డులు సాధించటమే కాక, మూడు సార్లు జాతీయ ఉత్తమ గాయనిగా అవార్డులను పొందారని కొనియాడారు.

తారకరత్న మెదడు పనితీరు మెరుగవ్వాలి

సాక్షి, బెంగళూరు: వారం రోజులుగా బెంగళూరులోని నారాయణ హృదయాలయలో చికిత్స పొందుతున్న సినీ నటుడు తారకరత్నకు ఇంకా మెదడు పనితీరు మెరుగవ్వాల్సి ఉందని సమాచారం. శుక్రవారం ఆయనకు మెదడుకు సంబంధించిన పలు పరీక్షలు, స్కానింగ్‌లు చేశారు. ఆ రిపోర్టుల ఆధారంగా.. అవసరమైతే ఆయన్ని మెరుగైన చికిత్స కోసం విదేశాలకు తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

సినీ పరిశ్రమకు విశ్వనాథ్ సేవలు వెలకట్టలేనివి

పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



సాక్షి,అమరావతి: సినీ దిగ్గజం కె.విశ్వనాథ్ లేరు అని ఊహించుకోవడమే కష్టంగా ఉందని, ఆయన సినిమా పరిశ్రమకు చేసిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. హైదరాబాద్‌లోని కె.విశ్వనాథ్ నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను శనివారం రోజా పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలుగు సినిమాల ద్వారా ఆయన సాహిత్యానికి, సంస్కృతికి చేసిన సేవ ఇంకెవరూ చేయలేరేమో అనిపిస్తుందన్నారు. అన్ని సినిమాల్లో తెలుగుదనం, తెలుగు సాహిత్యం, తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఉంటాయని చెప్పారు. అందరూ ఒక మెసేజ్‌ను తీసుకుని ముందుకు వెళ్లేలా ఆ సినిమాలు ఉంటాయని తెలిపారు. దర్శకుడిగా, నటుడిగా ఆయన ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారన్నారు. ఆయన తెలుగు సినిమాకు చేసిన సేవను గుర్తించి ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు కూడా ఇచ్చి సత్కరించిందని గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు ఎల్లవేళలా అండగా ఉండాలని కోరుకుంటున్నానని వివరించారు.

అఖిలప్రియ హౌస్ అరెస్ట్



ఆళ్లగడ్డ(నంద్యాల): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో టీడీపీ నేత, మాజీ మంత్రి భూమా అఖిలప్రియను పోలీసులు శనివారం హౌస్ అరెస్టు చేశారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అక్రమాలకు సంబంధించిన ఆధారాలు తన దగ్గర ఉన్నాయని, నంద్యాల గాంధీ చౌక్‌కు వచ్చి వాటిని బయటపెడతానని, తమపై చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే కూడా ఆధారాలతో రావాలని అఖిలప్రియ సవాల్ విసిరారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆమె ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొని శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసు ఉన్నతాధికారులు భావించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తన సిబ్బందితో అఖిలప్రియ ఇంటికి వెళ్లి హౌస్ అరెస్టు చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు.



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ విద్యాధరపురంలో లేళ్లపూడి అవ్వమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ శిరీష



రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ చంద్రశేఖర్



గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన ఆదిలక్ష్మికి దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ రవి



తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చిత్తూరు జిల్లా తేనేపల్లికి చెందిన సావిత్రమ్మకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జయప్రకాష్

దేశంలో ఐటీఐలు చాలా పూర్

వాటిని సంస్కరించి, అధునాతనంగా తీర్చిదిద్దాలి

- ప్రపంచ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య రంగాల్లో శిక్షణ ఇవ్వాలి
- దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో 14,789 ఐటీఐలు
- ప్రభుత్వ ఐటీఐల్లో 56.74 శాతం, ప్రైవేట్‌లో 43.07 శాతం సీట్లు భర్తీ
- ఐటీఐల్లో శిక్షణ పొందిన వారిలో ప్లేస్‌మెంట్స్ 0.09 శాతమే
- ఐటీఐల్లో విద్యార్థినులు చాలా తక్కువగా చేరుతున్నారు
- నీతి ఆయోగ్ అధ్యయన నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ సంస్థలు)ల పనితీరు చాలా పేలవంగా ఉందని, వాటిని తక్షణం సంస్కరించి, అధునాతనంగా తీర్చిదిద్దాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నీతి ఆయోగ్ సూచించింది. నీతి ఆయోగ్ అధ్యయన బృందం వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటుఐటీఐలను స్వయంగా సందర్శించింది. అక్కడి విద్యార్థులు, బోధకులతో మాట్లాడటంతో పాటు మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, పరిశ్రమల అనుసంధానం తదితర అంశాలను పరిశీలించి, సమగ్ర అధ్యయన నివేదికను విడుదల చేసింది. దేశం మొత్తం మీద ఐటీఐల్లో శిక్షణ పొందిన వారిలో ప్లేస్‌మెంట్ కేవలం 0.90 శాతమే ఉందని ఆ నివేదిక పేర్కొంది. దేశం మొత్తం మీద 2021 సంవత్సరంలో 4,14,247 మంది ఐటీఐల్లో శిక్షణ పొందితే 405 మంది మాత్రమే ప్లేస్‌మెంట్స్ పొందినట్లు వెల్లడించింది. అత్యధికంగా తమిళనాడులో 7,676 మంది విద్యార్థుల్లో 248 మందికి అంటే 3.2 శాతం ప్లేస్‌మెంట్స్ పొందారని, ఆ తరువాత గుజరాత్‌లో 0.25 శాతం ప్లేస్‌మెంట్స్ ఉండగా మిగతా రాష్ట్రాల్లో చాలా అధ్వాన్నంగా ఉందని నివేదిక వివరించింది. దేశంలో ప్రత్యేకంగా మహిళా ఐటీఐలు 2021 నాటికి 16.83 శాతం ఉంటే అందులో చేరికలు కేవలం 6.6 శాతమే. బోధకుల్లోనూ మహిళలు 15.83 శాతమే ఉన్నారు. ఇక్కడ లింగ వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని నివేదిక తెలిపింది. ఆ నివేదిక ప్రధానాంశాలివీ..

ప్రభుత్వ ఐటీఐలకే విద్యార్థుల ప్రాధాన్యత

దేశవ్యాప్తంగా 14,789 ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొత్తం 25,38,487 సీట్లు ఉండగా, వీటిలో 48.20 శాతం సీట్లే భర్తీ అవుతున్నాయి. మొత్తం ఐటీఐల్లో 78.40 శాతం ప్రైవేటు రంగంలో, మిగతావి ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. అయితే, సీట్ల భర్తీలో ప్రైవేట్‌కన్నా ప్రభుత్వ ఐటీఐలే మెరుగ్గా ఉన్నాయి. ప్రైవేటు రంగంలో 43.07 శాతం సీట్లు భర్తీ అవుతుండగా ప్రభుత్వ ఐటీఐల్లో సీట్ల భర్తీ 56.74 శాతం ఉందని నివేదిక పేర్కొంది. అత్యంత ఆదరణ పొందిన ట్రేడ్‌లలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, మోటారు వెహికల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ మొదలైనవి ఉన్నాయి. అయినప్పటికీ ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఉన్న సీట్లలో 64.81 శాతం, ఫిట్టర్ ట్రేడ్‌లో 71.57 శాతం సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 35.19 శాతం, ఫిట్టర్‌లో 28.43 శాతం సీట్లే భర్తీ అవుతున్నాయి.

అప్రెంటిస్‌లుగానే ఉపాధి

ఐటీఐల్లో విద్యార్థుల అనుభవాలు మిశ్రమంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. అత్యున్నత ప్రమాణాలతో ఉన్న ఐటీఐల్లో ప్లేస్‌మెంట్స్ 80 శాతం ఉంటున్నాయి. వీటిలో చదివిన విద్యార్థులు కెరీర్ పట్ల భరోసాతో ఉంటున్నారు. వీరిలో ఎక్కువ మంది సొంతంగా వెంచర్ ప్రారంభించాలన్న ఆసక్తిని కనబరుస్తున్నారు. మరికొందరు బోధకులుగా మారాలనుకుంటున్నారు. మధ్యస్థాయి, తక్కువ స్థాయి ఐటీఐల్లో అతి కొద్ది సంస్థల్లో మాత్రమే 20 శాతానికి పైగా ప్లేస్‌మెంట్స్ పొందుతున్నారు. ఐటీఐ విద్యార్థులను సంస్థలు ఉద్యోగులుగా కాకుండా అప్రెంటిస్‌లుగానే పరిగణిస్తున్నాయి. సాధారణంగా ఐటీఐ అభ్యర్థుల కనీస వేతనం నెలకు రూ.20 వేలుగా ఉంది. చాలా కంపెనీలు ఐటీఐ అభ్యర్థులను ఉద్యోగులుగా కాకుండా రిపేర్ల కోసం అప్రెంటిస్‌లగానే తీసుకుంటున్నాయి. వీరికి నెలకు రూ. 9,000 నుంచి రూ.12,000 వరకు ఇస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం 18 సంవత్సరాల వయస్సుగల వారు కావడం, సౌకర్యాల కోసం డిమాండ్ చేయడం.

ఇవీ అసౌకర్యాలు

ఐటీఐల్లో సరైన బోధకులు లేరు. మంజూరైన బోధకుల పోస్టుల్లో 36 శాతమే ఉన్నారు. ఔట్ సోర్సింగ్ బోధకుల్లో సమర్థత లేదు. ఐటీఐల్లో శిక్షణకు అవసరమైన లేబోరేటరీలు, సాధనాల కొరత తీవ్రంగా ఉంది. ఐటీఐలకు కనెక్టివిటీ కూడా తక్కువగా ఉంది. దీంతో కొంతమంది మధ్యలోనే చదువు మానేస్తున్నారు

నీతి ఆయోగ్ సిఫారసులు

- మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అధునాతనంగా తీర్చిదిద్దాలి
- 2047 విజన్‌తో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించాలి. శిక్షణ నాణ్యతను పెంచాలి
- డిజిటల్ లేదా హైబ్రిడ్ లెర్నింగ్ మోడ్‌కి మార్చాలి. అందుకు తగిన వ్యూహాలను కూడా రూపొందించుకోవాలి
- కోర్సులు, పాఠ్యాంశాలు వాటి ఔచిత్యం, నాణ్యతపరంగా ఐటీఐలు పరిధిని విస్తరించుకోవాలి
- అంతర్గత వనరులను పెంచుకోవాలి
- బలమైన బ్రాండింగ్‌తో పాటు ఐటీఐ కోర్సుల ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలి
- బోధకులకు మారిన అవసరాల మేరకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి
- ఐటీఐల్లో మౌలిక వసతులు, శిక్షణ సాధనాలు, అధ్యాపకులు, నిధుల కొరతపై దృష్టి సారించాలి.
- ఉన్నత చదువులు, సొంత వెంచర్లకు ప్రభుత్వం సాయం అందించాలి

నేటి నుంచి నూతన పరకామణిలో కానుకల లెక్కింపు

తిరుమల: తిరుమలలో నిర్మించిన నూతన పరకామణి భవనంలో ఆదివారం నుంచి కానుకల లెక్కింపు ప్రారంభం కానుంది. తిరుమలలో స్వామివారి హుండీ కానుకలు లెక్కించడానికి బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ అందించిన రూ.23 కోట్ల విరాళంతో అధునాతన సౌకర్యాలతో నూతన పరకామణి భవనం నిర్మించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గతేడాది సెప్టెంబర్ 28న సీఎం వైఎస్ జగన్ ఈ భవనాన్ని ప్రారంభించారు. నూతన భవనంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం కానుకల లెక్కింపును ప్రారంభిస్తారు. మరో వైపు తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది.

ఉత్తరాంధ్ర కీర్తి కిరీటం



మిసెస్ ఇండియా టాలెంటెడ్ టైటిల్ విజేత రజని

డాబా గార్డెన్స్ (విశాఖ)/శ్రీకాకుళం: ఉత్తరాంధ్రకు చెందిన పైడి రజని 'మిసెస్ ఇండియా టాలెంటెడ్' టైటిల్ గెలుపొందారు. రాజస్థాన్‌లోని రణతంబోర్‌లో నాలుగు రోజులపాటు మిసెస్ ఇండియా గ్రాండ్ ఫినాలే పోటీలు జరిగాయి. ఆంధ్రా యూనివర్సిటీ స్కాలర్ రజని ఈ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. ఆలిండియా డైరెక్టర్ దీపాలి ఫడ్నిస్ చేతుల మీదుగా టైటిల్‌ను అందుకున్నారు. కూచిపూడి, ఎంకి వేషధారణ, సంప్రదాయ, గిరిజన వస్త్రధారణ, ఆంధ్రా వంటకాల తయారీ, దేశభక్తిని పెంపొందించే నాట్య ప్రదర్శన, థింసా, జంగిల్ సఫారీ విభాగాల్లో రజని చూపిన ప్రతిభ ఆధారంగా నిర్వాహకులు ఆమెను విజేతగా ఎంపిక చేశారు. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళలు ఈ పోటీలో పాల్గొనగా.. రజని టైటిల్ సొంతం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం కనిమెట్ట గ్రామంలో జన్మించిన రజని ఉద్యోగరీత్యా విశాఖలో ఉంటున్నారు.

చంద్రబాబునూ సీబీఐ విచారించాలి

మాజీ మంత్రి కొడాలి నాని డిమాండ్

సాక్షి, అమరావతి: 'మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు సీఎంగా చంద్రబాబే ఉన్నారు.. ఈ కేసులో ఆయన ప్రమేయం ఉంది. అందువల్ల చంద్రబాబును కూడా సీబీఐ విచారించాలి' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు (నాని) డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వివేకా హత్య జరిగిన రోజు వైఎస్సార్ జిల్లా నుంచి చంద్రబాబుతో ఎవరెవరు ఫోన్‌లో మాట్లాడారు? ఈ ఘటన జరిగాక మూడు నెలల వరకు చంద్రబాబే సీఎంగా ఉన్నారు. మరి అప్పుడు ఎందుకు దోషులను పట్టుకోలేకపోయారు? ఆ హత్యలో ఆయన కూడా భాగస్వామి కనుకే పట్టుకో లేదా? ఎందుకు చార్జిషీట్ వేయలేదు' అనే విషయాలన్నింటిపై సీబీఐ దర్యాప్తు చేయాలని కోరుతున్నామన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలు బయట పడతాయనే అప్పట్లో సీబీఐ రాష్ట్రంలోకి రాకూడదని చంద్రబాబు బ్యాన్ చేశారని గుర్తు చేశారు. అందువల్లే చంద్రబాబు, లోకేశ్, ఏబీ వెంకటేశ్వరరావు, అప్పటి డీజీపీ, కడప ఎస్పీ, కడప జిల్లాలోని టీడీపీ నాయకుల ఫోన్ కాల్స్‌పై ఆరా తీసి, సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నాని ఇంకా ఏమన్నారంటే..

వివేకా కేసుపై తప్పుడు ప్రచారం

- అన్ని కోణాల్లో వివేకానందరెడ్డి కేసుపై సీబీఐ విచారిస్తుంటే, దానికీ ఈ ఫోర్ ట్వంటీలు, పచ్చ మీడియాలు వక్రభాష్యం చెబుతున్నాయి. వారికి తోచిన వారందరినీ ముద్దాయిలు చేసేస్తారు. సీఎం సతీమణి భారతమ్మనూ చేరుస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు.
- చంద్రబాబు భార్యను మేం ఏమీ అనన్పటికీ వెక్కివెక్కి ఏడ్చాడు. భారతమ్మను మాత్రం నిందిస్తాడు. అవినాష్ రెడ్డి అయినా, నేనైనా, మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా సీఎం జగన్‌తో మాట్లాడాలంటే ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డికో, లేదా నవీన్, లేదా కేఎన్ఆర్‌కో ఫోన్ చేసి మాట్లాడాల్సిందే కదా? ఈ విషయం అందరికీ తెలుసు. అయినా వక్రభాష్యాలా?
- వివేకానందరెడ్డి చనిపోయిన తర్వాత అవినాష్‌రెడ్డి ఆ సమాచారం చెప్పడానికి వాళ్లకు ఫోన్ చేశారు. ఇందులో ఏం కొంపలు అంటుకుపోయాయని రామోజీరావు, చంద్రబాబు, బీఆర్ నాయుడు, రాధాకృష్ణ ఇష్టమొచ్చినట్లు దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నట్లు?

అది తండ్రిపై కోపంతో చేస్తున్న యాత్ర

- బలవంతంగా పాదయాత్ర చేయిస్తున్నాడని తండ్రి చంద్రబాబుపై లోకేశ్‌కు మంట. తిండికి తప్ప దేనికీ పనికి రాని లోకేశ్.. తండ్రిపై ఉన్న ఆక్రోశంతో సీఎం జగన్‌పై పిచ్చి విమర్శలు చేయడం మానుకోవాలి. పప్పు గుత్తి లోకేశ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి.
- లోకేశ్ పాదయాత్రలో జనం ఎవరూ లేరు. నడవలేక కాళ్లు రుద్దుకుపోతున్నాయట. నువ్వు నడిచే నడకకు రోజుకు 20 సార్లు ఆయిల్ రాయాలంట. ఇది చాలదన్నట్లు నోరు తిరగని మాతి.. ఆ నోటితో సీఎం జగన్‌ను తిట్టడం.. ఇది తప్ప నీకేం తెలుసు?
- నారావారిపల్లి నుంచి హైదరాబాద్‌కు వలస వెళ్లింది బాబు కుటుంబమే. దత్తపుత్రుడూ అంతే. హైదరాబాద్ వలస పోయాడు. అతన్ని గాజువాక, భీమవరం ఎవరు వలస పంపారు?

ఎన్టీఆర్ మరణంపై హరికృష్ణ దర్యాప్తు కోరలేదా?

నారా రామ్మూర్తి నాయుడి అదృశ్యానికీ కారకుడు బాబే. ఆనాడు ఎన్టీఆర్ మరణానికీ చంద్రబాబే కారకుడు. టీడీపీలోకి ఎన్టీఆర్ వారసులు వస్తుంటే.. గుండెపోట్లు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి. తన తండ్రి మరణంపై సీబీఐ దర్యాప్తు చేయాలని ఆనాడు హరికృష్ణ కోరారు. కావాలంటే పాత పేపర్లు తిరగేయండి. చంద్రబాబు చరిత్ర అందరికీ తెలుసు. మోదీ, అమిత్‌షా, కేసీఆర్, వైఎస్ జగన్‌ని ప్రత్యక్షంగా కలిసి ఎన్టీఆర్ మరణంపై దర్యాప్తు చేయాలని కోరతాను.

అప్పర్ భద్రపై న్యాయపోరాటం

▶ మొదటి పేజీ తరువాయి

1980–81 నాటికే 319.558 టీఎంసీలను కర్ణాటక వినియోగిస్తున్నట్లు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–2) తేల్చింది.

- విజయనగర ఛానళ్లు, తుంగ, భద్ర ఆనకట్టల ఆధునికీకరణ వల్ల 11.5 టీఎంసీలు మిగిలాయని, 65 శాతం లభ్యత ఆధారంగా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (తీర్పు ఇంకా అమల్లోకి రాలేదు) కేటాయించిన పది టీఎంసీలు, పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించిన గోదావరి జలాలకుగాను దక్కిన 21 టీఎంసీల్లో 2.4 టీఎంసీలు, కే–8, కే–9 బేసిన్‌లలో మిగిలిన 6 టీఎంసీలు.. వెరసి 29.9 టీఎంసీలు (ఆవిరి నష్టాలు పోగా) తరలించేలా అప్పర్ భద్రను 2015లో కర్ణాటక చేపట్టింది.
- అప్పర్ తుంగ నుంచి 17.40 టీఎంసీలను భద్ర ప్రాజెక్టులోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి 29.90 టీఎంసీలను తరలించి చిక్‌మంగుళూరు, చిత్రదుర్గ, తుమకూరు, దావణగెరె జిల్లాల్లో 2,25,515 హెక్టార్లకు (5,57,259 ఎకరాలు) నీళ్లందించేలా ఈ ప్రాజెక్టును చేపట్టామని కర్ణాటక పేర్కొంది.
- నీటి కేటాయింపులు లేని అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక చేపట్టగా నాడు అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ నోరు మెదపకుండా కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులకు విఘాతం కల్పించింది. ఫలితంగా 2019 మార్చి నాటికే రూ.4,830 కోట్లను వ్యయం చేసి, అప్పర్ తుంగ నుంచి భద్ర ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోసేలా ఎత్తిపోతలు, ప్రధాన కాలువలతోపాటు భద్ర నుంచి వాణివిలాస రిజర్వాయర్‌కు నీటిని తరలించే ప్రధాన కాలువ పనులను కర్ణాటక పూర్తి చేసింది. అప్పర్ భద్ర ద్వారా 2019–20లో 3.44, 2020–21లో 6.61, 2021–22లో 6.82 టీఎంసీలను వాణివిలాస రిజర్వాయర్‌కు తరలించింది.

నీటి కేటాయింపులే లేని ప్రాజెక్టుకు జాతీయ హోదా!

- అప్పర్ భద్రకు జాతీయ హోదా సాధించడం ద్వారా కేంద్ర నిధులను రాబట్టేందుకు సిద్ధమైన కర్ణాటక సర్కార్ సీడబ్ల్యూసీ నుంచి సాంకేతిక అనుమతి, కేంద్ర జల్ శక్తి శాఖ నుంచి పెట్టుబడి అనుమతి (ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్) కోరుతూ ప్రతిపాదనలు పంపింది.
- బేసిన్ పరిధిలోని మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ అభిప్రాయాలను తీసుకోకుండానే 2020 డిసెంబర్ 24న అప్పర్ భద్రకు సీడబ్ల్యూసీ సాంకేతిక అనుమతి ఇచ్చింది.
- విజయనగర ఛానళ్లు, తుంగ, భద్ర ఆనకట్టల ఆధునికీకరణ వల్ల ఎలాంటి నీటి మిగులు లేదని, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు సైతం అమల్లోకి రాలేదని, ఈ నేపథ్యంలో సాంకేతిక అనుమతి ఇవ్వడమంటే న్యాయ ఉల్లంఘనకు పాల్పడటమేనని స్పష్టం చేస్తూ సీడబ్ల్యూసీకి 2020 డిసెంబర్ 30న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఖ రాయగా అభ్యంతరాలను తోసిపుచ్చింది.
- ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చుతూ సీడబ్ల్యూసీ నివేదిక ఆధారంగా అప్పర్ భద్రకు 2018–19 ధరల ప్రకారం రూ.16,125 కోట్లతో చేపట్టేందుకు 2021 మార్చి 25న కేంద్ర జల్ శక్తి శాఖ పెట్టుబడి అనుమతి ఇచ్చింది.
- దుర్భిక్ష ప్రాంతాల్లో 5.57 లక్షల ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్‌లో నీళ్లందించడానికి చేపట్టిన ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి కర్ణాటక ప్రతిపాదించింది.



తెలుగు రాష్ట్రాలకు తిప్పలే..

కర్ణాటక సర్కార్ ఇప్పటికే కేటాయించిన నీటి కంటే అధికంగా తుంగభద్ర జలాలను వాడుకుంటోంది. ఇక అప్పర్ భద్ర పూర్తయితే తుంగభద్ర డ్యామ్‌కు, శ్రీశైలానికి వరద ప్రవాహం రావడంలో మరింత జాప్యం జరుగుతుంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే దిగువకు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉండదు. ఇది తుంగభద్ర డ్యామ్‌పై ఆధారపడిన ఏపీలోని ఆయకట్టు, కేసీ కెనాల్, ఏపీ–తెలంగాణలోని ఆర్డీఎస్ ఆయకట్టుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లపై ఆధారపడ్డ ప్రాజెక్టుల ఆయకట్టుతోపాటు కృష్ణా డెల్టాపై కూడా ప్రభావం పడుతుంది. కృష్ణా బేసిన్‌లో తెలుగు రాష్ట్రాల్లో సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి. ఇదే అంశాన్ని సుప్రీం కోర్టుకు వివరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.

- ఏ ప్రాజెక్టుకైనా జాతీయ హోదా కల్పించాలంటే బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలు అంగీకరించాలని కేంద్రమే మార్గదర్శకాలు రూపొందించింది. అప్పర్ భద్రకు జాతీయ హోదా కల్పించాలన్న ప్రతిపాదనపై జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ నేతృత్వంలోని హైపవర్ కమిటీ 2021 నవంబర్ 6న సమావేశం నిర్వహించింది.
- నీటి కేటాయింపులే లేకుండా జాతీయ హోదా ఇవ్వడం సరికాదన్న తెలుగు రాష్ట్రాల అభ్యంతరాలను బుట్టదాఖలు చేస్తూ 2022 ఫిబ్రవరి 15న అప్పర్ భద్రకు కేంద్రం జాతీయ హోదా కల్పించింది. ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ.12,500 కోట్లను అందించడానికి కేంద్రం సమ్మతించింది. ఈ క్రమంలో 2023–24 బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లను కేంద్రం కేటాయించింది.

అప్పర్ భద్ర అక్రమ ప్రాజెక్టు



అప్పర్ భద్ర ప్రాజెక్టుకు 36 టీఎంసీలు కేటాయించాలన్న కర్ణాటక ప్రతిపాదనను బచావత్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 65 శాతం లభ్యత ఆధారంగా 9 టీఎంసీలను అప్పర్ భద్రకు కేటాయించింది. కానీ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేయకూడదని, నాలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సెల్పీ దాఖలు చేసింది. దీంతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేయకూడదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇక విజయనగర ఛానళ్లు, తుంగ, భద్ర ఆనకట్టల ఆధునికీకరణ వల్ల నీటి మిగులు లేదు. కే–8, కే–9 బేసిన్లలో కర్ణాటక అధికంగా నీటిని వాడుకుంటున్న నేపథ్యంలో నీటి మిగులు లేదు. నీటి కేటాయింపులు లేకుండా కర్ణాటక చేపట్టిన అప్పర్ భద్ర అక్రమ ప్రాజెక్టు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఆ ప్రాజెక్టును నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తాం.

– సి.నారాయణరెడ్డి, ఈఎన్‌సీ, జల వనరుల శాఖ

తక్షణమే నిలిపివేయాలి..



అప్పర్ భద్రకు జాతీయ హోదా కల్పించేందుకు తాను జారీ చేసిన మార్గదర్శకాలను జల్ శక్తి శాఖే ఉల్లంఘించింది. నీటి కేటాయింపులు లేకుండా, బేసిన్ పరిధిలోని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా అప్పర్ భద్రకు సీడబ్ల్యూసీ సాంకేతిక అనుమతి ఇచ్చింది. అక్రమంగా చేపట్టిన అప్పర్ భద్రను తక్షణమే నిలుపుదల చేయడంతోపాటు సాంకేతిక అనుమతి, జాతీయ హోదాలను రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు చేస్తాం.

– శశిభూషణ్‌కుమార్, ముఖ్య కార్యదర్శి, జల వనరుల శాఖ

అఖిల అండ.. భార్గవ దందా!

- ఆళ్లగడ్డలో టీడీపీ నేత భూమా అఖిల, ఆమె భర్త భూ ఆక్రమణలు
- రూ.కోట్ల విలువైన 25 సెంట్ల స్థలం కబ్జా
- బినామీలుగా ఇంటి పని మనుషులు



ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలో టీడీపీ నేత, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అండతో ఆమె భర్త భార్గవ రామ్ భూ దందాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆళ్లగడ్డలో ఓ మహిళ స్థలాన్ని తమ ఇంట్లో పని చేసే వ్యక్తుల పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ చింతకుంటకు చెందిన గూడా నరసింహుడు ఆళ్లగడ్డ శివారులో (కీర్తన స్కూల్ పక్కన) ఉన్న అదే గ్రామానికి చెందిన మహమ్మద్ హుస్సేన్, నూర్ అహమ్మద్ కుటుంబ సభ్యులకు చెందిన 25 సెంట్లు స్థలాన్ని కొని, 1995 మార్చి 27న భార్య గూడా వెంకటలక్ష్మమ్మ పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ స్థలం విలువ ప్రస్తుతం రూ 1.50 కోట్లు ఉంటుందని అంచనా. స్థలం ఖాళీగా ఉన్న విషయం అఖిలప్రియ దృష్టికి వెళ్లడంతో ఆమె భర్త భార్గవరామ్ రంగంలోకి దిగారు. దశాబ్దాలుగా ఇక్కడి రెవెన్యూ శాఖలో తిష్ట వేసిన ఓ అధికారి ఆ స్థలం రికార్డులను తారుమారు చేశారు. ప్రస్తుత యజమాని పేరు రికార్డుల్లో లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పథకం వేశారు. ఇందులో భాగంగా 1952లో అల్లిసా పేరు మీద రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ ఆధారంగా వారి మనువడు నూర్ బాషాకు వారసత్వంగా వచ్చినట్లుగా రికార్డులు సృష్టించారు. 1952 నుంచి 1985 వరకు అనేక మార్లు రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ఈసీలో ఒక్క ఎంట్రీ కూడా కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వీటి ద్వారా నూర్ బాషాతో అఖిలప్రియ ఇంట్లో పనిచేసే నంద్యాల హుస్సేన్‌రెడ్డి పేరు మీద 9 సెంట్లు, అనుచరుడు మిద్దె నాగార్జున పేరు మీద 9 సెంట్లు, బుట్టగాళ్ల రమణ పేరు మీద 7 సెంట్లు 2022 డిసెంబర్ 1న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక ఆ స్థలం కంచె తీసే ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన వెంకటలక్ష్మమ్మ, ఆమె భర్త నరసింహులు అధికారులను ఆశ్రయించారు.

అధికారులు న్యాయం చేయాలి: బాధితురాలు

1995లో కొనుక్కుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. కొన్నేళ్లు పొలం సాగు చేసుకున్నాం. చుట్టూ ఇళ్లు పడటంతో మేము కూడా సాగు ఆపేసి కంచె వేసుకున్నాం. ఇప్పుడు ఎవరో వచ్చి తాము కొనుక్కున్నామని బెదిరిస్తున్నారు. అధికారులు న్యాయం చేయాలి. కాగా ఈ వ్యవహారంపై క్రిమినల్ కేసులు పెడుతున్నామని సబ్ రిజిస్ట్రార్ నాయబ్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.



ఒంగోలు 31వ డివిజన్ వడ్డెపాలెంలో వృద్ధునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



విజయనగరం జిల్లా జమ్ము గ్రామంలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అన్నమయ్య జిల్లా తరిగొండలో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

క్లుప్తంగా...

డాక్టర్ 'చేవూరు'కు నేషనల్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ చేవూరు విజయకుమార్

సాక్షి, అమరావతి: హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, కాస్మోటిక్ వైద్య విభాగంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న విశాఖపట్నానికి చెందిన డీఆర్ వీజేఎస్ కాస్మోటిక్ సర్జరీ అండ్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ సీఈవో, ఎండీ డాక్టర్ చేవూరు విజయకుమార్‌కు నేషనల్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం ఆధ్వర్యాన విజయవాడలో జరుగుతున్న ఇంటర్నేషనల్ బిజినెస్ సెమినార్–2023లో శనివారం డాక్టర్ చేవూరు విజయకుమార్‌కు ఈ అవార్డును గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రదానం చేశారు. డాక్టర్ విజయకుమార్ ఏఎంసీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించి రిటైర్ అయ్యారు. ఆయన కుమారుడు చేవూరు హరికిరణ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

విశ్వాస ఘాతకుడు కోటంరెడ్డి

- నా ద్వారా సజ్జల లాభం పొందారని నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్



అనంతపురం అగ్రికల్చర్: సీఎం వైఎస్ జగన్ ఎంతో నమ్మకంతో బీఫామ్ ఇచ్చి రెండుసార్లు ఎమ్మెల్యేను చేసినా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నమ్మకద్రోహం, విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం అనంతపురంలో జరిగిన రాయలసీమ స్థాయి రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోలు) సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి వ్యవహారంపై స్పందించారు. పార్టీ మారడానికి ప్రత్యర్థి పార్టీతో ముందుగానే కోటంరెడ్డి ఒప్పందం చేసుకున్నారని మండిపడ్డారు. హుందాగా వెళ్లిపోవాల్సింది పోయి.. ఫోన్ ట్యాపింగ్ అని.. అవమానించారని ఆరోపిస్తుండటం సరికాదన్నారు. ఇంకా లేనిపోని అభాండాలు వేయడం మంచి పద్ధతి కాదన్నారు. తన ద్వారా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి లబ్ధి చేకూరిందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. ఈ నెల 6న నెల్లూరు వస్తానని.. దమ్మూ ధైర్యం ఉంటే దైవసాక్షిగా ప్రమాణం చేస్తావా అని కోటంరెడ్డికి సవాల్ విసిరారు. మంత్రి పదవి దక్కలేదనే కోటంరెడ్డి మతిలేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నెల్లూరులో చిన్నపిల్లాడిని అడిగినా కోటంరెడ్డి పెద్ద అబద్ధాలకోరు అని చెబుతారన్నారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీకి వత్తాసు పలుకుతున్న ఆయన తల్లిపాలు తాగి రొమ్ము గుద్దేరకమని దుయ్యబట్టారు. కోటంరెడ్డి పార్టీని వీడిపోవడంతో పీడ, దరిద్రం వదిలిపోయిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారితేనే వైఎస్ జగన్ వెరవలేదని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు సమాధి కడతారని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు, సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భారతావని అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు



ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): భారతావని భవిష్యత్ అవసరాలు, అభివృద్ధే లక్ష్యంగా ఈ ఏడాది కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏపీకి 50 లక్షల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించినప్పటికీ టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ఏపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సోము వీర్రాజు స్పందిస్తూ.. గతంలో టీడీపీ హయాంలో వైఎస్సార్‌సీపీ నేతల ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నారు. ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ సాల్మన్.. సాగు సక్సెస్..

ఉప్పునీటి జలాల్లో సాగవుతున్న సముద్ర చేప

దేశంలోనే తొలిసారి కేజ్ కల్చర్‌లో సాగు..

పైలట్ ప్రాజెక్టుగా సాగుచేస్తున్న కృష్ణా రైతు

- వాడుకలో ఇది 'మాగ' చేప
- కిలో ధర రూ.450 పైనే..
- విదేశాల్లో గిరాకీ ఎక్కువ
- వారానికి రెండురోజులు తింటే.. క్యాన్సర్, గుండెపోటు దూరం
- రొయ్యలకు ప్రత్యామ్నాయంగా దీనిపై రైతుల దృష్టి



నాగాయలంక వద్ద ఇండియన్ సాల్మన్ (మాగ) చేపలు సాగు చేస్తున్న కేజ్‌లు

సాక్షి, అమరావతి: ఇండియన్ సాల్మన్.. మన వాడుక భాషలో 'మాగ'గా పిలిచే ఈ చేపలను దేశంలో తొలిసారి మన రాష్ట్రంలో సాగుచేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా కృష్ణాజిల్లా నాగాయలంక వద్ద కేజ్ కల్చర్‌లో చేపట్టిన ఈ చేపల సాగు విజయవంతమైంది. దీంతో చెరువుల్లో సాగుచేసే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. సముద్రచేపల్లో అత్యంత రుచికరమైన వాటిలో ఇదొకటి. జంతుశాస్త్రపరంగా సాల్మో సాలార్‌గా పిలిచే ఈ చేప మన దేశానికి చెందినది కాదు. పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాల్లో పెరిగే 'సాల్మో నిడ్స్' సమూహానికి చెందినది. 5 నుంచి 10 అడుగుల లోతులో చల్లటి ఉప్పునీటి జలాల్లో మాత్రమే ఇవి పెరుగుతాయి. ఇవి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సముద్రపునీరు, మంచినీరు కలిసే చోటుకువచ్చి గుడ్లు పెట్టి పొదిగి తిరిగి సముద్ర జలాల్లోకి వెళ్లిపోతాయి. ఇవి 10 కిలోల వరకు పెరుగుతాయి. పొడవుగా, నునుపాటి శరీరంతో ఉండే ఈ చేపకు పైభాగానే చిన్న నల్లటి చుక్కలుంటాయి. కింద భాగం (పొట్ట) తెల్లగా ఉంటుంది. మలేషియా, కువైట్‌లలో మాత్రమే వీటిని సాగుచేస్తున్నారు. ఈ చేపల తొలి హేచరి మలేషియాలో ఉంది. సముద్ర జలాల్లో సహజసిద్ధంగా దొరకడమే తప్ప.. వీటిసాగుపై ఇన్నాళ్లు దృష్టి పెట్టలేదు.



పోషకాలు పుష్కలం..

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉండే ఈ చేపల్లో విటమిన్స్, కాల్షియం, సోడియం, పొటాషియం, మెగ్నీషియం, సెలీనియం, అయోడిన్‌కు కొదవలేదు. వారానికి కనీసం రెండుసార్లు తిన్నవారిలో గుండెపోటు, క్యాన్సర్, ట్యూమర్స్ దరిచేరవు. బీపీ తగ్గడమే కాదు.. ఎముకలు బలపడతాయి. నాడీవ్యవస్థ, మెదడు పనితీరు మెరుగుపడడమేగాక జ్ఞాపకశక్తి పెరుగుతుందని, వయసు సంబంధిత నష్టం తగ్గిస్తాయని అధ్యయనాల్లో రుజువైంది. మన దేశంలో మత్స్యకారులకు ఈ చేపలు అరుదుగా దొరుకుతాయి. మార్కెట్‌కు 'మాగ' చేప వస్తే చాలు.. ఎంత రేటైనా ఎగరేసుకుపోతారు. వెన్నుముల్లు మాత్రమే ఉండే ఈ చేపను వేపుడు చేసుకునేందుకు ఎక్కువ మంది ఇష్టపడతారు. ఇగురు, పులుసు కూడా వండుకుంటారు. రొయ్యలకు ప్రత్యామ్నాయంగా రైతులు ఈ చేపలసాగుపై దృష్టి సారిస్తున్నారు.

పెట్టుబడికి రెట్టింపు ఆదాయం

దేశంలో తొలిసారి కృష్ణాజిల్లా నాగాయలంక వద్ద సముద్ర జలాల్లో ప్రయోగాత్మకంగా కేజ్ కల్చర్ విధానంలో వీటిసాగు చేపట్టారు. కేజ్ కల్చర్‌లో విజయవంతం కావడంతో చెరువుల్లో సాగుపై దృష్టిసారించారు. కేజ్‌ల్లో అరకిలోకు మించి పెరగవు. అదే నాలుగడుగుల లోతున్న చెరువుల్లో 8–12 నెలలు పెంచితే కిలో నుంచి రెండుకిలోల వరకు పెరుగుతాయి. సీ మౌత్‌లో దొరికే సీడ్‌ను నర్సరీ చెరువులో మూడంగుళాల సైజు వరకు పెంచి తర్వాత ఎకరా చెరువులో రెండువేల పిల్లల వరకు వేయవచ్చు. 45 శాతం ప్రొటీన్లు, 12 శాతం కొవ్వు పదార్థాలు కలిగిన మేత వేస్తే చాలు. వ్యాధి నిరోధకశక్తి అధికం కాబట్టి వ్యాధులకు కూడా దూరంగా ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధర కిలో రూ.450కి పైగా పలుకుతోంది. కిలోకి రూ.225 వరకు పెట్టుబడి అవుతుంది. రెట్టింపు ఆదాయం వస్తుంది. ఈ చేపల సాగుపై లోతైన అధ్యయనం చేసి రైతులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

తొమ్మిదేళ్లు శోధించా



కొన్నేళ్లుగా కేజ్‌కల్చర్‌లో పండుగప్ప సాగుచేస్తున్నా. ఇండియన్ సాల్మన్ సాగు చేయాలని తొమ్మిదేళ్ల నుంచి ఎంతో లోతుగా అధ్యయనం చేసి ఇటీవలే ప్రయోగాత్మకంగా చేపట్టా. సీ మౌత్‌లో పిల్లలను సేకరించి వేశా. పోషక విలువలున్న మేత అందిస్తున్నా. నాలుగు నెలల్లో పావుకిలో సైజు పెరిగాయి. మరో మూడు నెలలు పెంచితే ముప్పావు కిలోవరకు వస్తాయి. రూ.లక్షన్నర వరకు పెట్టుబడి అవుతుంది. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నా. చెరువుల్లో సాగుకు ఎంతో అనుకూలమైన ఈ చేపల సాగుపై రైతులు దృష్టిసారిస్తే మంచిది.

– తలశిల రఘుశేఖర్, నాగాయలంక, కృష్ణాజిల్లా

టీడీపీ నేత కుమార్తెకు 'జగనన్న విదేశీ విద్యా దీవెన'

- వాషింగ్టన్‌లో చదువుతున్న విద్యార్థిని శైలజ
- తొలి విడతలో రూ.13,99,154 అందజేత.. రెండేళ్లలో సుమారు రూ.84లక్షల ఆర్థిక సాయం
- పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారని టీడీపీ నేత హర్షం



కలెక్టర్ సూర్యకుమారి నుంచి విదేశీ విద్యా దీవెన నమూనా చెక్కు అందుకుంటున్న శైలజ తల్లిదండ్రులు

వంగర: ప్రభుత్వ పథకం ఏదైనా పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ అందాలనేది సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. అందుకు అనుగుణంగానే రాష్ట్రవ్యాప్తంగా విపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. తాజాగా 'జగనన్న విదేశీ విద్యాదీవెన' కింద టీడీపీ నేత కుమార్తెకు లబ్ధి చేకూరడం ఇందుకు నిదర్శనం. విజయనగరం జిల్లా వంగర మండలం సంగాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచి బొద్రోతు శ్రీనివాసరావు, వేణమ్మల కుమార్తె శైలజ ఈ పథకానికి ఎంపికైంది. తొలి విడతగా శుక్రవారం ఆమె ఖాతాకు రూ.13,99,154 ప్రభుత్వం జమ చేసింది. నమూనా చెక్కును శైలజ తల్లిదండ్రులు శ్రీనివాసరావు, వేణమ్మలకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం అందజేశారు. రెండేళ్లలో విద్యార్థిని చదువుకు ప్రభుత్వం సుమారు రూ. 84 లక్షలు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. సీఎం జగన్ పార్టీలకు అతీతంగా సుపరిపాలన అందిస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం అర్హతే ప్రామాణికంగా విద్యార్థులను గుర్తించి సాయం అందిస్తున్నారని బొద్రోతు శ్రీనివాసరావు హర్షం వ్యక్తంచేశారు.

యనమల.. ఇవన్నీ కనిపించడం లేదా?

2021-22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వృద్ధిరేటు 11.43 శాతం

- 2018–19లో ఇది కేవలం 5.36 శాతమే
- 4 శాతం వృద్ధిరేటు క్షీణించడం అసంభవం
- దీనిపై టీడీపీతో చర్చకు సిద్ధం
- నవరత్నాల రూపంలో అందించిన సంక్షేమం రూ.1.92 లక్షల కోట్లకుపైనే..
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన వెల్లడి

సాక్షి, అమరావతి: సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర బిందువుగా ఏపీ ముందుకు సాగుతోందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. దీంతో ఎన్నడూ లేని విధంగా 2021–22 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల్లో ఏపీ స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 11.43 శాతంగా నమోదైందన్నారు. అర్థగణాంక శాఖ నివేదిక ప్రకారం.. ఈ విభాగంలో ఏ రాష్ట్రంతో పోల్చినా ఏపీదే అగ్రస్థానమని స్పష్టం చేశారు. కోవిడ్ కష్టకాలంలోనూ ప్రజలకు ఏ కష్టం రానీయలేదని గుర్తుచేశారు. ఎన్నికల హామీలను మరిచిపోకుండా కోవిడ్ విపత్తు నుంచి బయటపడిన విధానాన్ని యావత్ ప్రపంచం మెచ్చిందన్నారు. దీంతో ప్రతిపక్షాలకు కంటి మీద కునుకు లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఇందులో భాగంగానే టీడీపీ నేత యనమల రామకృష్ణుడు నిరాధార ఆరోపణలు, అసత్యాలతో ప్రకటనలు విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆయన (–)4 శాతం వృద్ధిరేటు క్షీణత అని పత్రికా ప్రకటన ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు మంత్రి బుగ్గన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. యనమలతోపాటు టీడీపీ నేతలు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ధ్వజమెత్తారు. స్థిర ధరల ప్రకారం లెక్కిస్తేనే రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధిరేటు 11.43 శాతమని.. అదే ప్రస్తుత ధరల ప్రకారం అయితే 18.47 శాతంగా ఉందని తెలిపారు. ఏ ప్రకారం చూసినా, ఏ విధంగా లెక్కేసినా వృద్ధిరేటు నాలుగు శాతం క్షీణించడం అనేది అసంభవమని స్పష్టం చేశారు. ఇంకా మంత్రి బుగ్గన ప్రకటనలో ఏం చెప్పారంటే..



జాతీయ స్థాయిని మించి వ్యవసాయంలో ఏపీ వృద్ధి

వ్యవసాయ రంగంలో రాష్ట్ర వృద్ధి రేటు 11.27 శాతంగా ఉంది. జాతీయ స్థాయిలో ఇది కేవలం 3.0 శాతమే. ఇందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రైతు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలే కారణం. విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలు అందించేలా రాష్ట్రవ్యాప్తంగా 10,778 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. ఇవే కాకుండా ప్రతి గ్రామంలో సచివాలయాలు, మిల్క్ చిల్లింగ్ స్టేషన్లు, డిజిటల్ లైబ్రరీలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను కూడా నిర్మించాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క భవనమైనా నిర్మించారా అని యనమల ప్రశ్నించడం హాస్యాస్పదం. నవరత్నాల రూపంలో పేదలకు రూ.1.92 లక్షల కోట్లకుపైగా సాయం అందించాం. 104, 108 అంబులెన్సులు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, పశువుల కోసం ప్రత్యేకంగా మరో 340 వాహనాలు, స్కిల్ హబ్స్ ఇవన్నీ యనమలకు కనిపించడం లేదా?

చంద్రబాబు హయాంలో కంటే మిన్నగా..

కోవిడ్ సమయంలో దేశ వృద్ధిరేటు (–)6.60 శాతం నమోదైతే రాష్ట్రం 0.08 శాతం వృద్ధి నమోదు చేసింది. 2018–19లో వ్యవసాయ రంగంలో 3.54 శాతం జీఎస్‌డీపీ మాత్రమే నమోదైంది. అదే 2021–22లో ఇది 11.27 శాతానికి చేరుకుంది. అలాగే 2018–19లో పారిశ్రామిక రంగంలో 3.17 శాతం జీఎస్‌డీపీ మాత్రమే నమోదైంది. ఇది 2021–22కి 12.78 శాతానికి చేరుకుంది. అదేవిధంగా 2018–19లో సేవా రంగంలో 4.84 శాతం జీఎస్‌డీపీ మాత్రమే ఉండగా 2021–22కి ఇది 9.73 శాతంగా నమోదైంది. 2018–19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 5.36 శాతం వృద్ధి రేటు మాత్రమే ఉండగా 2021–22లో ఏపీ 11.43 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది.

అప్పులపైనా తప్పుడు ప్రచారం

అప్పులపైనా టీడీపీ వర్గాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. 2022 మార్చి నాటికి ఏపీ మొత్తం అప్పులు రూ.3,98,903 కోట్లని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయక మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్‌లో ప్రకటించారు. ఆ లెక్క ప్రకారం..ఈ మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు రూ.1,34,452 లక్షల కోట్లు మాత్రమే. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికే రూ.2,64,451 కోట్ల రుణ భారంలో ఏపీ ఉంది. ప్రస్తుత ధరల ప్రకారం.. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,07,771 కోట్లు. దేశ తలసరి ఆదాయం రూ.1,50,007 కోట్లు. అంటే రాష్ట్ర తలసరి ఆదాయం.. దేశ తలసరి ఆదాయం కంటే 38.5% ఎక్కువ. తలసరి ఆదాయం అంశంలో ఏపీ దేశంలో ఆరో స్థానంలో ఉంది. ఈ విషయాల్లో యనమల చెప్పే లెక్కలన్నీ తప్పుడు లెక్కలే. అలాగే కేంద్ర గణాంకాల ప్రకారం.. తెలంగాణ 7.81 శాతంతో అత్యధిక ద్రవ్యోల్బణ రేటును కలిగి ఉంది. తర్వాత మధ్యప్రదేశ్ ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్ ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వ పాలనలో ష్యూరిటీ లేకుండా ఇష్టమొచ్చినట్లు చేసిన అప్పులు, గుదిబండలా వదిలేసిపోయిన బకాయిలు, నెలల తరబడి జీతాలివ్వక చిన్న ఉద్యోగులను క్షోభపెట్టిన వైనం, జన్మభూమి కమిటీల అరాచకాలు, భూముల కుంభకోణాలు, ఫైబర్‌నెట్ స్కామ్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లపై యనమలతో చర్చకు సిద్ధం. నీతి ఆయోగ్ 2020–21లో ప్రకటించిన ఎస్‌డీజీ ఇండెక్స్ ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ 72 స్కోరుతో 4వ స్థానంలో నిలిచింది. 2018–19లో ఈ స్కోర్ 64 మాత్రమే.

2018-19 నుంచి 2021-22 వరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధిరేటు ఇలా..

రంగం	2018-19	2019-20	2020-21	2021-22
వ్యవసాయం	3.54	8.6	2.68	11.27
పారిశ్రామిక	3.17	3.91	0.33	12.78
సేవా	4.84	8.25	1.68	9.73
వృద్ధిరేటు శాతం	5.36	6.89	0.08	11.43

అసైన్డ్ భూముల సమస్యలకు చెక్ పెడతాం

- త్వరలో పలు రాష్ట్రాలు సందర్శించి నివేదిక రూపొందిస్తాం
- అసైన్డ్ భూముల చట్టం 77ఏలో సవరణలు చేయనున్నాం
- రెవెన్యూ శాఖ ప్రాంతీయ సదస్సులో మంత్రి ధర్మాన



సాక్షి, విశాఖపట్నం: భూమిని పెద్ద ఎత్తున వినియోగంలోకి తీసుకువస్తే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థలో కీలక సంస్కరణలు చేపడుతున్నామని మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ అధికారుల ప్రాంతీయ సదస్సును విశాఖపట్నంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ రాష్ట్రంలో అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ మంత్రిగా తన ఆధ్వర్యంలో సీఎం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారని చెప్పారు. త్వరలోనే ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తుందన్నారు. ఆయా రాష్ట్రాల్లో అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలపై అధ్యయనం చేసి ముఖ్యమంత్రికి నివేదిక సమర్పిస్తామన్నారు. అనంతరం సీఎం ఆదేశాల మేరకు అసైన్డ్ భూముల చట్టం 77ఏలో అవసరమైతే సవరణలు చేస్తామని వివరించారు. అలాగే రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యుటేషన్ అయ్యేలా సాంకేతికతని అమలు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ వివాదాల్లో చిక్కుకున్న భూముల సమస్యల్ని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తద్వారా నిజమైన హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. బ్రిటిషర్లు చేపట్టిన సర్వే రికార్డులనే ఇప్పటికీ వినియోగిస్తుండటం దురదృష్టకరమన్నారు. దీన్ని మార్చడానికే రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతతో భూ సర్వే చేపట్టిందని వెల్లడించారు.

సవాళ్లని అధిగమించేందుకు..

చుక్కల భూములు, తదితరాల్లో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న వారికి యాజమాన్య హక్కులు ఇచ్చే విధంగా నిబద్ధతతో కాలానుగుణ ప్రణాళిక చేపడుతున్నామని తెలిపారు. రూ.12 వేల కోట్ల ఖర్చుతో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం చరిత్రాత్మకమన్నారు. కీలక సంస్కరణలు చేపడుతున్న సమయంలో ఎదురవుతున్న సవాళ్లని అధిగమించేందుకు ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ సదస్సులో సీసీఎల్‌ఏ కమిషనర్ సాయిప్రసాద్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బి.రామకృష్ణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ఇంతియాజ్‌తో పాటు విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్లు, జేసీలు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, డీఆర్‌వోలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వాడిన పూలూ గుబాళిస్తున్నాయ్

▶ మొదటి పేజీ తరువాయి

సాంబ్రాణి కడ్డీలను తయారు చేస్తున్నారు.

15లక్షల అగరువత్తుల ప్యాకెట్ల తయారీ

అన్నవరం సత్యనారాయణస్వామి అలంకరణకు ఉపయోగించిన పుష్పాలను రోజుకు 60 నుంచి 80 కిలోల వరకు సేకరించి టి.తిమ్మాపురం తరలిస్తున్నారు. వీటిని ఎండబెట్టి పౌడర్ చేసిన అనంతరం తులసి, పారిజాతం, స్వర్ణ, సంపంగి, చందనం పరిమళాలతో అగరువత్తులు, రెండు రకాల సాంబ్రాణి కప్పులు (కడ్డీలు) తయారు చేస్తున్నారు. ప్రస్తుతం నిత్యం 15 కుటుంబాలకు చెందిన స్వయంశక్తి సంఘాల మహిళలు రోజుకు ఐదువేల అగరువత్తి ప్యాకెట్లు, డిమాండ్‌ను బట్టి సాంబ్రాణి కడ్డీలను తయారు చేస్తున్నారు. ఇలా ఏడాదికి 15 లక్షల ప్యాకెట్లు తయారు చేస్తున్నారు. 60 గ్రాముల ప్యాకెట్ రూ.50, 120 గ్రాముల ప్యాకెట్ రూ.100, 130 గ్రాములు



అమ్మవార్ల పేరుతో చేసిన అగరువత్తి ప్యాకెట్లు

సాంబ్రాణి కడ్డీల (30) ప్యాకెట్ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా ఏడాది తిరగకుండానే రూ.1.50 కోట్ల లావాదేవీలు నిర్వహించి పెద్దపెద్ద వ్యాపారులను ఆశ్చర్యచకితులను చేస్తున్నారు. ఈ అగరువత్తులను అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం, లోవ కొత్తూరు తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం, విశాఖపట్నంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోవిక్రయిస్తున్నారు. వీటికి డిమాండ్ పెరుగుతుండటంతో మార్కెట్‌ను విస్తరించేందుకు అమెజాన్‌తో ఒప్పందం కుదిరింది.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న సాంబ్రాణి కడ్డీలు

విస్తరణకు తోడ్పాటు అందిస్తాం



కుటుంబ సభ్యులు సంయుక్తంగా నిర్వహిస్తున్న అగరువత్తుల తయారీ యూనిట్‌కు రుణం మంజూరుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే స్త్రీ నిధిలో రూ.లక్ష రుణం ఇచ్చాం. పీఎంఎఫ్ఎంఈ పథకంలో రూ.10 లక్షల రుణం మంజూరుకు బ్యాంకులతో చర్చిస్తున్నాం.

– వై.సత్తిబాబు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతిపథం, తుని మండలం

వీటికి డిమాండ్ పెరిగింది



మేం సేకరించిన పుష్పాలతో అగరువత్తులు తయారు చేసి దైవసన్నిధిలో భక్తులకు విక్రయించడం సంతృప్తినిస్తోంది. పుష్పాలను పౌడర్ చేయడం, పౌడర్‌ను ముద్దగా కలపడం, కలిపిన ముద్దను అగరువత్తులుగా తయారు చేయడానికి ప్రత్యేకంగా యంత్రాలు అవసరం. యంత్రాల కొనుగోలుకు రూ.10 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు పెట్టుబడి అవసరం. ప్రభుత్వం సహకరిస్తే మరికొందరు మహిళలకు ఉపాధి లభిస్తుంది.

– పోల్నాటి సూరన్న, శ్రీపవన్ సూర్య ట్రేడర్స్, టి.తిమ్మాపురం



పూర్తిగా బయటపడ్డ సంగమేశ్వరాలయం

సంగమేశ్వరాలయం శుభ్రం

కొత్తపల్లి(నంద్యాల): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరాలయం కృష్ణాజలాల నుంచి శనివారం పూర్తిగా బయట పడింది. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో సంగమేశ్వరాలయం ప్రాకారంలో మట్టిని పూడిక తీసి శుభ్రం చేశారు. వేపదారు శివలింగం పూజలకు సిద్ధం చేశారు. స్వామి దర్శనానికి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు.



ఆయన భూమ్యంతములవరకు చూచుచున్నాడు.
ఆకాశము క్రింది దానినంతటిని తెలిసికొనుచున్నాడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** పౌర్ణమి రా.11.12 వరకు తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** పుష్యమి ఉ.11.56 వరకు, తదుపరి ఆశ్లేష,**వర్జ్యం:** రా.2.08 నుండి 3.55 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.23 నుండి 5.06 వరకు, **అమృతఘడియలు:** రా.12.44 నుండి 2.30 వరకు, మాఘ పౌర్ణమి.

సూర్యోదయం : 6.35, **సూర్యాస్తమయం** : 5.53, **రాహుకాలం :** సా.4.30 నుంచి 6.00 వరకు **యమగండం :** ప.12.00 నుంచి 1.30 వరకు

జో రోత్ (డిజాస్టర్ గర్ల్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

నన్నంతా 'దెయ్యప్పిల్ల' అంటారు. మంచమ్మాయినే. పేరు అలా వచ్చేసింది. పేరైనా ఊరికే అలా వచ్చేయదు కదా! మా నాన్న చేసిన పని.

ఇప్పుడు నా వయసు 22. ఓసారి 2005లోకి వెళ్దాం. వెళ్దాం కాదు. వెళ్లాలి. దెయ్యప్పిల్ల అని నాకా పేరు ఎందుకు వచ్చిందో మీకు తెలియాలి. అప్పుడు నేను చాలా చిన్నదాన్ని. నార్త్ కరోలినాలో ఉండేవాళ్లం. ఓరోజు నేను, నాన్న ఇంట్లో ఉన్నాం. బయటేవో భగభగమని మంటలు రాజుకుంటుంటే చుట్టు పక్కల వాళ్లంతా ఇళ్లలోంచి బయటికి వచ్చి చూస్తున్నారు. ఎవరిదో ఇల్లు కాలిపోతోంది!



నేను, నాన్న.. వాళ్లకంటే ముందే బయటికి వచ్చేశాం. నాన్న పేరు డేవ్. ఆయన ఫొటో గ్రాఫర్. నిద్ర పోతున్నప్పుడు కూడా ఆయన మెడలో కెమెరా ఉండాల్సిందే. మంటలు ఆర్పే వాళ్లొచ్చి ఆ మంటలపై పైపులతో నీళ్లు చిమ్ము తున్నారు. మంటలు ఎగిసి పడుతున్నాయే కానీ, తగ్గుముఖం పట్టడం లేదు. అప్పుడు నాన్నకేదో ఆలోచన వచ్చినట్లుంది. వెంటనే కెమెరాను సెట్ చేసుకున్నారు. "తల్లీ.. ఫొటోకు పోజ్ ఇవ్వరా.." అన్నారు. బ్యాక్‌డ్రాప్‌లో ఇల్లు కాలిపోతున్న మంటలు. వాటి ముందు నేను. ఇదీ యాంగిల్. నాన్న చెప్పినట్లే పోజ్ ఇచ్చాను. "కాస్త నవ్వు ముఖం పెట్టు" అన్నారు నాన్న. ఇప్పుడైతే ఆ మాటకు ఆశ్చర్యపోయేదాన్ని. ఆ సమయంలో నవ్వు ఎలా వస్తుంది నాన్నా అని! అప్పుడు మాత్రం నాన్న చెప్పినట్లే నవ్వు ముఖం పెట్టాను.

"గుడ్" అన్నారు నాన్న.

నాన్న 'గుడ్' అని ఎందుకు అన్నారంటే.. నా నవ్వు డెవిలిష్‌గా ఉందట! అంటే దెయ్యప్పిల్ల నవ్వుతున్నట్లుగా!

తర్వాత రెండేళ్లకు ఆ ఫొటోను ఏదో పోటీకి పంపుతూ 'డిజాస్టర్ గర్ల్' అనే కాప్షన్ పెట్టారు నాన్న. ఆ ఫొటోకి ప్రైజ్ వచ్చింది. అలా ఫొటో ప్రపంచమంతటా పాపులర్ అయింది. దాన్ని పాపులర్ అనకూడదేమో. ఎక్కడైనా ఏదైనా ఘోరం జరిగితే నా ఫొటో వాడటం మొదలుపెట్టారు! స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోతే 'డిజాస్టర్ గర్ల్' అంటూ నా ఫొటో. సునామీలొస్తే 'డిజాస్టర్ గర్ల్' అంటూ నా ఫొటో. భూకంపాలు, ఘోర దుర్ఘటనలు సంభవిస్తే 'డిజాస్టర్ గర్ల్' అంటూ నా ఫొటో. ఇప్పుడు ఉక్రెయిన్‌పై రష్యా దాడులకు కూడా!

చరిత్రలో జరిగిపోయిన వాటికి కూడా 'డిజాస్టర్ గర్ల్'గా నేనొక మీమ్ అయ్యాను. టైటానిక్ మునక, ప్రపంచ యుద్ధాలు : ప్లేగు, కలరా వ్యాధులు అన్నిటికీ నా ఫొటోనే వాడేస్తున్నారు. ఇలా నా ఫొటోను పత్రికల్లో, ఇంటర్నెట్‌లో చూస్తూ పెరిగాను నేను. ఈమధ్యే ఆ 'విపత్తు ఫొటో' ఒరిజినల్ ఐదు లక్షల డాలర్లకు వేలంలో అమ్ముడయింది!

ఓరోజు నాన్నను అడిగాను. "ఎందుకు నాన్నా అప్పుడు నా ఫొటోను అలా తీశావు?" అని. నాన్న నవ్వారు.

"వెనుక మంటలు, ముందు నీ కూతురి చిరునవ్వులు కలిపి ఫొటో తీస్తే ఇప్పుడిలా భారీ ధరకు అమ్ముడు పోతుందని ముందే ఊహించావా?" అని అడిగాను.

"లేదు లేదు. ఊరికే ఓ ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన కూడా ఎందుకొచ్చిందంటే.. మంటల్ని చూసి హడావిడిగా బయటికి వచ్చామా మనిద్దరం.. అయితే అది అగ్ని ప్రమాదం కాదనీ, అగ్ని మాపకదళం వారే ట్రైనింగ్‌లో భాగంగా ఒక సెట్టింగ్‌ను తగలబెట్టి మంటల్ని ఆర్పుతున్నారని తెలిసి ఆశ్చర్యపోయి, హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని, ఆ సంతోషంలో నీ ముఖంలో నవ్వుల్ని పూయించాను.

ఆ ఫొటోని చూస్తే ఎవరికైనా వెంటనే వచ్చే ఆలోచన.. 'ఏంటీ పిల్ల.. ఇల్లు తగలబడి పోతుంటే నవ్వుతూ చూస్తోంది..' అనే కదా. అలాంటి ఆలోచన రప్పించడం కోసమే ఆరోజు నేను అలా ఫొటో తీశాను" అన్నారు నాన్న. అనుకోకుండా ఫొటోగ్రాఫర్‌గా ఆయనకు పేరు. ఫొటోలో ఉన్న చిన్నారిగా ఇప్పుడు నాకు గుర్తింపు వచ్చాయి.

కానీ నా అసలు పేరు జో రోత్ అని నేను కూడా మర్చిపోయాను. దెయ్యప్పిల్ల. అంతే!

యాదవ సంస్కృతీ ప్రతీక పెద్దగట్టు జాతర



మన తెలంగాణలోని సూర్యాపేట జిల్లా కేంద్రానికి అతి సమీపంలో దురాజ్ పల్లి గ్రామం సరిహద్దున గల పాల శేర్లయ్య గుట్ట లేదా గొల్లగట్టుపై వెలసిన యాదవుల ఆరాధ్య దైవం పెద్దగట్టు లింగమంతు లస్వామి. ఈ దేవుడినే యాదవులు 'లింగన్న' అని పిలుచుకుంటూ, శివాంశ సంభూతునిగా భావిస్తూ, తమ జాతికోసం ప్రాణాలు అర్పించిన వీరునిగా, తమ ప్రధాన సంపదయైన పశువుల, పాడి పంటల సంరక్షకునిగా భావిస్తూ పూజిస్తారు. ఇక్కడనే ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జాతర హక్కుదారులైన కేసారం గ్రామంలోని గొల్ల కులానికి చెందిన మెంతబోయిన వంశస్థులు... గుంపుల, తిరు మలగిరి, చివ్వెంల, కాంపాడు గ్రామాల లోని గొల్లకులానికి చెందిన మున్న వంశస్థులూ; కేసారం గ్రామంలోని కాపు కులానికి చెందిన గొర్ల వంశ స్థులూ; చీకటాయపాలెం, మిర్యాల, వెంపటి గ్రామాలకు చెందిన బైకాని పూజారులైన తండు, మట్ట వంశస్థులతో కలిసి ఘనంగా జాతర జరుపుకుంటారు. ఈ జాతరను 'శ్రీ లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి జాతర', 'పెద్దగట్టు జాతర', 'గొల్లగట్టు జాతర'అనే పేర్లతో పిలుస్తారు.

గొల్లలు ఈ ఏడాది జాతర ప్రారంభానికి 15 రోజుల ముందే ఆదివారం అర్ధరాత్రి ఘనంగా దిష్టి పూజ నిర్వహించారు. వీరు ఈ నెల ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం నుండి 9వ తేదీ గురువారం వరకు ఐదు రోజులు తమ కుల సంస్కృతీ సంప్రదాయ ఆరాధన పద్ధతుల్లో జాతరను కన్నుల పండువలా జరుపుకుంటారు.

మొదటి రోజున జాతర హక్కు దారులైన గొల్లలు తమ సంప్రదాయ బైకాని పూజారులతో కలిసి కేసారం గ్రామం నుండి గొల్లగట్టుకు 'దేవరపెట్టె'ను సంప్రదాయ పద్ధ తిలో ఊరేగింపు చేసుకుంటూ తీసు కునివస్తారు. ఈ దేవర పెట్టెలో గొల్లల ఆరాధ్య దైవం లింగమంతుల స్వామితో పాటు 33 మంది దేవతాగణం ఉంటారు. ఈ ఊరేగింపులో బైకాని పూజారులు సంప్రదాయ వాయిద్యాలైన వీరణం, తాళా లను వాయిస్తూ కథా గానం చేస్తారు, గొల్లలు భేరీలను మోగిస్తూ, జానపద గేయాలు పాడుతూ... తలకు ఎర్రని కుల్లాలు పెట్టుకొని, చేతులలో త్రిశూలాలు, కటార్లు పట్టు కొని 'ఓలింగా.... ఓ లింగా...' అంటూ సంప్రదాయ రీతిలో నృత్యాలు చేసుకుంటూ గొల్లగట్టుకు వస్తారు. అలాగే జాతర హక్కుదారులైన స్త్రీలతోపాటు మిగతా కులాల స్త్రీలు 'మందగంపలు' నెత్తిన పెట్టుకొని జాతరకు వస్తారు.

రెండవ రోజు జాతర హక్కుదారులైన గొల్లలు తమ బైకాని పూజారులతో ఆల యంలోని దేవరపెట్టె ముందు పాడి పసుపుతో ఒకటీ, తడి పసుపుతో మరొకటీ ప్రత్యేక ముగ్గులు వేస్తారు. ఈ పోలునే 'ముద్దర పోలు, ముత్యాల పోలు, లగ్గం పోలు' అని పిలుస్తారు. దీనిపై దేవరపెట్టెను ఉంచుతారు. అనంతరం 'రాశిబోనం, సందవసర బోనం సమర్పణ' చేస్తారు. తర్వాత బైకాని పూజారులు బొట్టు పెట్టి, కంకణం కట్టి తమ విధిని నిర్వర్తిస్తారు. మున్నా, మెంతబోయిన వారు కటార్లు ఎత్తి ఓలింగా... ఓలింగా... అని అరుస్తూ ఆ కటార్లను తమ ఛాతికి ఆనించుకుంటారు. బైకాని పూజారులు ఆ కటారులు ఆనించుకున్న చోట పసుపును పూస్తారు. తరు వాత లింగ మంతుల స్వామి, చౌడమ్మ తల్లికి ఎదురుగా ఉన్న పోతరాజు వద్ద 'జడత పట్టి' మూడు యాటలను బలిస్తారు.

మూడవ రోజు జాతర హక్కుదారులైన గొల్లలు తమ బైకాని పూజారులతో పంచరంగులతో చంద్రపట్నం వేయించి లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. నాలుగవ రోజు జాతర హక్కుదారులైన గొల్లలు తమ పశువుల మంద నుండి తెచ్చిన పాలను పొంగిస్తారు. రెండు బోనాలను వండి పసుపు, కుంకుమ, బంతి పూలతో అలంకరిస్తారు. బైకాని పూజా రుల వాయిద్యాల చప్పుళ్ల మధ్య మున్నా, మెంతబోయినవారు ఆ రెండు బోనాలు ఎత్తుకొని వచ్చి చంద్రపట్నంపై ఉన్న లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లికి నైవేద్యంగా పెట్టి మొక్కుతారు. తరువాత తమ మంద నుండి తెచ్చిన గొర్రెను లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి ఎదురుగా ఉన్న పోతరాజు వద్ద బలిస్తారు. ఇక చివరిదైన 5వ రోజు జాతర హక్కుదారులైన గొల్ల లతో పాటు మిగతా కులాలకు చెందిన లక్షలాది మంది భక్తులు లింగమంతుల స్వామి, చౌడమ్మతల్లికి కడసారిగా మొక్కులు చెల్లించి ఇంటి ముఖం పడతారు. మొత్తంగా ఈ జాతర యాదవుల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ జాతరను రాష్ట్ర జాతరగా ప్రభుత్వం గుర్తించాలని యాదవుల కోరిక.

– డా।। తిరుపతి పోతరవేణి
కాకతీయ వర్సిటీ, వరంగల్
మొబైల్: 99631 17456
(నేటి నుంచి 9వ తేదీ వరకు పెద్ద గట్టు జాతర జరుగుతున్న సందర్భంగా)

సీబీఐ నుంచి రామోజీ 'లైవ్' రిపోర్టింగ్

లేఖ గురించి వైఎస్ వివేకా కుమార్తె సునీత చెప్పిన అంశాలను విలేకరులకు వెల్లడించిన డీఐజీ (నాటి ఈనాడు క్లిప్పింగ్)



అవినాష్‌రెడ్డి పీఏ నుంచే తొలి కాల్

సీబీఐ లీకులా... వైస్రాయ్ మాదిరిగా రామోజీ అబద్ధాల రిపోర్టింగా?

అప్పుడు హోటల్లో పట్టుమని పదిమంది ఎమ్మెల్యేలు కూడా లేరు. కానీ... "ఇదిగో యాభై మంది వచ్చేశారు... అదిగో ఆ సంఖ్య 100కు పెరిగింది. ఇంకేముంది... అంతా ఇక్కడికే చేరారు... అందరూ చంద్రబాబుకే మద్దతు పలుకుతున్నారు" అంటూ 1995 ఆగస్టులో పచ్చి అబద్ధాలతో 'లైవ్ రిపోర్టింగ్' చేశారు రామోజీరావు గారు. ఫలితంగా ఎన్టీఆర్ ప్రభుత్వం కూలిపోయింది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఇది జరిగి 26 ఏళ్లు గడిచిపోయినా 'ఈనాడు' మారలేదు. ఆ తరహా 'లైవ్' రిపోర్టింగ్ మానలేదు!!.



వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయాడని ఆయన బావమరిది శివప్రకాష్‌రెడ్డి విజయవాడలో ఉన్న తనకు ఫోన్ చేసి చెప్పాడని టీడీపీ నాయకుడు, ఆదినారాయణరెడ్డి సిట్ విచారణ సందర్భంగా చెబుతున్న దృశ్యం.. ఇందుకు సంబంధించిన వీడియో లింక్ https://www.youtube.com/watch?v=uGiQpc&ANqw

'ఈనాడు' మారకపోయినా కాలం మారింది. మీడియా మారింది. రామోజీ చెప్పిందే నిజమనే భ్రమలు పోయి.. ఆయన అబద్ధాలు తప్ప ఏమీ చెప్పలేరనే నిజం బయటపడింది. వైఎస్ వివేకా హత్యకేసులో కొద్దిరోజులుగా సీబీఐ పేరు చెబుతూ 'ఈనాడు' వండి వారుస్తున్న కథనాల వెనక ఉద్దేశాలు సుస్పష్టం. ఎన్ని అబద్ధాలు చెప్పయినా కడప ఎంపీ అవినాశ్ రెడ్డిపై బురదజల్లాలి. అలా చేస్తే.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు ఆయన బంధువు కనక సీఎం కుటుంబానికి కూడా కాస్త బురద అంటించొచ్చు. తద్వారా పూర్తిగా గ్రాఫ్ పడిపోయి... ఉత్త పుత్రుడిని, దత్తపుత్రుడిని కలిపి మరీ జనం మీదికి పంపిన తన చంద్రబాబుకు కాస్తయినా మేలు జరగొచ్చు. ఇదే రామోజీ ఏకసూత్ర అజెండా !!. తాజా కథనాలన్నీ ఈ అజెండాలో భాగమే.

ఇక్కడ ప్రధాన ప్రశ్న ఒక్కటే!. ఒక వ్యక్తిని సీబీఐ విచారించిందనుకుందాం. సీబీఐ ప్రశ్నలకు తను సమాధానాలు చెబుతాడు. అది వాళ్లిద్దరికే తెలుస్తుంది. మరి రామోజీరావుకు, ఆయన తోక పత్రికకు, టీవీ5కు ఎలా తెలుస్తోంది? వాళ్లు మాత్రమే 'లైవ్' రిపోర్టింగ్ ఎందుకు చేస్తున్నారు? ఎలా చేయగలుగుతున్నారు? సీబీఐ ఎవరికి నోటీసులిచ్చిందో... ఎవరికి ఇవ్వబోతోందో వారికి మాత్రమే ఎలా తెలుస్తోంది? రామోజీకి అతీంద్రియ శక్తులున్నాయా? లేక సీబీఐ ఆఫీసులో పొంచి వింటున్నారా? ఇదంతా కావాలనే చేస్తున్నారని... ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలో ఇదంతా భాగమేనని తెలియటం లేదా?


అటెండరుకు, పీఏకు తేడా తెలీదా?

బురద జల్లటానికి, జనంలో అపోహలు సృష్టించడానికి 'ఈనాడు' తనకు ఏది అనుకూలంగా ఉంటే అది రాసేస్తుందన్నది పచ్చినిజం. ఇంటికి వచ్చిన వారికి కాఫీ–టీ అందిస్తూ అటెండరుగా ఉన్న వ్యక్తిని 'పీఏ'గా 'ఈనాడు' రాస్తుండటం కూడా ఇలాంటిదే. ముఖ్యమంత్రి ఇంట్లో ఇలాంటి పనిచేసే నవీన్‌ను భారతమ్మ పీఏ అంటూ రామోజీ రాసిన రాతలు... దిగజారుడుకు పరాకాష్ఠ. చంద్రబాబు గ్రాఫ్ పెంచడానికి 'ఈనాడు' ఈ స్థాయికి పతనమైపోతుందని ఎవ్వరూ ఊహించి కూడా ఉండరు. సహజంగా ఇంట్లోవాళ్లకు ఫోన్ చేసినపుడు వాళ్లు గనక అందుబాటులో లేకుంటే అక్కడ పనిచేసే వాచ్‌మెన్, తోటమాలి, డ్రైవర్... ఇలా తెలిసిన వారికి ఫోన్ చేస్తారు. అలా నవీన్ ఫోన్‌కు కాల్స్ వచ్చాయంటూ భారతమ్మను టార్గెట్ చేశారంటే వీళ్లు ఎంత నీచంగా ఆలోచిస్తున్నారన్నది అర్థం కావటం లేదా?

మరణించిన వై.ఎస్.వివేకానందరెడ్డి ఎంపీ అవినాశ్ రెడ్డికి చిన్నాయన. అవినాశ్ రెడ్డి అప్పటికే సిటింగ్ ఎంపీ. ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడటంతో మళ్లీ టికెట్‌ను ఆయనకే కన్ఫర్మ్ చేశారు. దీంతో అవినాశ్‌కు మద్దతుగా వైఎస్ వివేకా ప్రచారం కూడా మొదలెట్టారు. హత్య గురించి తనకు తెలియటంతో అది చెప్పటానికి ఆయన కొందరు బంధువులకు ఫోన్ చేసి ఉండొచ్చు. అందులో తప్పేమయినా ఉందా? ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సభలు... అక్కడ మాట్లాడాల్సిన ప్రసంగాలు... తదితరాలపై అంతా బిజీగా ఉన్న సమయంలో ఓఎస్‌డీకి ఫోన్ చేసి... ఆయన దొరక్కపోతే అటెండర్‌కో, డ్రైవర్‌కో ఫోన్ చేసి సమాచారాన్ని చెప్పమని కోరితే తప్పా? అదేమైనా ఘోరమా? దానికి చిలవలు పలవలు జోడించి ఇంత దుష్ప్రచారం చేయాలా? ఫిలిం సిటీ కోటలో రామోజీరావుకు ఇలాంటి అటెండర్లు లేరా? ఎందుకీ దిగజారుడు రాతలు?

ఇవన్నీ వాస్తవాలు కాదా?

మొదటి నుంచీ స్థానిక పోలీసులు చెబుతున్నదాని ప్రకారం ఎంపీ అవినాశ్ రెడ్డి అక్కడకు చేరేసరికే జనం పోగై ఉన్నారు. వివేకానంద రెడ్డి గుండెపోటుతో చనిపోయారని, సిగరెట్లు ఎక్కువ తాగటం వల్లే ఇలా జరిగిందని తనతో వివేకా బావమరిది శివప్రకాశ్ రెడ్డి చెప్పినట్లు స్వయంగా నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డి వీడియో సహితంగా చెప్పారు. అదే శివప్రకాశ్ రెడ్డి తనకూ చెప్పినట్లు అవినాశ్ రెడ్డి చెబుతున్నారు. ఎన్నికల ప్రచారానికని బయలుదేరిన తాను... వివేకా మృతి గురించి శివప్రకాశ్ రెడ్డి చెబితే తిరిగి వెనక్కి వచ్చానని చెప్పారాయన. మరి అందరికీ చెప్పింది శివప్రకాశ్ రెడ్డే అయినపుడు... అవినాశ్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డికి ఉదయం 5 లేదా 5.30 గంటలకు అక్కడొక లేఖ దొరికింది. ఆ లేఖ రాసింది వివేకానందరెడ్డే నని, అందులోని రాత ఆయనదేనని వివేకా కుమార్తె స్వయంగా పోలీసు డీజీపీ ఎదుట అంగీకరించారు. ఆ విషయాన్ని నాటి కడప ఎస్పీ రాహుల్ దేవ్ వెల్లడించారు కూడా. ఆ లేఖనెవరు చూసినా... అది సహజ మరణం కాదని అర్థమయ్యేది. పోలీసులకో, అక్కడికి వచ్చిన వారికో వెంటనే ఆ లేఖను ఇచ్చి ఉంటే... అక్కడి వ్యవహారం మరోలా ఉండేది. కానీ పీఏకు ఆ లేఖను, వివేకా ఫోన్‌ను ఎవ్వరికీ ఇవ్వవద్దని తాము వచ్చేవరకూ అలాగే ఉంచుకోవాలని కృష్ణారెడ్డికి వివేకా కుమార్తె, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఈ విషయాన్ని కూడా కుమార్తె సునీత పోలీసుల దగ్గర అంగీకరించారు. అలా ఎందుకు చెప్పారని అడిగితే... డ్రైవర్ ప్రసాద్‌కు ప్రాణభయం ఉంటుందనే ఉద్దేశంతోనే అలా చెప్పామన్నారు. మరి ఆ దిశగా ఎందుకు దర్యాప్తు సాగలేదు? రామోజీరావుకు ఇది తెలీదా? ఎందుకీ దుర్మార్గపు రాతలు?



కుమార్తెకు–రెండో భార్యకు విభేదాలు లేవా?

వైఎస్ వివేకా కుమార్తెకు, ఆయన రెండో భార్యకు మధ్య విభేదాలున్నాయనేది బహిరంగ రహస్యం. వాళ్లిద్దరి మధ్య సామాజిక మాధ్యమాల్లో నడిచిన దారుణమైన మెసేజీలే ఇందుకు సాక్ష్యం. వివేకా కుమార్తె, అల్లుడికి బీటెక్ రవితో ఇప్పటికీ మంచి సంబంధాలున్నాయి. బీటెక్ రవిని అప్పట్లో పోలీసులు విచారించినా కూడా ఆ వివరాలెందుకు వెల్లడించలేదు? రామోజీకి ఇవన్నీ తెలిసినా... ఒక బీటెక్ రవిని కాపాడటానికో, ఒక చంద్రబాబు గ్రాఫ్ పెంచటానికో మరీ ఇంత దారుణంగా పతనమైపోయి రాయటం న్యాయమేనా? సీబీఐ అంటే చంద్రబాబు బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కాదు కదా? మరి రామోజీకి అన్ని విషయాలూ ఎలా తెలుస్తున్నాయి? హత్య జరిగిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే. అప్పుడే ఆ లెటర్ కూడా దొరికింది. దాని ఆధారంగా అప్పటి నుంచీ ఇన్వెస్టిగేషన్ ఎందుకు సాగలేదు? రకరకాలుగా తిప్పి... ఇప్పుడు ముఖ్యమంత్రి సన్నిహిత కుటుంబీకులకు అంటగట్టడానికి ప్రయత్నిస్తుండటంలో కుట్ర స్పష్టంగా కనిపించటం లేదా? ఇంకెప్పుడు మారతారు రామోజీరావు గారూ?

ఏది నిజం?

విచారించింది సాక్షిగానే అని తెలిసీ బురదజల్లడం...

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇప్పటి వరకు 200మందికిపైగా సాక్షులను విచారించింది. అదే రీతిలో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని ఈ కేసులో సాక్షిగానే విచారించింది. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, ఆయన నివాసంలో పని చేసే నవీన్‌లను సాక్షులుగానే విచారణకు పిలిచింది. బాధ్యతాయుతమైన పౌరులుగా సాక్షులుగానే సీబీఐ విచారణకు హాజరై సహకరించారు. కానీ దీనికి రాజకీయ రంగు పులిమి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి కుటుంబం పై బురద జల్లేందుకు ప్రయత్నించడం ఈనాడు మార్కు దిగజారుడు జర్నలిజం. ఈ కేసులో గతంలో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిలను గతంలో సీబీఐ సాక్షులుగా విచారించింది. అప్పుడు మాత్రం ఈనాడు కళ్లకు గంతలు కట్టుకుని కూర్చుందా.? అప్పుడులేని హడావుడి ఇప్పుడు ఎందుకంటే...కేవలం చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం కల్పించడానికే అన్నది సుస్పష్టమవుతోంది.

మరీ ఇంత దిగజారుడా రామోజీ...!

సాక్షిగా సీబీఐ అధికారుల ఎదుట విచారణకు హాజరైన అనంతరం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో తనంతట తాను వెనుదిరిగారు. కానీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి వచ్చి ఆయన్ని తన వాహనంలో ఎక్కించుకుని తీసుకువెళ్లారని ఈనాడు రాయడం కంటే అవాస్తవం మరొకటి ఉండదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి రావడం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌సిటీలోని కొండపై అక్రమంగా నిర్మించుకున్న రాజప్రాసాదం నుంచి శాటిలైట్ ద్వారా రామోజీరావు చూశారా..! అసలు ఆయన అక్కడకు రానే లేదు. కానీ కేఎస్ జవహర్ రెడ్డి వచ్చి కృష్ణమోహన్‌రెడ్డిని తీసుకువెళ్లినట్టుగా రాయడం ఏ పాత్రికేయ నీతో రామోజీరావుకే తెలియాలి మరి. ప్రభుత్వంపై దుష్ప్రచారం కోసం మరీ ఇంత బరితెగించాలా రామోజీ...!

హంతకుడే అప్రూవరా..! కళ్లుమూసుకున్నావా రామోజీ

ఇఇవైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలితో నరికి హత్య చేశాను అని ఈ కేసులో నిందితుడు దస్తగిరి అంగీకరించారు. అటువంటి అతన్ని సీబీఐ ఈ కేసులో అప్రూవర్‌గా పేర్కొనడం విస్మయపరుస్తోంది. పైగా దస్తగిరి బెయిల్ పిటిషన్‌ను సీబీఐ వ్యతిరేకించకపోవడంపై న్యాయ నిపుణులే అవాక్కయ్యారు. హత్య చేసిన వ్యక్తి జైలులో ఉండాలి. కానీ అతను దర్జాగా బయట తిరుగుతున్నాడు. ఇవేవీ ఈనాడు రామోజీ రావు కంటికి కనిపించడం లేదా... మరెందుకు ప్రశ్నించ లేదు...!? ఇక హంతకుడు అయిన దస్తగిరి చెప్పిన కల్పితాలను ఆధారంగా చేసుకుని సీబీఐ దర్యాప్తు చేస్తుండటం వెనుక ఉన్న మర్మమేమిటీ... ఎవరు ప్రభావితం చేశారన్నది నిపుణులు లేవనెత్తుతున్న సందేహం. దీనిపై కూడా ఈనాడు దృష్టిసారించలేదు. ఎందుకంటే చంద్రబాబు పలుకులు పలుకుతున్న చిలక దస్తగిరి. అందుకే దస్తగిరి చెబుతున్న కట్టుకథలకు వంత పాడుతున్నావా రామోజీ...!

ఎంపీ టికెట్ అవినాశ్‌రెడ్డికి అని నిర్ధారించాకా రాద్ధాంతం ఏమిటో...

2019 ఎన్నికల్లో కడప ఎంపీ టికెట్ పై సందిగ్ధత ఉందనే అభూత కల్పనలతో ఈనాడు రామోజీరావు ప్రజలను పక్కదారి పట్టించేందుకు నానా పాట్లు పడుతున్నారు. కానీ వాస్తవం ఏమిటన్నదీ అందరికీ తెలుసు. 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే ఖరారు చేశారు. కడప లోక్‌సభ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌గా వైఎస్ వివేకానంద రెడ్డిని నియమించారు. అవినాశ్ రెడ్డి గెలుపు కోసం వివేకానందరెడ్డి అప్పటికే ప్రచారం కూడా ప్రారంభించారు. వివేకానందరెడ్డి హత్య తరువాత కూడా ఆయన కుమార్తె వైఎస్ సునీత అదే విషయాన్ని మీడియా సమావేశంలోనూ చెప్పారు ఎంపీ టికెట్‌పై ఇంత స్పష్టత ఉన్న తరువాత కూడా అదేదో ఎంపీ టికెట్ కోసం వైఎస్ కుటుంబంలో పోటీ నెలకొందని అవాస్తవాలను ఈనాడు ప్రముఖంగా ప్రచురిస్తుండటం కేవలం ఎల్లో జర్నలిజమే.

వైఎస్ వివేకాను కుట్ర పూరితంగా ఓడించింది చంద్రబాబే

వైఎస్ వివేకానందరెడ్డి హత్యను రాజకీయంగా వాడుకోవాలని చంద్రబాబు, రామోజీరావు కుయుక్తులు పన్నుతున్నారు. అందుకే వైఎస్ వివేకానందరెడ్డిపై ఎక్కడలేని ఆపేక్ష చూపిస్తున్నట్టు డ్రామాకు తెరతీశారు. కానీ కడప జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్‌వివేకానందరెడ్డిని కుట్రపూరితంగా ఓడించింది చంద్రబాబే కదా. వైఎస్సార్ మరణానంతరం భార్య, కుమార్తె ఒత్తిడితో వైఎస్‌వివేకానందరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో ఉండిపోయారు. వైఎస్‌విజయమ్మపై పులివెందులలో పోటీ చేశారు కూడా. అయినా సరే అనంతర పరిణామాల్లో పార్టీలోకి వస్తానంటే చిన్నాన్న మీద గౌరవ, అభిమానాలు ఉన్న వైఎస్ జగన్ ఆయన్ని సాదరంగా స్వాగతం పలికారు. కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఎందుకంటే కడప జిల్లాలో స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ ఉంది. కానీ అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కుట్రపూరితంగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురి చేసి వైఎస్ వివేకానంద రెడ్డిని ఓడించారు. అందుకు ఈనాడు, ఎల్లో మీడియా వత్తాసు పలికింది నిజం కాదా రామోజీ...!

అధికారంలో ఉంటే సీబీఐని నిషేధించింది బాబే కదా...

ప్రస్తుతం సీబీఐ దర్యాప్తును వక్రీకరిస్తూ కథనాలు రాస్తున్న ఈనాడు రామోజీరావు టీడీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం నిద్ర పోయారనిపిస్తోంది. పోలవరం ప్రాజెక్టులో తమ అవినీతిని ఎక్కడ బయటపెడుతుందో అని చంద్రబాబు ఆనాడు రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశించకుండా నిషేధించారు. కేంద్ర దర్యాప్తు సంస్థపై నిషేధం విధిస్తే ఈనాడు కనీసం ప్రశ్నించలేదు. సరి కదా స్వాగతించింది. అంటే అప్పట్లో సీబీఐ అంటే ఓ పనికిమాలిన సంస్థగా చంద్రబాబు, ఈనాడు రామోజీరావు భావించారు. అటువంటి వారిద్దరూ ప్రస్తుతం సీబీఐ ని ఆకాశానికెత్తుతుండటం గమనార్హం. టీడీపీ అధికారంలో ఉంటే ఓ రీతి... ప్రతిపక్షంలో ఉంటే మరో రీతా ...! చంద్రబాబు సీబీఐపై విధించిన నిషేధాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎత్తివేశారు. సీబీఐ అంటే భయముంటే ఆ పని ఎందుకు చేస్తారు. కానీ ఈ విషయాన్ని మాత్రం ఈనాడు ప్రస్తావించదు.

తులసమ్మ లేవనెత్తిన సందేహాలపై దర్యాప్తు ఏదీ...?

ఈ కేసులో అరెస్టు అయిన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ సీబీఐ దర్యాప్తు తీరును తప్పుబడుతూ న్యాయస్థానంలో ఓ పిటిషన్ వేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఎవరు చేసి ఉంటారనే సహేతుక ఆధారాలతో ఆమే నివేదించారు. వైఎస్ వివేకానందరెడ్డి రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు... రెండో భార్య కుమారునికి ఆస్తిలో వాటా ఇస్తానని ఆయన చెప్పడంతో విభేదించిన మొదటి భార్య, కుమార్తె సునీత. అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిలు పాల్పడిన కుట్రలు... పులివెందులలో రాజకీయ ఆధిపత్యంపై కన్నేసిన టీడీపీ నేత బీటెక్ రవి అందుకు అడ్డుగా ఉన్న వివేకానందరెడ్డిపై కక్ష పెంచుకోవడం... ఆర్థిక విభేదాలతో వైఎస్ వివేకానందరెడ్డిపై కక్ష పెంచుకున్న అనుచరుడు కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డి... ఆయనతో రాజకీయంగా విభేదిస్తున్న తాడిపత్రి నేత రాజేశ్వరరెడ్డి, సహకరించిన నీరుగట్టు ప్రసాద్ ... ఇలా వీరందరి పాత్రపై దర్యాప్తు జరపాలని కోరుతూ తులసమ్మ ఇచ్చిన వాంగ్మూలాన్ని న్యాయస్థానం నమోదు చేసింది. ఇంతటి కీలక అంశాలు మాత్రం ఈనాడు కంటికి కనిపించలేదు. ఆమె ఆవేదనను ప్రచురించాలని భావించనూ లేదు. కేసు దర్యాప్తు సక్రమంగా జరగాలని కోరుకోనూ లేదు. కేవలం చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం కలిగించేందుకు కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తూ... వైఎస్ కుటుంబంపై దుష్ప్రచారం చేయడమే ఈనాడు రామోజీ రావు పనిగా పెట్టుకున్నారు...

కానీ చంద్రబాబు గానీ రామోజీరావు గానీ గుర్తించని నిజం ఏమిటంటే... ఇవి 1995నాటి రోజులు కావు...చంద్రబాబు చెప్పే అవాస్తవాలు... ఈనాడు వండి వార్చే అభూత కల్పనలను ప్రజలు నమ్మే రోజులు పోయాయి. వారి కుట్రలు, దుష్ప్రచారాన్ని తాము నమ్మడం లేదని 2019 ఎన్నికల్లో ప్రజలు ఘంటాపథంగా తేల్చి చెప్పారు. ఇప్పటికీ ప్రజల ఏకకంఠంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే బలపరుస్తున్నారన్నది సుస్పష్టం. ఆ నిజాన్ని గుర్తించి కూడా గుర్తించనట్టు వ్యవహరిస్తుండటం చంద్రబాబు, ఈనాడు అజ్ఞానం.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



వైశ్యాస్/ M.Tech / C.Govt.సైంటిస్ట్/ DRDO/1 Lakh PM/"6"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-10085]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు. M.Com/ C.Govt.మేనేజర్/కెనరా బ్యాంక్/80,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10085]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/IIT/C.Govt. Asst ఇంజినీర్/IOCL/ 1,25,000/-PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10085]

గౌడ/ M.Tech/ C.Govt.Asst.ఇంజినీర్ /BHEL/80,000/-PM/ 5'11"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10085]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt.ఇన్స్పెక్టర్/కస్టమ్స్ Dept/ 75,000/-PM/"6"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10085]

యాదవ: M.Tech / C.Govt. Asst Engineer/ (HPCL)/ 80,000/ PM/ 5'8"/ ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడుకు తగిన వధువు కావలెను. Ph: 8008965895 [H-10086]

మాల క్రిస్టియన్: M.Tech / C.Govt. Income Tax Inspector / 1 Lakh / PM/ 5'9"/ ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [H-10086]

మాల హిందూ: M.Tech / C.Govt. Officer (IOCL)/ 80,000/ PM/ 5'8"/ ఎత్తు / 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [H-10086]

SC మాదిగ 29 సం॥/5'10"/B.Tech IIT/ S/W/E Job/ 25 L P/A Well Settled Family వరుడికి వధువు కావలెను. (కట్నం ప్రసక్తి లేదు) ఫోన్: 6281925716 [HA-10087]

మాల 1992 సం॥/5'9"/B.Tech IIT MBA MS in USA/ SWE Job/ 140 (US$)/ బాగా స్థిరపడిన వరుడికి వధువు కావలెను. ఫోన్: 7702195227 [HA-10087]

ఆస్తి, కుల పట్టింపులేని వధువుకు వరుడు కావలెను. Govt పెన్షనర్/ 58Y/ విడో/ సొంత ఇల్లు/ పిల్లలు లేరు/ అమ్మ ఉంది. ఫోన్: 9515939479 [H-792971]

Reddy రెండవ పెళ్ళి- 33/5'10"/MS-USA 20Cr & 40/5'8"/MS-USA Citizen, Cont: Prabhakar Reddy, 9391198332. [H-792919]

యాదవ/B.Tech(EEE) / Govt.AEE/ ట్రాన్స్‌కో/14 Lakhs PA/5'8"ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [H-13845]

క్రిస్టియన్ మాల/M.Tech, NIT/C.Govt. డిప్యూటీ జనరల్ మేనేజర్/రైల్వే/16 Lakhs PA/5'9"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 7396369922 [H-13845]

పద్మశాలి/M.Tech/NIT/Govt.ఎక్సైజ్ & కస్టమ్స్ ఆఫీసర్/13 Lakhs PA/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9908209244 [H-13845]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/M.Tech/ Govt. ఎంప్లాయి/70,000/-PM/5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 7842467951, 7075953400 [H-13845]

బ్రాహ్మణ/లేట్/ఆ1955/ఫెయిర్/M.Sc Maths, MSC IT, Govt జాబ్/1 Lac (pm)/ 2 సొంత ఇల్లులు /సొంత ప్రాపర్టీ సికింద్రాబాద్‌లో ఉన్న, చాలా అందమైన వరునికి వధువు కావలెను. సంప్ర: [illegible] [H-793362]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech/Govt.A.E.E/ట్రాన్స్‌కో/1 Lakh PM/ 5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13825]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/BS/MS/H1/USA/1997/6'/Hand some Boy/400Cr. *USA-Citizen/Now in Hyd/1991/5'10"/300K/40Cr. *Cont: K.C. Reddy -Hyd-Ph: 9849321309

Reddy/Business (Exports) B.Tech/ MBA/ 1995/ 6'/ 100Cr. *1992/5'10"/ 300 Cr. *Cont : K.C. Reddy-Mar-Bur-Hyd. Ph: 9849321309 /9347807015

Reddy/Business/B.Tech/1990/6'/1000 Cr. *1989/5'11"/500Cr. *1993/5'7"/50Cr. *Cont: K.C. Reddy - Mar-Bur-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG/Sup.Spl.*1994/5'10"CARD/75Cr.*(Gastro)/1993/5'10"/50Cr.*Mch/1989/5'9"/ 30Cr. *MD/1995/ 5'10" / 300Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/MBBS/USA/Res.Doc.*1989/ 5'10" *1992/5'11". *1994/5'9". *1990/5'10". * 1991 /5'10". *1990/6'. *1975/6' * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Business/B.Tech/MBA/1993/ 5'10"/300Cr. *1997/100Cr. * Cont: K.C. Reddy-Mar-Bur-Road No.3-B. Hills-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Business/B.Tech/1988/5'11"/ 300Cr. *1995/5'9"/250Cr. * Cont: K.C. Reddy -Mar-Bur-Road No.3-B.Hills-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/Job/Hyd/1994/5'8"/ 200Cr. *1988/Business/Hyd/ 5'8"/200Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/9347807015

Reddy/B.Tech/NIT/MS/MBA/USA/230 K/1995/6'/200Cr. *1991/5'11"/130K/200 Cr. * Cont:K.C. Reddy-Mar-Bur- Hyd. Ph:9849321309/9347807015

Reddy/Business/B.Tech/MBA/UK/ 1994/5'11"/250Cr. *1994/5'9"/350Cr. *Cont: K.C. Reddy-Mar-Bur- Hyd. Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/B.Tech(CBIT)/SWE/HydMost beautiful/29/5'7"/20 Cr. *MBA/1995/5'5"/ 70 Cr. *1996/5'4"/(NIT)/10 Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/BBA/MBA/1998/5'4"/25Cr. *B.Tech/ 1991/5'7"/10 Cr. *1994/5'6"/SWE/10 Cr. *1997/ 5'5"/15 Cr. *1995/5'4"/25 Cr. *Cont: K.K. Reddy- Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MBA/1991/5'4"/1Cr/Yr/ 10 Cr. *1999/5'8"/15 Cr *1997/5'4"/SWE/4 Cr. *1994/5'3"/10Cr. *MBA/1993/5'3"/20Cr. *Cont: K.C.Reddy- Hyd- Ph: 9849321309

Reddy/M.Tech/1996/5'6"/6 Cr. *1995/5'7"/ 10 Cr. *MS/1998/20 Cr + 10 Cr cash *MS/ USA/1996/5'5"/15 Cr. *1995/5'3"/40 Cr. *Cont: K.C.Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/1992/5'3"/-"/40 Cr. *1990/ 5'3"/50Cr. *1996/5'7"/40 Cr *1994/5'8"/4 Cr. *1994/5'5"/20 CR. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/ BBA/ MBA/ 100 Cr + *1993/5'3" *1995/5'3" *1996/5'9" *1997/5'4" *1994/5'6" * 1995/5'8" *1994/5'3" * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/B.Tech/ MS/ H1/ USA *1996/5'9"/ 100 Cr. *1996/5'8"/15 Cr. *1995/5'7"/15 Cr. *1990/5'8"/100 Cr. * 1996/5'7"/50 Cr. *Cont: K.C. Reddy - Hyd- Ph:9347807015

Reddy/MBBS/PG *1995/5'5"/100 Cr. *1995/ 5'3"/50 Cr. *1993/5'3"/50 Cr. * 1996/5'6"/60 Cr. *1993/5'7"/100 Cr. *1994/5'4"/50 Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/MBBS/PG/1994/5'10"/50 Cr. *1996/ 5'4"/50 Cr. *USA-Doc→1996/5'8"/40 Cr. *1992/ 5'5" *1992/5'4"/50 Cr/ 1992/5'7"/50 Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/Divorcee *MBBS/MD/1994/5'5"/50 Cr. *USA-Doc/1992/5'3"/9 Cr. *CA/1985/5'7"/5 Cr. *B.Tech/1985/5'5"/400 Cr. *MBBS/1993/5'8"/40 Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

[D-501]

పద్మశాలి/ B.Tech/C.Govt.J.E/రైల్వే /72000/-PM/5'10" ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 7288048678 [HA-13825]

ముదిరాజ్/Age: 35/5'8"/S.S.C/Pvt. Job డ్రైవర్స్ వరుడికి Any BC, Inter, డిగ్రీ Fair వధువు కావలెను. Ph: 8247795058 [H-13826]

SC మాదిగ/B.Tech/Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 1 Lakh Pm/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 7032058965 [H-13826]

2వ పెళ్లి /M.Tech, (IIT)/Govt.Asst. ఇంజనీర్/ జెన్‌కో/ 1,50,000/- PM/ 5'8" ఎత్తు/ 35 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963757612 [H-13826]

Retired Government Officer 65 Plus/ 60 వేల Pension సొంత ఇల్లు గల వరునికి వధువు కావలెను Direct Contact: 7981235733/ 9440857973 [H-776398]

36 సం॥ల బిజినెస్ మ్యాన్‌కి సెకండ్ మ్యారేజ్ కుల ప్రసక్తి లేని వరుడుకి సెకెండ్ మ్యారేజ్/విడో, పిల్లలు ఉన్నవారు అయిన సంప్ర: No బ్రోకర్. Hyd/ Ph: 7396730091 [H-776398]

పద్మశాలి/31 yrs 5'8"/B.Tech /కలర్: fair /సీనియర్ ఇంజనీర్ జాబ్ / 85k per Month. Any Cast అయిన Ok వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను ఫోన్: 8500427582. [H-792591]

CNB/ 45 / 5'5"/ డిగ్రీ/80,000/-PM in Hyd కలిగిన వరునికి తగిన వధువు కావలెను. Contact : 9502958478 [H-792926]

Reddy Groom-29/5'10"/M.Tech/ C. Govt, Agm, 2,30,000/-PM & 27/5'8"/BDM-Business, 3Cr P/A, Cont: Prabhakar Reddy, 9391198332. [H-792919]

2nd Marriage Sunni Muslim Boy39, 5'8"/ Andhra (Vijayawada) 93K PM / working in Hyd/ No Children, Looking for Marriage Proposal. Send Bio-Data & Photos to marriage_heaven@hotmail.com [H-792971]

Vice President & MD Software Company USA MS $220K Khamma 27 Years. 5'10" Needs Suitable Bride. Cont:9444817468 [NA-21595]

★

అమ్మాయి కావలెను అన్ని కులాలు 1వ కోమట్ల అబ్బాయి 34, M.Sc., B.Ed., D.Ed ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం 15 వేలు, ఆస్తి 35 లక్షలు నల్లగొండ. డైరెక్ట్ : 9121325068 [Y-772525]

హైదరాబాద్‌కు/చెందిన 38 ఏళ్ల అబ్బాయి ఎంబీబీఎస్ ఎండి చదువు కున్నారు. విడాకులు తీసుకున్నారు చాలా సంపన్న కుటుంబం తగిన జోడి కోసం వెతుకుతున్నారు (080-69072068) [HA-8923]

45 సం॥లు /BC/ ప్రభుత్వ టీచర్‌కు BC లేదా OC కి చెందిన ప్రభుత్వ ఉద్యోగం చేయు విడో / డైవర్సీ కావలెను. (నో బ్రోకర్స్) సెల్: 9966311904, 9441272470 [W-6473]

గౌడ్/30/5'8"/BE MS/OPT/33/5'7"/B.Tech MS/ H1B/32/5'9"/B.Tech MS/H1B/ 31/5'7"/ B.Tech/ MS/H1B/29/5'10"/US Citizen. 27/ 5'8"/M.Tech MS/H1B అబ్బాయిలకు తగిన అమ్మాయిలు కావలెను. నం॥ "శుభమస్తు" DSNR, Hyd. S. రాములు గౌడ్ Ph: 8790690309 [H-793270]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 6', SWE, 200 K, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 6', Manager, 18 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Sr Analyst, 115 K, 50 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MTech (BITS), 28, 5' 9", SWE, 24 L P/A, 6 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 28, 5' 7", H1, USA, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5'4", SWE, 50 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", 3 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BArch, MArch, 27, 5'5", Architect, Rich, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Bengaluru, BE (IIIT), 29, 5' 8", SWE, 40 L P/A, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 8", SWE, 100 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 32, 5' 11", USA, Rich, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 34, 5' 10", SWE, 130 K, 12 Cr, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 23, 5' 4", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Guntur, BE, MS, 25, 5' 3", Rich, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, MBBS, MHA, 28, 5' 4", Doctor, 5 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 36, 5' 3", Manager, 31 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★★

Direct: కోనసీమ కాపు/ 36, 5'6" వరుడికి రాజకీయ వృత్తి ఇష్టం ఉన్న గొప్ప వధువు కావలెను. Ph: 9113679022 [WB-50953]

వైశ్య/ప్రొఫెసర్, సంవత్సరానికి 30 లక్షలు, బాగా స్థిరపడిన 42 సంవత్సరాల మ్యారేజ్‌కు ఎవరైనా అప్పర్ క్యాస్ట్ కావలెను.clients201516@gmail.com [WB-52017]

క్రిస్టియన్ మాల/MCA/ 32Y, IT ఉద్యోగి, 2లక్షలు-pm, హైట్:5.7/వరుడుకి వధువు కావాలి / నెల్లూరు ఫ్యామిలీ ప్రిఫర్డ్ / నోబ్రోకర్లు, డైరెక్ట్ : 90663 66214. [N-5320]


రిటైర్డ్ ప్రొ॥ Now Govt. సర్వీస్ 1L PM, 65Y ఏ బాధ్యతలు లేని వ్యక్తి కి 55సం॥పైబడి ఏబాధ్యతలు లేని O.C వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ ✆ 80746 96179, 79950 45904. [O-786978]

మాల, హిందు, వయస్సు 37 సం॥లు H: 5'9", M.Tech. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, నెలకు 1.50 వేలు జీతం వరుడుకి వధువు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్ కావలెను. డైరెక్ట్ : ✆ 96769 82230 [R-410]

కుల పట్టింపు లేదు. BC, 50 yr, 42,000/- వరునకు ఏలాంటి బాదరాబంది లేని, తల్లితో పాటు ఉంటున్న పెన్షన్‌దారు గాని, విడో, డైవర్సీ గాని వధువు అర్జెంటుగా కావలెను. డైరెక్ట్ ✆ 7207655142 [T-763708]

కుల ప్రసక్తి లేదు. GOVT VRS, Height 5.5, Age : 56, ఏ బాధర బంది లేని వధువు కావలెను. ఇల్లరికం అయిన OK. డైరెక్ట్ సంప్రదించండి. ఫోన్ : 99480 47818 [V- 778230]

వరుడు కావలెను



No Caste bar/1.2వ కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారికోసం మాత్రమే. Ph:w:7794960803 [HA-13161]

రెడ్డి/35yr/5'5"/కుల పట్టింపు లేదు/MA English/Govt. ఎంప్లాయ్/ 65K (PM) వెల్ సెటిల్డ్, & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [H-793362]

లంబాడి/MSC/Agri /Govt.AEO /అగ్రికల్చర్ Dept / 45,000/-PM / 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-10085]

వడ్డెర/50 లక్షల ఆస్తి/B.Tech/Govt. ల్యాండ్ సర్వేయర్/రెవెన్యూ Dept/ 38,000/-PM/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10085]

బెస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/ B.Tech/C.Govt.డిప్యూటీ మేనేజర్/HAL/ 50,000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10085]

SC హిందు మాల / ఏకైక కుమార్తె / B.Tech /Govt.సబ్ ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/ 50,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10085]

యాదవ/80 లక్షల ఆస్తి/B.Tech/Govt. Jr. Asst/RWS/45,000/-PM/5'5"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10085]

యాదవ/B.Tech / C.Govt.Scientist (DRDO)/ 55,000/ PM/ 5'4"/ ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [H-10086]

మాల క్రిస్టియన్: /B.Tech/ C.Govt. Asst. Manager (Canara Bank)/ 60,000/ PM/ 5'4"/ ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [H-10086]

FC/విడో/60y/తెల్లని చాయ/ప్రభుత్వ రిటైర్డ్/ సొంత ఇల్లు/కొద్దిగా వ్యవసాయం గల సాంప్రదాయ ఒంటరి వధువుకు కుల ప్రసక్తి లేని మంచి మనస్సు గల వరుడు కావలెను. Ph: 9177883844 [H-793271]

FC/విడో/58y/తక్కువ చదువు/సొంత బిజినెస్/2 చిన్న ఇళ్ళు గల ఒంటరి వధువుకు స్నేహ స్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు/పిల్లలు లేరు. Ph: 9063346856 [H-793271]

నాయుడు/విడో/55y/చామన చాయ/సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/3 ఎకరాల వరి పొలం/సొంత ఇల్లు/80,000/-PM/ ఏ బాదరబందీలేని సాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. CNB. Ph: 9059150892 [H-793271]

రెడ్డి/55y/డైవర్స్/పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్/కొంచెం పొలం పంట భూమి గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 8185043391 [H-793271]

పద్మశాలి 25 సం॥/5'4"/B.Tech MBA/ Job Govt DRDO/ Sal: 12 L PA/ Well Settled Family అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8897091964 [HA-10087]

మాల 27 సం॥/6'4"/B.Tech IIT Kanpur/ S/W/E Job/ 20 L PA/ Settled in Hyd. అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7702195227 [HA-10087]

వైశ్య 2వ పెళ్ళి/ 32 Y/ 5'4"/ M.Sc, 33/ 5'4"/ SWE, 32/5'4"/ SWE & 32/ 5'1"/ డిగ్రీ; రెడ్డి: 38/5'5"/ డిగ్రీ వధువులకై సం॥ యం.సునిత ఫోన్: 9247783541, 9346019313 [H-792971]

పద్మశాలి విడో/ 54 Y/ 10th Class/ Own House/ ప్రైవేట్ జాబ్/ 35000/-PM/ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9121433952 [H-792971]

రెడ్డి/విడో/50 సం॥లు/ 5'6"ఎత్తు/ గవర్నమెంట్ పెన్షనర్/కోట్ల ఆస్తి గల అందమైన రెడ్డి ఒంటరి వధువుకు వరుడు కావలెను. వాట్సాప్ నెం. 9030129988 [H-13845]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. బ్యాంక్ మేనేజర్/SBI/70,000/-PM/5'4"ఎత్తు/36 సం॥ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. పిల్లలున్నా OK. Ph: 9550650024 [H-13845]

రజక/CA/Govt.అకౌంటెంట్/40,000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [H-13845]

వడ్డెర/B.Tech/Govt.బ్యాంక్ క్లర్క్/ SBI/40,000/-PM/5'4"ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7842467951, 7075953400 [H-13845]

SC మాదిగ &SC మాల/B.Tech/MBA/ C.Govt.డిప్యూటీ మేనేజర్/SBI/65000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [H-13845]

2వ పెళ్లి/34yrs/Govt.ఎంప్లాయ్/2,50,000/-(PM) కుల ప్రసక్తి లేదు/బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి : 9502046384 [H-793362]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/40yrs/M.Sc, M.Ed/ Govt.లెక్చరర్/1 లక్ష 50 వేలు(PM)/ 5 కోట్ల ఆస్తి గల పిల్లలులేని తెల్లని అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి: 7396213324 [H-793362]

యాదవ/ B.Tech(EEE) / Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్/65000/-PM/5'4" ఎత్తు / 28 సం॥ల అందమైన వధువుకు SWE/ Govt. ఎంప్లాయి వరుడు కావలెను. Ph: 9515755529 [HA-13825]

రజక/ఏకైక కుమార్తె/B.Tech/C.Govt.బ్యాంక్ క్యాషియర్/యూనియన్ బ్యాంక్/28000/-PM/5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9581317506 [HA-13825]

వడ్డెర/B.Tech/C.Govt.బ్యాంక్ Asst. మేనేజర్/SBI/55000/-PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13825]

రెడ్డి: 53Y/ రెండవ పెళ్ళి/విడో/Govt. Job/పిల్లలు లేరు/సొంత ఇల్లులు/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్). Ph: 7799083500/ 7386660643 [H-776398]

రెడ్డి: విడో 38సం॥ /5'3"/ఎత్తు సొంత ఇల్లు 20 ఎకరాల పొలం స్థిరాస్తి కలిగి పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) Whatsapp Ph: 9441145961 [H-776398]

బ్రాహ్మణ: విడో/60yrs/Govt Pensioner/ సొంత ఇల్లు గల సంప్రదాయ వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7995704687 [H-776398]

రెడ్డి:/ 2nd మ్యారేజ్/కుల, ఆస్తి ప్రసక్తి లేదు A:30, Q: డిగ్రీ గల అందమైన వధువుకు మంచి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: Ph: 9100717575 [H-13826]

లేట్ మ్యారేజ్, కాపు, CNB/35/5'5"/MBA/జాబ్/20 Lakhs. PA/ Own House, బెంగుళూరు/ 10 Lakhs Rents. P.A* వరుడు కావలెను 1st2ndOk. వెరీ అర్జెంట్. Ph: 6303293337, WhatsApp: 8187053655 [H-13826]

బ్రాహ్మణ: 25/5'3"/ ఇంటర్ *28/5'2"/B.SC *30/5'3"/ ఇంటర్ *27/5'3"/MBA వధువులకు వరులు కావలెను. జాబ్, బిజినెస్ OK. పురోహితులకు సంబంధాలు కలవు. Ph: 7815999246 [H-13826]

క్రిస్టియన్ మాల: 24/ 5'5"/ B.Tech/ Govt.AE/ పంచాయితీ రాజ్ Dept/ 60,000/- pm అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [H-13826]

వడ్డెర/ ఏకైక కుమార్తె/B.Tech/Govt. Asst. ఇంజనీర్/ ఇరిగేషన్ Dept/50,000/- pm/ 5'3" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618579861 [H-13826]

రజక/B.Tech/ C.Govt. బ్యాంక్ క్యాషియర్/ SBI/40,000/- pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [H-13826]

SC మాల /ఏకైక కుమార్తె/ B.Tech/ C.Govt. UPSC ఆఫీసర్/ 70,000/- pm/ 5'3" ఎత్తు/ 27 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [H-13826]

కులపట్టింపు లేదు /విడో/50 Y /Fair / ఆంధ్ర/Govt Rtd 40k PM పెన్షన్/R/E, Lands/Own House పిల్లలులేని ఏ బాదర బందీలేని ఏకైక వధువుకు FC / BC వరుడు కావలెను (ఇల్లరికం Ok) ఫోన్ 8519800428. [H-792591]

గౌడ/విడో/49 Y /5'4"/Govt Job /VRS/Own House Rents, Business/1k PM/25 ఎక్రాండ్/ఆంధ్ర, తెలంగాణలో ప్రాపర్టీస్ గల వధువుకు వరుడు కావలెను (పిల్లలున్నా Ok) ఫోన్: 9177631661. [H-792591]

రెడ్డి/50 Y/విడో/5'5"/వెరీ ఫెయిర్/Govt HM సొంత ఇళ్లు, ఆంధ్ర లో పొలాలు 5cr ప్రాపర్టీ వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. ఫోన్: 7093717220. [H-792591]

Reddy రెండవ పెళ్ళి-32/ 5'3"/V.Fair/Rich, B.Tech-SWE & 32/5'6"/B.Tech SWE/V.Fair, Cont: Prabhakar Reddy, 9391198332. [H-792919]

Reddy Br, 27/5'7"/B.Tech, MS-USA/Rich & 25/5'5"/MD (Radiology) II yr/Rich & 22/5'6"/B.Com. Cont: Prabhakar Reddy, 9391198332 [H-792919]

Reddy Br, 26/5'7"/B.Tech, MS-Australia & 26/5'4"/B.Tech SWE/ Fair/ Rich & 30/5'5"/MBBS-MD (Pediatrician) Cont: Prabhakar Reddy, 9391198332 [H-792919]

★

హైదరాబాద్‌కు/చెందిన 23 ఏళ్ల బ్రాహ్మణ అమ్మాయి చాలా సంపన్న కుటుంబం తగిన జోడి కోసం వెతుకుతున్నారు. (080-69070619) [HA-8921]

హైదరాబాద్‌కు/చెందిన 28 ఏళ్ల డాక్టర్ చాలా సంపన్న కుటుంబానికి చెందిన అందమైన అమ్మాయి తగిన జోడి కోసం వెతుకుతోంది. (080-69072073) [HA-8922]

SC మాల హిందు/డైవర్సీ/37 సం.లు, సెంట్రల్ గవర్నమెంట్ టీచర్ సెటిల్డ్ వధువుకు తగిన గవర్నమెంట్ టీచర్ గవర్నమెంట్ లెక్చరర్ గల వరుడు కావలెను. డైరెక్ట్. 7013362957 [HA-13817]

★★

యాదవ /కురుమ 24/MBBS/ 5.52Cr.property GNT, 29/B.Tech/5.4/ Govt Group-2 Officer in Vijayawada. 26/B.Tech/5.2/S.W 18 Lats 5Cr Property, Hyd. Cont: 9849306274 శ్రీ కృష్ణ [G-776063]

క్రైస్తవ/మాల/ప్రభుత్వ టీచర్/B.Sc.,B.Ed./41/ 5'2" Fair/ డైవర్సీ వధువుకు క్రైస్తవ వరుడు కావలెను. తూ॥గో॥/ప॥గో॥ వారికి ప్రాముఖ్యత/ వారి బయోడేటా/ఫోటోతో వాట్సాప్ 89897 70090 నకు పంపగలరు. నో ఫోన్ కాల్స్. [R-388]

Direct. Konaseema Kapu, 32, 5'4", BA seeks tall educated rich husband below 50. Ph: 9113679022 [WB-50521]

వేదికలు



1వ/2వ/లేట్/పెన్షనర్స్ స్త్రీలకు మరియు పురుషులకు కులపట్టింపు లేని అన్ని కులాల వారికి వ॥ 21-80 సం॥ పెళ్లి సంబంధాలు చూడబడును. సంప్ర: 8886577413 [H-793362]

క్రైస్తవ వివాహ పరిచయ వేదిక www.indiachristianmatrimony.com 10,000 మంది ప్రొఫైల్స్‌తో ప్రతీ శనివారం వివాహ వేదిక @ అమృత వాణి, Secbad. Ph: 8885073555, 8885428555 [H-793271]

IInd Matche విడో, డైవర్సీ CNB 25 సం॥ నుండి 65 సం॥ వరకు SWE/ Pvt/ Govt/ మెడికోస్ మొదలగు వారికి సంబంధములు చూడబడును. ఫోన్: 9391646037 [HA-10087]

ఫ్రీ రిజిస్ట్రేషన్, కమ్మ, రెడ్డి, కాపు, గౌడ్స్, వైశ్య, 1వ, 2వ, NRI, Govt. డాక్టర్ & రిచ్ సంబంధాలు ఫాస్ట్ సెటిల్‌మెంట్ కొరకు సంప్ర: 9247217621 [H-13845]

1st, 2nd, లేట్ అన్ని కులాల పెళ్లి సంబంధాలు ఫాస్ట్ గా చూడబడును. డాక్టర్స్, సాఫ్ట్ వేర్, బిజినెస్, Govt & బ్యాంక్ ఆఫీసర్స్ సంబంధాలకై సంప్ర॥ Verified ప్రొఫైల్స్. శ్రీ నిత్య మ్యారేజ్ బ్యూరో ఫోన్: 7995825318. [H-792591]

అబ్రాడ్&ఇండియాలో ఉన్నవారికి డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్,బిజినెస్,గ్రూప్ 1,2 ఆఫీసర్లు వ్యక్తిగత శ్రద్ధ తో తొందరగా పెళ్లి సంబంధాలు కుదర్చబడును. పూర్ణమాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-424]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com ✆ 94920 33897, 94904 16355, 94407 85888 W [B-937]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-955]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-28721]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd లేట్/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదా గౌడ్, Ph: 8790690309 [H-793251]

మాల, మాదిగ : IAS, IPS, IRS, IRTS, IES, Group-I, II, Bank P.O, USA, UK, SWE, B.Tech (IIT), MBA (IIM), Govt. Officer, MBBS, MD. Cont. Cell : 73969 15712. [M-8470]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13158]

40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్. kaakateeya.com. Ph: 9342939345, 9383 999 999. [HA-10053]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాల వారికీ 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధృవ మ్యారేజెస్. 9949395407 [H-787368]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-792971]

★

మాదిగ వివాహ పరిచయ వేదిక. 12-2-23, 12-6PM, ముందుగా రిజిస్టర్ చేసుకున్న వారి ప్రొఫైల్ హాల్‌లో డిస్‌ప్లే చేస్తాము. # సికింద్రాబాద్ స్టేషన్. 9347046175 [H-793265]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి U.S.A, కెనడా, లోకల్, నాన్‌లోకల్ Dubbaka Matrimony. Ph: 9059290726 [H-793261]

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న Bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsp No.) [HA-863]

కేవలం డాక్టర్ వధూవరుల పరిచయ వేదిక అన్ని కులాలకు మరియు కేవలం ఆర్యవైశ్య పరిచయ వేదిక ఫోన్ నెంబర్లు, చిరునామా ఇవ్వబడును. 05-02-23 & 26-02-23, 1116/- భోజనం ఫ్రీ మొదటి 30 మందికి మాత్రమే 9705135074. [Z-0992955]

Free Registration/బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatapp) [HA-830]

V.R.Reddy Marriage Bureau U.S.A & Local Matches Proposals For Rich Families Fast settlement. Ph:9581725589 Email: ramana.Narsingi@gmail.com (Send Bio-data) [H-779943]


★★

Kalyani Matrimony : కాపు, కమ్మ, గౌడ, బ్రాహ్మిణ, వెలమ, వైశ్య వారి ఉన్నతమైన సంబంధం కొరకు వెంటనే సంప్ర: 8500747535, 9533133969 రెండవ సంబంధములు కూడా చూడబడును. [H-793269]

క్రైస్తవ, హిందూ (మాలల) వివాహ పరిచయవేదిక 11-02-2023, శనివారము ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1-00 గం॥ వరకు రత్న భారత్ గ్యాస్ ఏజెన్సీపైన, గణేష్‌నగర్ రాజమండ్రి, కల్యాణమాల ✆ 9440545949 [B-1226303]

1వ, 2వ, తోడు, ఒంటరి, రిటైర్డ్ సంబంధాలు కలవు. అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. సంప్ర : 83095 25477 [V- 795039]

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ దక్షిణ భారతదేశ కార్యదర్శిగా లాజర్



వైవీయూ : భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతికశాఖ ప్రొఫెషనల్ బాడీ అయిన ది ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ దక్షిణ భారతదేశ కార్యదర్శిగా వైవీయూ సైకాలజీశాఖ సహ ఆచార్యులు డాక్టర్ వేపరాల లాజర్ ఎంపికయ్యారు. ఈ మేరకు ది ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ మెంబర్‌షిప్ విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. రామకృష్ణ నుంచి ఉత్తర్వుల కాపీ అందింది. జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నాగపూర్‌లో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో డాక్టర్ లాజర్ పాల్గొని సైకాలజీ విభాగం పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశ ప్రాతినిధ్యం గురించి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రతినిధులకు వివరించారు. 2023–24 ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ 109వ సెషన్ కోసం ఆంత్రోపాలజికల్ బిహేవియరల్ సైన్సెస్ విభాగం సెక్షనల్ కమిటీ సభ్యునిగా బాధ్యతలను నిర్వర్తించాలని సైన్స్ కాంగ్రెస్ ప్రతినిధులు నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా లాజర్‌ను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.

ఏయూ ఆచార్యుల పరిశోధనపత్రానికి అవార్డ్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యుల పరిశోధన పత్రానికి బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డ్, నగదు పురస్కారం లభించాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీర్స్ ప్రచురించే ప్రతిష్టాత్మక జర్నల్‌లో ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు జీఎంజే రాజు, జీవీఎస్ శర్మ, కేవీ రమేష్, సి.భాస్కరశర్మ రూపొందించిన పరిశోధన పత్రం ప్రచురితమైంది. ఈ పరిశోధన పత్రానికి మూడు విభాగాల్లో కెమికల్ వీక్లీ అవార్డ్, ఐఐసీహెచ్‌ఈ ఎస్‌ఆర్‌సీ అవార్డ్, కూలూర్ మెమోరియల్ అవార్డ్ లభించాయి. ఈ మేరకు ఏయూ ఆచార్యులకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీర్స్ సంస్థ ధ్రువీకరణపత్రాలను అందించింది. ఈ సందర్భంగా శనివారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆచార్యులను అభినందించారు.

గొప్ప సంకల్పానికి దైవ సహకారం

- విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి
- ద్రాక్షారామంలో నూతన రథం ప్రారంభం


రామచంద్రపురం రూరల్: సంకల్పం గొప్పదైతే దైవం తప్పకుండా సహకరిస్తాడని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణోత్సవానికి అతి తక్కువ సమయంలో కొత్త రథం నిర్మాణం పూర్తిచేయడమే ఇందుకు నిదర్శనమని ఆయన చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో వెలసిన భీమేశ్వరుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా కొత్తగా నిర్మించిన రథాన్ని, రథోత్సవాన్ని స్వాత్మానందేంద్ర సరస్వతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీర్ణదశకు చేరుకున్న రథం స్థానంలో కొత్తది నిర్మించాలని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ సంకల్పించారని చెప్పారు. దీని నిర్మాణం ప్రారంభించిన నాడే స్వామి కల్యాణం రోజున ప్రారంభించాలని నిర్ణయించడం, అందుకు అనుగుణంగానే 45రోజుల్లో నిర్మాణం పూర్తికావడం దైవ సహకారానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. గతంలో అంతర్వేదిలోనూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రథం నిర్మించిందని గుర్తుచేశారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. స్థల పురాణంలో తెలిపిన విధంగా భీమేశ్వర స్వామి ఆలయంలోని వివిధ విగ్రహాలకు సంబంధించిన చిత్రాలను రథంపై ఏర్పాటు చేశామని తెలిపారు.



నూతన రథం ప్రారంభించి ప్రసంగిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్‌గా మళ్లీ బొప్పరాజు

ఏకగ్రీవంగా ఎన్నికైన జేఏసీ రాష్ట్ర కమిటీ



సాక్షి, అమరావతి: ఏపీ జేఏసీ అమరావతి (ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సేవా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ) చైర్మన్‌గా మళ్లీ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కర్నూలు రెవెన్యూ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో ఆయన చైర్మన్‌గా ఉన్న 21 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. తొలుత 21 మంది కార్యవర్గ సభ్యులకు 21 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. సెక్రటరీ జనరల్‌గా పలిశెట్టి దామోదర్‌రావు, అసోసియేట్ చైర్మన్‌గా టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారిగా వీవీ మురళి కృష్ణంనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ కృష్ణమోహన్‌రావు, ప్రచార కార్యదర్శిగా బి.కిశోర్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరితోపాటు ఐదుగురు కో–చైర్మన్లు, ఐదుగురు వైస్ చైర్మన్లు, మరో ఐదుగురు కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవ ఎన్నికలను ఎన్నికల అధికారి ఆదివారం అధికారికంగా ప్రకటించనున్నారు.

సామాన్యుడిపై ధరల భారం

టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్

తవణంపల్లె (చిత్తూరు జిల్లా): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధరలు పెంచి పేద బడుగు వర్గాలపై పెను భారం మోపారని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. జగన్‌ను గద్దె దింపే వరకు నిద్రపోనన్నారు. శనివారం తవణంపల్లె మండలంలోని ఎ.గొల్లపల్లె నుంచి తవణంపల్లె వరకు యువగళం పాదయాత్ర నిర్వహించారు. ఎ.గొల్లపల్లెలో వడ్డెర మహిళలతో మాట్లాడారు. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి గనులను మింగేస్తున్నారని, దీనివల్ల వడ్డెర్ల బతుకులు బాగుపడలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వడ్డెర్లను ఎస్టీల జాబితాలో చేరుస్తామన్నారు.

రైతులను నిలువునా ముంచిన చంద్రబాబు

తాడికొండ: అమరావతి పేరుతో రైతులందరినీ నిలువునా మోసం చేసిన చంద్రబాబు 29 గ్రామాల ప్రజల నెత్తిన గుదిబండ పెట్టాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 860వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలవలేని లోకేశ్‌బాబు పాదయాత్రలో చేస్తున్న వ్యాఖ్యానాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన బాబు, కొడుకులు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని చెప్పారు. గ్రాఫిక్స్ డిజైన్‌లతో అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.3.50 లక్షల కోట్ల అవినీతి చేసిన చంద్రబాబు 4 తాత్కాలిక భవనాలు, అరకొరగా రహదారులు నిర్మించడం తప్ప ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'చిరు'వంటలూ చేయండి
బిల్‌గేట్స్‌కు ప్రధాని సూచన

న్యూఢిల్లీ: రోటీ తయారు చేసిన ప్రపంచ కుబేరుడు బిల్ గేట్స్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రశంసించారు. చిరుధాన్యాలతో వంటకాలను ప్రయత్నించాలని సూచించారు. ''భారత్‌లో ఆరోగ్యకరమైన చిరుధాన్యాల ట్రెండ్ నడుస్తోంది. చిరుధాన్యాలతో చాలా వంటకాలున్నాయి. మీరు కూడా చేయడానికి ప్రయత్నించండి'' అంటూ నవ్వుతున్నట్లు ఇమోజీ పెట్టారు.

కర్ణాటక బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీజేపీ అధిష్టానం నియమించింది. కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, తమిళనాడు బీజేపీ ప్రెసిడెంట్ కె.అన్నామలైలను సహ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ శనివారం ప్రకటన విడుదల చేసింది. కర్ణాటకలో ఏప్రిల్–మే నెలల్లో జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలకు అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ ఇప్పటికే ప్రచారాన్ని ఉధృతం చేశాయి. బీజేపీ సీనియర్ నేత అయిన ప్రధాన్ గతంలోనూ పలు ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించారు. అందరినీ కలుపుకుని, పార్టీకి గెలుపు తీరాలకు నడిపించే సామర్థ్యమున్న నేతగా ఆయనకు పేరుంది. కర్ణాటక పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దే సత్తా ఆయనకు ఉందని పార్టీ విశ్వసిస్తోంది. గత ఏడాది జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మెజారిటీతో మళ్లీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. 2013, 2015, 2018 సంవత్సరాల్లో వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లోనూ బీజేపీ ఇన్‌చార్జిగా ప్రధాన్ బాధ్యతలు నిర్వహించారు. కాగా, గుజరాత్‌కు చెందిన మంత్రి మాండవీయకు కూడా ఎన్నికల నిర్వహణలో మంచి అనుభవముంది.

జామియా నగర్ హింస కేసు..
11 మందికి విముక్తి

న్యూఢిల్లీ: పౌరసత్వ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా 2019లో ఢిల్లీలోని జామియా నగర్‌లో చెలరేగిన హింస కేసులో 11 మంది నిందితులను ఢిల్లీ అదనపు సెషన్స్ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. వారిని వెంటనే విడుదల చేయాలని జడ్జి అరుల్ వర్మ ఆదేశించారు. నిజమైన దోషులను పట్టుకోలేక ఢిల్లీ పోలీసులు వీరిని బలిపశువులను చేశారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''నిరసనల్లో నిందితులు శాంతియుతంగా పాల్గొన్నారు. అది వారి మౌలిక హక్కు. వారికి హింసతో సంబంధమున్నట్టు ఏ సాక్ష్యమూ లేదు. పోలీసులు అత్యంత యాంత్రికంగా వ్యవహరించారని, తమకు దొరికిన వారిని నిందితులుగా చిత్రించారని స్పష్టమవుతోంది'' అంటూ జడ్జి ఆక్షేపించారు.

తారల తాండవం!



న్యూయార్క్: ఫొటోలో చక్రంలా తిరుగుతూ కనువిందు చేస్తున్నది ఓ అందమైన తారా మండలం. దాని చుట్టూ ఆనంద తాండవం చేస్తున్నట్టు కన్పిస్తున్నవి భారీ నక్షత్రాలు! లెడా 2046648గా పిలుస్తున్న ఈ నక్షత్ర మండలం భూమికి ఏకంగా వంద కోట్ల కాంతి సంవత్సరాలకు పైగా దూరంలో హెర్క్యులస్ నక్షత్రరాశిలో ఉందట! దీన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఇటీవలే తన అత్యాధునిక నియర్–ఇన్‌ఫ్రా రెడ్ కెమెరా (ఎన్ఐఆర్ కామ్) సాయంతో బంధించింది. మరుగుజ్జు తారగా మారిన డబ్ల్యూడీ1657ను పరిశీలిస్తున్న క్రమంలో యాదృచ్ఛికంగా ఈ గెలాక్సీ కంటబడిందని నాసా పేర్కొంది. ''విశ్వావిర్భావపు తొలినాళ్లకు చెందిన సుదూర గెలాక్సీలను కనిపెట్టడం, పరిశోధించడమే ప్రధాన లక్ష్యంగా జేమ్స్ వెబ్‌ను తయారు చేయడం తెలిసిందే. ఆయా గెలాక్సీల రసాయనిక కూర్పు తదితరాలను కూడా విశ్లేషించగల సామర్థ్యం దాని సొంతం. తద్వారా వాటి ఆవిర్భావానికి కారణమైన భారీ మూలకాలు ఎలా పుట్టుకొచ్చిందీ తెలిసే ఆస్కారముంటుంది'' అని ఒక ప్రకటనలో వివరించింది.

వాసనలు పసిగట్టే రోబో



అభివృద్ధి చేసిన టెల్ అవీవ్ వర్సిటీ

టెల్ అవీవ్: మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాలు, అనుమతి లేని వస్తువులను వాసన ద్వారా క్షణాల్లో గుర్తించే శక్తిమంతమైన రోబోను ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ప్రపంచంలో ఇలాంటి రోబో ఇదే మొదటిదట. సమీప భవిష్యత్తులో ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్లలో ఇవి సేవలందిస్తాయని సైంటిస్టులు చెబుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాసనను పసిగట్టే ఎలక్ట్రానిక్ పరికరాల కంటే ఈ రోబో 10,000 రెట్లు ఎక్కువ కచ్చితత్వంతో పనిచేస్తుంది. సున్నితమైన వాసనలను సులువుగా గుర్తించేలా ఇందులో బయో సెన్సార్ అమర్చారు. మెషిన్ లెర్నింగ్ అల్గరిథంతో ఈ సెన్సార్‌ను ఎలక్ట్రానిక్ వ్యవస్థగా మార్చారు. ప్రతి వాసనలోని ఎలక్ట్రిక్ చర్యను బట్టి అది ఏ రకం వాసనో చెప్పేస్తుంది. మనిషి ఎన్ని రకాల ఆధునిక టెక్నాలజీలను అభివృద్ధి చేసినా అవి ప్రకృతిలోని జీవులతో పోటీ పడలేవని వర్సిటీ ప్రతినిధులు డాక్టర్ బెన్ మావోజ్, ప్రొఫెసర్ అమీర్ అయాలీ చెప్పారు. ''కొన్ని రకాల కీటకాలు వాసనలను సరిగ్గా గుర్తిస్తాయి. గాలిలోని కార్బన్ డయాక్సైడ్ స్థాయిని దోమలు కేవలం 0.01 శాతం వ్యత్యాసంతో సరిగ్గా గుర్తిస్తాయి. కీటకాల తరహాలో వాసనలను పసిగట్టే సెన్సార్ల అభివృద్ధిలో మనమింకా వెనకబడే ఉన్నాం'' అని వివరించారు. పరిశోధన వివరాలు బయో సెన్సార్ అండ్ బయో ఎలక్ట్రానిక్స్ పత్రికలో ప్రచురితమయ్యాయి.

రాణి వెడలె..



1968, సెప్టెంబర్ 30

అమెరికాలోని వాషింగ్టన్ ఎవెరెట్టెలో కంపెనీ ప్లాంట్

బోయింగ్ 747 మొట్టమొదటి విమానం రాచఠీవితో నిల్చొని ఉంది. భారీ రెక్కలతో ఇంద్రభవనంలా మెరిసిపోతున్న ఆ విమానాన్ని చూడానికి వేలాది మంది అక్కడికి తరలివచ్చారు. అంత పెద్ద విమానాన్ని అప్పటివరకు చూసి ఎరుగని జనం దానినో అద్భుతంలా చూడసాగారు. భవనం లాంటి విమానం అసలు గాల్లో ఎలా ఎగరగలదని చర్చించుకోవడం మొదలు పెట్టారు. అప్పట్నుంచి ఈ విమానం అంతర్జాతీయ ప్రయాణ రూపురేఖల్ని మార్చేసింది. అందుకే బోయింగ్ 747ని క్వీన్ ఆఫ్ స్కైస్ అని పిలుస్తారు.

బై బై బోయింగ్ 747
- క్వీన్ ఆఫ్ స్కైస్‌కి ఘనమైన వీడ్కోలు
- చిట్ట చివరి కార్గో విమానాన్ని కొనుగోలు చేసిన అట్లాస్

విమానయాన చరిత్రలో మహరాణిగా వెలుగొందిన బోయింగ్ 747 విమానం కథ కంచికి చేరింది. 50 ఏళ్లకు పైగా అద్భుతమైన సేవలతో అలరించిన ఈ విమానాల తయారీని బోయింగ్ నిలిపేసింది. చిట్టచివరి విమానం డెలివరీ కూడా తాజాగా జరిగిపోయింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 500 పై చిలుకు బోయింగ్ 747లు సేవలందిస్తున్నాయి. అవన్నీ పూర్తిగా మూలకు పడ్డ అనంతరం ఈ ముచ్చటైన మోడల్ శాశ్వతంగా చరిత్ర పుటల్లోకి జారుకుంటుంది...

-సాక్షి, నేషనల్ డెస్క్



2023, ఫిబ్రవరి 1

55 సంవత్సరాల తర్వాత.. సరిగ్గా అదే స్థలం

ఆకాశానికి రాణిలాంటి బోయింగ్ 747కి సిబ్బంది ఘనమైన వీడ్కోలు పలికారు. చిట్టచివరి విమానాన్ని గురువారం అట్లాస్ ఎయిర్‌లైన్స్ సంస్థకు అందజేశారు. ప్రయాణికుల విమానంగా మొదలైన దాని ప్రస్థానం కార్గో విమానంగా ముగిసింది. వీటి తయారీ నిలిపివేస్తున్నట్టు 2020లోనే కంపెనీ ప్రకటించింది. వేలాది మంది ఉద్యోగులతో పాటు ఔత్సాహికులు ఈ వీడ్కోలు కార్యక్రమానికి తరలి వచ్చారు. అత్యంత శక్తి సామర్థ్యాలు కలిగిన విమానాన్ని మళ్లీ చూడలేమని బాధాతప్త హృదయంతో చర్చించుకున్నారు.

విమానమే ఒక ఇంద్రభవనం

విమాన ప్రయాణాల చరిత్రలో బోయింగ్‌కి ముందు, బోయింగ్ తర్వాత అని స్పష్టమైన విభజన రేఖ గీయొచ్చు. గంటల తరబడి కూర్చొని దేశ విదేశాలకు వెళ్లే విమాన ప్రయాణాలు బోయింగ్ రాకతో అత్యంత సౌకర్యవంతంగా మారాయి. సువిశాలంగా ఉండే బోయింగ్ 747 ఎదుట ఇతర విమానాలు ఒక మరుగుజ్జుగా మారాయి. ఒక్క మాటలో చెప్పాలంటే బోయింగ్ విమానం ప్రపంచాన్ని కుదించింది. కళ్లు చెదిరే సదుపాయాలతో వీవీఐపీ ప్రయాణికులు మోజు పడేలా 747 విమానాలు రూపుదిద్దుకున్నాయి. బార్లు, డైనింగ్ హాళ్లు, మూవీ స్క్రీన్లు, లగ్జరీ ఇంటీరియర్లు, లాంజ్‌లు, లివింగ్ రూమ్‌లు ఒకటేమిటి ఇదసలువిమానమా, గాల్లో ఎగిరే ఇంద్రభవనమా అని అందరూ అవాక్కయ్యారు.

తయారీ నిలిపివేత ఎందుకు?

అన్ని రంగాల్లోనూ సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. బోయింగ్ విమానానికయ్యే ఇంధనం ఖర్చు చాలా ఎక్కువ. 2007లో ఏ380 ఎయిర్ బస్ వచ్చిన దాకా బోయింగ్ 747 ప్రభ వెలిగిపోతూనే ఉంది. చమురు రేట్లు ఆకాశాన్నంటుతూ ఉండడంతో బోయింగ్ 747 కొనుగోలు చేసే ఎయిర్‌లైన్స్ సంస్థలు కరువయ్యాయి. యూరప్‌కి చెందిన ప్రత్యర్థి కంపెనీ ఎయిర్‌బస్ తక్కువ చమురు ఖర్చుతో విమానాలు రూపొందించడంతో బోయింగ్ డిమాండ్ పడిపోయింది. ఏ ఎయిర్‌లైన్స్ కూడా కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో 2020లో బోయింగ్ 747 విమానాల తయారీ నిలిపివేస్తున్నట్టుగా ప్రకటించింది.

ప్రత్యామ్నాయం ఏంటి ?

జంబో జెట్లతో చమురు ధరాభారం ఎక్కువగానే ఉన్నా అత్యంత పెద్ద విమానాన్ని రూపొందించడానికి బోయింగ్ ఎప్పట్నుంచో ప్రయత్నాలు చేస్తోంది. రెండు ఇంజిన్లు ఉండే 776ఎక్స్ అని పిలిచే ఈ సరికొత్త జంబో జెట్ 2020లోనే మార్కెట్లోకి రావాల్సి ఉండేది. కానీ కరోనా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ ప్రభావాలు పడడంతో విమానాల తయారీ ఆలస్యమవుతోంది. 2025 నాటికి ఈ సరికొత్త విమానాలు తేవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.



మొట్ట మొదటి విమానం ఇలా..!

బోయింగ్ 747 కంటే ముందు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చిన 707 బోయింగ్ విమానం చాలా ఇరుగ్గా ఉండేది. సీట్ల మధ్య రాకపోకలు సాగించడానికి ఒక్కటే మార్గం ఉండేది. దీంతో విమాన ప్రయాణాలపై ప్రజలకి ఒక రకమైన వ్యతిరేకత నెలకొంది. బోయింగ్ 747 రెండు అంతస్తులుతో, నడిచి వెళ్లడానికి రెండు మార్గాలతో అత్యంత సువిశాలంగా ఉండేది. బోయింగ్ 707 విమానం 200 మంది కంటే తక్కువ మంది ప్రయాణికులతో ఏకబిగిన 3 వేల నాటికల్ మైళ్లు ప్రయాణిస్తే, 400 మంది ప్రయాణికుల్ని మోసుకువెళుతూ బోయింగ్ 747 ఏకబిగిన 5వేల నాటికన్ మైళ్ల దూరం ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంది.

ఎన్నో ప్రత్యేకతలు

- మొట్ట మొదటి విమానాన్ని పాన్ యామ్ సంస్థ జనవరి 15, 1970లో కొనుగోలు చేసింది. తొలిసారి నిర్మించిన 747 విమానం 225 అడుగుల పొడవు ఉంది. దాని తోకభాగం ఆరు అంతస్తుల భవనం ఎంత పొడవు ఉంటుందో అంత ఉండేది.
- జంబో జెట్‌కి చమురు ఖర్చు ఎక్కువ కావడంతో డిజైన్ రూపొందించినప్పుడే కార్గో అవసరాలకు మార్చుకునే విధంగా రూపొందించారు. 3,400 బ్యాగేజీలను తీసుకువెళ్లే సామర్థ్యం దీనికి ఉంది. అదే ఈ విమానాలను ఇన్నాళ్లూ కాపాడుతూ వచ్చింది.
- 1990లో తొలిసారిగా బోయింగ్ 747–200 విమానాన్ని అమెరికా అధ్యక్షుడు వాడే ఎయిర్ ఫోర్స్ వన్ విమానంగా మార్చారు.
- ఇప్పటివరకు 1,574 విమానాలను తయారు చేశారు. ఇప్పటికీ 500 విమానాలు వాడుకలో ఉన్నాయి.
- ప్రయాణికుల, రవాణాతో పాటు అవసరమైనప్పుడు అంతరిక్షం నుంచి రాకపోకలకి అనుగుణంగా ఈ విమానాన్ని ఆధునీకరించారు.
- ఎయిర్ ఇండియా కూడా ఈ విమానాలను కొనుగోలు చేసి విస్తృతంగా వినియోగించింది. 1971లో తొలి విమానాన్ని కొనుగోలు చేసింది.

ఇక్కడ ఎవరూ ఎవరినీ...
బెదిరించలేరు: రిజిజు


ప్రజలే యజమానులు, మనంతా సేవకులమంటూ వ్యాఖ్యలు

ప్రయాగ్‌రాజ్: కొలీజియం విషయంపై కేంద్రానికి, న్యాయవ్యవస్థకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో న్యాయ మంత్రి కిరెణ్ రిజిజు మరోసారి స్పందించారు. ప్రయాగ్‌రాజ్‌లో అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ 150వ వార్షికోత్సవంలో పాల్గొని రిజిజు ప్రసంగించారు. హైకోర్టు జడ్జీల బదిలీలు, నియామకాల్లో ఏదైనా ఆలస్యమైతే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కేంద్రప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడం తెల్సిందే. దీనిపై శనివారం మంత్రి రిజిజు మాట్లాడారు. ' భారత్‌లో ప్రజలే అసలైన యజమానులు. మనమంతా సేవకులం. రాజ్యాంగం చూపిన మార్గనిర్దేశకత్వంలో ప్రజలకు సేవ చేసేందుకే మనం ఇక్కడ ఉన్నాం. ప్రజాభీష్టం మేరకు రాజ్యాంగానికి లోబడే దేశపాలన కొనసాగనుంది. ఇక్కడ ఎవరూ ఎవరినీ బెదిరించలేరు. కొన్ని సార్లు కొన్ని అంశాలపై చర్చలు జరుగుతాయి. ప్రజాస్వామ్యంలో వారి అభిప్రాయం చెప్పే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. బాధ్యతాయుత పదవుల్లో ఆసీనులైన వారు ఏదైనా చెప్పేముందు ఆలోచించాలి. అది దేశానికి ఉపయోగకరమో కాదో అని' అంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలనుద్దేశిస్తూ పరోక్షంగా వ్యాఖ్యానించారు. మరోవైపు ఐదుగురు జడ్జీలకు సుప్రీంకోర్టు జడ్జీలుగా పదోన్నతి సిఫార్సుపై ఏం తేల్చారంటూ శుక్రవారం సుప్రీంకోర్టు ప్రశ్నించడం, మరుసటి రోజే ఆ సిఫార్సులకు ఆమోదముద్ర పడటం గమనార్హం. ' దేశంలోని వేర్వేరు కోర్టుల్లో 4.90 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పిటిషన్‌దారులు తమ కేసు తాజా పరిస్థితిని ఒక్క క్లిక్‌తో తెల్సుకునేందుకు వీలుగా లీగల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం' అని మంత్రి చెప్పారు. 'మధ్యవర్తిత్వ బిల్లు తుదిరూపు దిద్దుకుంటోంది. ఆ తర్వాత పార్లమెంట్‌లో ఆమోదం పొందాక, దేశంలో సమాంతర న్యాయవ్యవస్థ ఆవిష్కృతమవుతుంది. చిన్న చిన్న కేసులు కోర్టుల బయటే పరిష్కారం పొందుతాయి. దీంతో కోర్టులకు కేసుల భారం చాలా తగ్గుతుంది' అని మంత్రి అన్నారు.

సుప్రీంకోర్టుకు ఐదుగురు జడ్జిలు




జస్టిస్ మిత్తల్



జస్టిస్ కరోల్



జస్టిస్ అమానుల్లా



జస్టిస్ మిశ్రా

న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబర్ 13వ తేదీన కొలీజియం పంపిన సిఫారసులకు కేంద్రం తాజాగా ఆమోదం తెలిపింది. దీంతో సుప్రీంకోర్టులో కొత్తగా శనివారం ఐదుగురు జడ్జిలు నియమితులయ్యారు. కొలీజియం సిఫారసు చేసిన విధంగా రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిత్తల్, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ మనోజ్ మిశ్రాలను గౌరవ రాష్ట్రపతి సుప్రీంకోర్టులో న్యాయమూర్తులుగా నియమించారని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు ట్వీట్ చేశారు. వారు సోమవారం ప్రమాణం చేయనున్నారు.

సుప్రీంకోర్టు జడ్జిగా మరో తెలుగుబిడ్డ

పీవీ సంజయ్‌కుమార్ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా మరో తెలుగు బిడ్డ జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి శనివారం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 1963, ఆగస్టు 14న సంజయ్‌కుమార్ జన్మించారు. తల్లిదండ్రులు పద్మావతమ్మ, రామచంద్రారెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1969 నుంచి 1982 వరకు అడ్వొకేట్ జనరల్‌గా రామచంద్రారెడ్డి విధులు నిర్వహించారు. వీరిది కడప జిల్లా అయినా సంజయ్‌కుమార్ పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నిజాం కాలేజీలో డిగ్రీ చదివిన తర్వాత.. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి లా పూర్తి చేశారు. 1988లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. తన తండ్రి వద్దే జూనియర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఆయన అన్ని రకాల కేసులను వాదించారు. తండ్రి వృత్తి బాధ్యతల నుంచి పదవీ విరమణ చేశాక, స్వతంత్ర న్యాయవాదిగా మారారు. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు న్యాయవాదిగా, హైదరాబాద్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ ప్రత్యేక అధికారిగా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకు ప్రభుత్వ న్యాయవాదిగానూ సేవలందించారు. 2008, ఆగస్టు 8న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు అడిషనల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. 2010, జనవరి 20న శాశ్వత న్యాయమూర్తిగా నియామకం అయ్యారు. 2019, అక్టోబర్ 14న చండీఘఢ్(పంజాబ్–హరియాణా) హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. అనంతరం మణిపూర్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి పదోన్నతిపై వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న జస్టిస్ సంజయ్‌కుమార్‌ను ఇతర జడ్జిలతోపాటు సుప్రీంకోర్టుకు నియమిస్తూ డిసెంబర్ 22న కొలీజియం సిఫార్సు చేసింది.

అత్యంత ప్రజాదరణ నేత మోదీనే

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యధిక ప్రజాదరణ ఉన్న నేతగా ప్రధాని మోదీ మరోసారి ఘనత సాధించారు. ప్రపంచదేశాధినేతల్లో ఎవరికి అధిక మద్దతు ఉందని సర్వే చేసే అమెరికాకు చెందిన గ్లోబల్ లీడర్ అప్రూవల్ ట్రాకర్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్' ఈ సంవత్సరం సైతం తాజాగా ఒక సర్వే చేసింది. ఈ సర్వేలో 78 శాతం మద్దతుతో మోదీ అగ్రస్థానంలో నిలిచారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌లనూ మోదీ వెనక్కి నెట్టడం విశేషం. మార్నింగ్ కన్సల్ట్ గత ఏడాది చేసిన సర్వేలో మోదీనే టాపర్‌గా నిలవడం విశేషం. మోదీ తర్వాత రెండోస్థానంలో మెక్సికో అధ్యక్షుడు ఆంద్రీస్ మాన్యువల్ లోపేజ్(68 శాతం మద్దతు), మూడోస్థానంలో స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలేన్ బెర్‌సెట్(62 శాతం) ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఏడో, తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకున్నారు. బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్ కేవలం 30 శాతం మద్దతుతో 13వ స్థానంలో ఆగిపోయారు.

న్యాయవ్యవస్థ సామర్థ్యం పెరుగుతుంది

రూ.7,000 కోట్ల బడ్జెట్ కేటాయింపులపై సీజేఐ

న్యూఢిల్లీ: ఇ–కోర్టుల ప్రాజెక్టు మూడో దశ కోసం 2023–24 కేంద్ర బడ్జెట్లో జరిపిన రూ.7,000 కోట్ల కేటాయింపులు న్యాయవ్యవస్థ సామర్థ్యం మరింత ఇనుమడిస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. శనివారం సుప్రీంకోర్టు 73వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో కోర్టు కార్యకలాపాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలకు చేర్చామన్నారు. 2020 మార్చి 23–2022 అక్టోబర్ 30 మధ్య సుప్రీంకోర్టు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏకంగా 3.37 లక్షల కేసులు విచారించిందని తెలిపారు. ''వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను ఎంతగానో అభివృద్ధి చేశాం. దాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నాం'' అని వివరించారు. కార్యక్రమంలో సింగపూర్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుందరేశ్ మీనన్ కూడా ప్రసంగించారు.

కేజ్రీవాల్ ఆఫీసు వద్ద బీజేపీ నిరసన

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసు ఈడీ చార్జిషీటులో పేరున్న సీఎం కేజ్రీవాల్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. శనివారం బీజేపీ శ్రేణులు కేజ్రీవాల్ కార్యాలయం వద్ద నిరసనకు దిగాయి. ఆప్ ప్రభుత్వ అవినీతిని ఎప్పటికప్పుడు బయటపెడుతూనే ఉంటామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ చెప్పారు. ఏమాత్రం నైతికత ఉన్నా కేజ్రీవాల్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. కేజ్రీవాల్‌కు తెలిసే మద్యం కుంభకోణం జరిగిందన్న ఆరోపణలకు ఈడీ చార్జిషీటే సాక్ష్యమని బీజేపీ నేత రణ్‌వీర్‌సింగ్ చెప్పారు.

అందరితోనూ గొడవే: కేజ్రీవాల్

ఇతరుల విధుల్లో తలదూరుస్తూ బీజేపీ ప్రభుత్వం తగవులకు దిగుతోందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. కొలీజియం విషయంలో సర్వోన్నత న్యాయస్థానంతోనూ విభేదాలకు తెరలేపిందని, ఇతరుల పనుల్లో జోక్యం చేసుకుంటోందని ట్వీట్లు చేశారు. ''ప్రతీ ఒక్కరితో మోదీ సర్కార్ కొట్లాటకు సిద్ధమైంది. న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు, బీజేపీయేతర పాలిత ప్రభుత్వాలు, రైతులు, వ్యాపారులు ఇలా అందరితో వాదనలకు దిగుతోంది. ఇలాగైతే దేశం పురోగమించదు. మీ పని మీరు చేయండి. వారి పని వారిని చేసుకోనివ్వండి'' అన్నారు.

సోరెన్ సర్కార్ విధానాలతో జార్ఖండ్‌లో...

బాగా తగ్గిపోయిన ఆదివాసీలు: అమిత్ షా

దేవ్‌గఢ్(జార్ఖండ్): జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శల వర్షం కురిపించారు. శనివారం రాష్ట్రంలోని దేవ్‌గఢ్‌లో విజయ్ సంకల్ప్ మహా ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా షా మాట్లాడారు. 'బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఆక్రమణదారులు ఇక్కడి ఆదివాసీ అమ్మాయిల్ని పెళ్లాడి బలవంతంగా భూములు లాక్కుంటున్నారు. చొరబాట్ల కారణంగా రాష్ట్రంలో ఆదివాసీల జనాభా 35 శాతం నుంచి 24 శాతానికి తగ్గిపోయింది. హేమంత్ సోరెన్ సర్కార్ దేశంలోనే అత్యంత అవినీతిమయ ప్రభుత్వం''అన్నారు.

లాటిన్ అమెరికాపైనా చైనా బెలూన్

అది నిఘా బెలూనే: బ్లింకెన్

వాషింగ్టన్: చైనాకు చెందిన మరో నిఘా బెలూన్‌ను గుర్తించినట్లు అమెరికా రక్షణ శాఖ తెలిపింది. ఈ రెండో బెలూన్ లాటిన్ అమెరికా దేశాల గగనతలంపై సంచరిస్తోందని పేర్కొంది. చైనాకు చెందిన మూడు బస్సుల సైజంత బెలూన్ గురువారం తమ గగనతలంలో కనిపించిందని, ఇది గత కొద్ది రోజులుగా కదులుతోందని అమెరికా తెలిపింది. భారీ బెలూన్ ఒకటి అణు క్షిపణుల కేంద్రమైన మోంటానాకు సమీపంలో కనిపించినందుకు నిరసనగా అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ చైనా పర్యటనను వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. ఇటీవలి సంవత్సరాల్లో రెండు దేశాల మధ్య సంబంధాలు భారీగా క్షీణించాయి. ఈ దశలో అమెరికా ఉన్నతాకారి ఒకరు చైనా పర్యటనకు తలపెట్టడం ఇదే మొదలు. 'లాటిన్ అమెరికా దేశాల మీదుగా ఒక బెలూన్ కదులుతున్నట్లు సమాచారం ఉంది. ఇది కూడా చైనా నిఘా బెలూన్ అనే అనుమానిస్తున్నాం'అని పెంటగాన్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ పాట్ రైడర్ శుక్రవారం చెప్పారు. ఈ రెండో బెలూన్ ఏ దేశం గగనతలంపై ఉంది? అమెరికా వైపుగా కదులుతోందా? అనే విషయాలు తెలియాల్సి ఉందని సీఎన్ఎన్ పేర్కొంది. మోంటానా సమీపంలో కనిపించిన బెలూన్ ప్రస్తుతం తూర్పు వైపుగా కదులుతోందని రైడర్ చెప్పారు. ఇందులో నిఘా పరికరాలతో కూడిన భారీ సామగ్రి ఉందన్నారు. బెలూన్ వ్యవహారంపై చైనాకు నిరసన తెలిపినట్లు వైట్‌హౌస్ తెలిపింది. ఇందుకు సంబంధించిన అనేక ప్రత్యామ్నాయాలు తమ ముందున్నాయని పేర్కొంది.

బెలూన్‌ను పంపించి వేయడమే మా లక్ష్యం: బ్లింకెన్

అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చైనా పర్యటన వాయిదా వేయడాన్ని ఆయన సమర్థించుకున్నారు. వాతావరణ సంబంధ ప్రయోజనాల కోసం ప్రయోగించిన ఆ బెలూన్ గాలి తీవ్రతకు వచ్చి ఉంటుందన్న చైనా వివరణను ఖండించారు. అది నిఘా అవసరాలకు ఉద్దేశించి చైనా పంపిన బెలూన్ అని పునరుద్ఘాటించారు. 'యూఎస్‌ఏ గగనతలంలో భారీ సామగ్రితో ఉన్న ఆ బెలూన్‌ను పంపించి వేయడం పైనే ప్రస్తుతం మా దృష్టంతా ఉంది. ఈ విషయంలో అనేక మార్గాల ద్వారా చైనాతో సంప్రదింపులు సాగుతున్నాయి. పరిస్థితులు అనుకూలిస్తే ఆ తర్వాత చైనాకు వెళ్లే విషయం ఆలోచిస్తాం. నిఘా బెలూన్‌ను చైనా మా గగనతలంలోకి పంపడం మా సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను కచ్చితంగా ఉల్లంఘించడమే. ఇది ఏమాత్రం ఆమోదనీయం కాదు. రెండు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకొచ్చే లక్ష్యంతో తలపెట్టిన నా పర్యటన సమయంలో ఇటువంటి చర్యకు పాల్పడటం చైనా బాధ్యతా రాహిత్యం కూడా'అని బ్లింకెన్ తేల్చి చెప్పారు. 'అమెరికా, చైనాలు బాధ్యతతో తమ సంబంధాలను సాగించాలని అంతర్జాతీయ సమాజం ఆశిస్తోంది. అమెరికా విధానాలు అందుకు తగ్గట్టుగానే ఉన్నాయి. చైనా కూడా అలాగే ఉంటుందని అనుకుంటున్నాం' అన్నారు. 'ఇలాంటి చర్యలకు దీటుగా బదులిస్తామని చైనాకు స్పష్టం చేశాం. సమాధానం కోసం వేచి చూస్తున్నాం'అని అన్నారు.

బృహస్పతి... ఉపగ్రహాల రాజు

తాజాగా డజను చంద్రుల గుర్తింపు
92 ఉపగ్రహాలతో శనిని దాటి టాప్‌కు



కేప్ కెనవెరాల్ (యూఎస్): సౌర కుటుంబంలో అతి పెద్దదైన గురు గ్రహం (బృహస్పతి) చుట్టూ మరో 12 ఉపగ్రహాలను సైంటిస్టులు కనిపెట్టారు. దీంతో దాని ఉపగ్రహాల సంఖ్య ఏకంగా 92కు పెరిగింది. తద్వారా 83 ఉపగ్రహాలున్న శని గ్రహాన్ని వెనక్కు నెట్టి సౌరమండలంలో అత్యధిక ఉపగ్రహాలున్న గ్రహంగా నిలిచింది. హవాయి, చిలిల్లోని టెలిస్కోప్‌ల సాయంతో 2021, 2022ల్లోనే గురు గ్రహపు కొత్త ఉపగ్రహాలను గుర్తించినా ఇంతకాలం పాటు నిశితంగా గమనించిన వాటి ఉనికిని తాజాగా నిర్ధారించారు. ఏకంగా 92 ఉపగ్రహాలతో గురు గ్రహం ఓ మినీ సౌర కుటుంబంగా భాసిల్లుతోందని వీటిని కనిపెట్టిన సైంటిస్టు స్కాట్ షెపర్డ్ చమత్కరించారు. ''అయితే ఇవన్నీ బుల్లి ఉపగ్రహాలే. ఒక్కోటీ కేవలం కిలోమీటర్ నుంచి 3 కిలోమీటర్ల పరిమాణంలో మాత్రమే ఉన్నాయి'' అని వివరించారు. పూర్తి వాయుమయమైన గురు గ్రహాన్ని, మంచుతో కూడిన దాని అతి పెద్ద ఉపగ్రహాలను అధ్యయనం చేసేందుకు ఏప్రిల్లో ఒక అంతరిక్ష నౌకను యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ పంపనుంది. వీటిలో యూరోపా క్లిపర్ అనే ఉపగ్రహం ఉపరితలంపై పేరుకున్న అపారమైన మంచు కింద భారీ సముద్రం దాగుందని నాసా భావిస్తోంది. దాని అధ్యయనం కోసం 2024లో యూరోపా క్లిపర్ మిషన్‌ను ప్లాన్ చేస్తోంది. అది వాసయోగ్యమేనా అన్న అంశాన్ని పరిశోధించనుంది. బృహస్పతి, శని చుట్టూ ఉన్న భారీ ఉపగ్రహాలు బహుశా పరస్పరం ఢీకొని ఉంటాయని, ఇన్నేసి బుల్లి ఉపగ్రహాలుగా విడిపోయాయని షెపర్డ్ పేర్కొన్నారు. ''యురేనస్, నెప్ట్యూన్‌లదీ ఇదే పరిస్థితి. కానీ అవి మరీ సుదూరాల్లో ఉన్న కారణంగా వాటి ఉపగ్రహాలను గుర్తించడం చాలా కష్టం'' అని వివరించారు. యురేనస్‌కు 27, నెప్ట్యూన్‌కు 14, అంగారకునికి రెండు ఉపగ్రహాలున్నాయి. బుధ, శుక్ర గ్రహాలకు ఒక్కటి కూడా లేదు.

అమెరికా ఫిర్యాదుతో ఫార్మా కంపెనీల్లో సోదాలు

– కంటి మందు తయారీ యూనిట్ సీజ్

సాక్షి, చెన్నై: అమెరికా ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదుతో కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు చెన్నై తిరుప్పోరూర్ సిప్‌కాట్‌లో ఉన్న ప్రైవేటు ఫార్మా కంపెనీలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఇక్కడి కంటి మందుల తయారీ యూనిట్‌ను అధికారులు సీజ్ చేశారు. వివరాలు.. భారత్‌లోని గ్లోబెల్ ఫార్మలిట్ అనే సంస్థ తయారు చేసిన మందు వినియోగించి తమ దేశంలో కొందరు కంటి చూపును కోల్పోయాలని కేంద్రానికి అమెరికా వైద్యాధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుప్పోరూర్ సిప్‌కాట్‌లో ఉన్న ఆ సంస్థలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఆరుగురు అధికారులతో కూడిన బృందం తనిఖీలు చేసింది. ఎగుమతికి సిద్ధం చేసిన కంటి మందు బాటిళ్ల ప్యాకింగ్‌ను నిలిపివేసింది.

వరాల బండి

దక్షిణ రైల్వేకు కేంద్ర బడ్జెట్‌లో సముచిత స్థానం లభించింది. పెండింగ్ ప్రాజెక్టులు, స్టేషన్ల ఆధునీకరణ, సౌకర్యాల కోసం భారీగా నిధులను కేటాయించారు. దక్షిణ రైల్వే పరిధిలోకి కేరళ, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్‌లో కొంతభాగం వస్తుంది. అయితే ఇందులో తమిళనాడుకే అగ్రపీఠం వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక త్వరలో చెన్నై నుంచి కోయంబత్తూరుకు వందే భారత్ రైలు పరుగులు పెట్టనున్నట్లు కేంద్ర పద్దులో ప్రకటించారు.



వందే భారత్‌రైలు

పట్టాలెక్కనున్న అభివృద్ధి

- బడ్జెట్‌లో దక్షిణ రైల్వేకు రూ. 11,313 కోట్లు కేటాయింపు
- తమిళనాడుకు రూ. 6,080 కోట్ల లబ్ధి
- త్వరలో చెన్నై నుంచి కోవైకు వందేభారత్

సాక్షి, చెన్నై: భారతీయ రైల్వేలో దక్షిణ రైల్వే పాత్ర కీలకం. ఈ జోన్ పరిధిలోని రైల్వే స్టేషన్ల నుంచి దేశంలోని దాదాపుగా అన్ని ప్రధాన నగరాలకు రైలు సేవలు అందుతున్నాయి. ప్రయాణికులు, సరకు రవాణాలో దక్షిణ రైల్వే దూసుకెళ్తోంది. ఈ రైల్వే జోన్ కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని కొన్ని పట్టణాల వరకు విస్తరించి ఉంది. ఇందులో చెన్నై, విల్లుపురం, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, కన్యాకుమారి, సేలం, ఈరోడ్, కోయంబత్తూరు వైపుగా నిత్యం రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఈ మార్గాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు దక్షిణ రైల్వే ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో గత బడ్జెట్‌లో కంటే ఈ ఏడాది అధికంగా నిధులను దక్షిణ రైల్వేకు కేటాయించడం విశేషం.



మీడియాతో మాట్లాడుతున్న ఆర్ఎన్ సింగ్

మౌలిక సదుపాయాలకు పెద్దపీట..

దక్షిణ రైల్వే జీఎం ఆర్ఎన్ సింగ్ కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలు, వివరాలను మీడియాకు వెల్లడించారు. 2023–24 బడ్జెట్‌లో దక్షిణ రైల్వేకు రూ.11,313 కోట్లు కేటాయించారని, ఇందులో రూ. 6,080 కోట్లతో తమిళనాడు రైల్వే పథకాలు విస్తృతం చేయనున్నామని వివరించారు. అలాగే దక్షిణ రైల్వే పరిధిలో 26 మార్గాల్లో రెండవ ట్రాక్ పనులకు రూ.1,564 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో తమిళనాడులోని తూత్తుకుడి, మదురై (అరుప్పుకోట్టై మార్గం) తదితర 12 మార్గాల పనులు రూ. 1,158 కోట్లతో చేపట్టనున్నామని పేర్కొన్నారు. మరో రూ. 475.78 కోట్లతో ట్రాక్ విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రైల్వే మార్గాల ఆధునీకరణ, సిగ్నలింగ్ వంటి పనులకు రూ. 1,300 కోట్లు, ఇతర నిర్మాణాలు, రైల్వే వంతెనలు, స్టేషన్లలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు నిధులను భారీగా కేటాయించారని తెలిపారు.



ఎగ్మూర్ స్టేషన్ విస్తరణ పనుల్లో సిబ్బంది



పుత్తూరు రైల్వే స్టేషన్

ఆంధ్రప్రదేశ్ వైపుగా..

ఆంధ్రప్రదేశ్ వైపుగా వెళ్లే రైల్వే మార్గాలైన దిండివనం – నగరికి రూ. 100 కోట్లు, అత్తిపట్టు–పుత్తూరుకు రూ. 50 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. త్వరలో చెన్నై – కోయంబత్తూరు మధ్య వందే భారత్ రైలు నడిపేందుకు సంబంధించిన సిఫార్సు చేశారు. రైల్వే టికెట్ కౌంటర్ల ఆధునీకరణ, భద్రత పెంపు వంటి అంశాలే కాకుండా ప్రయాణికుల సేవలు సులభతరం చేసే విధంగా సిబ్బంది తమిళం నేర్చుకునేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఎగ్మూర్‌తో పాటు 26 రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

8 ఎకరాల్లో ఉద్యానవనం

– మంత్రి శేఖర్‌బాబు



కోయంబేడు మార్కెట్‌లో పర్యటిస్తున్న మంత్రి శేఖర్ బాబు

సాక్షి, చెన్నై : కోయంబేడులో 8 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఉద్యానవనం ఏర్పాటు చేయనున్నామని సీఎండీఏ, దేవదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు తెలిపారు. కోయంబేడులోని అతి పెద్ద మార్కెట్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ మార్కెట్‌లోని 3,941 దుకాణాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నామని వివరించారు. ఈ మార్కెట్‌కు పక్కనే ఉన్న 8 ఎకరాల స్థలంలో భారీ ఉద్యాన వనం ఏర్పాటుకు నిర్ణయించామని తెలిపారు. కోయంబేడు మార్కెట్‌లో సేకరించిన చెత్త చెదారం, వ్యర్థాలను చేట్‌పట్‌లోని బయోగ్యాస్ పరిశ్రమకు తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే పనులు, ప్రయత్నాలకు వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఇంటింటికీ గ్యాస్ పైప్‌లైన్ పనులకు గ్రీన్ సిగ్నల్

– ప్రభుత్వానికి కార్పొరేషన్ నివేదిక

సాక్షి, చెన్నై: చెన్నైలో ఇంటింటికీ ఎల్‌పీజీ గ్యాస్ పంపిణీ పథకానికి కార్పొరేషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైప్‌లైన్ పనులకు సంబంధించిన నివేదికను ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి శనివారం పంపించారు. వివరాలు.. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లోని గృహాలు, హోటళ్లు, వర్తక వాణిజ్య సంస్థలకు సిలిండర్లకు బదులుగా పైప్‌లైన్ ద్వారా గ్యాస్ పంపిణీకి కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడులో చెన్నై, నాగపట్నం, కాంచీపురం, తిరువళ్లూరు, కోయంబత్తూరు, కడలూరు, తిరువారూర్, రామనాథపురం, సేలం, తిరుప్పూర్, వేలూరులలో పైప్‌లైన్ పనులకు రెండేళ్ల క్రితం నిర్ణయించారు. అయితే పనులు అడుగైన ముందుకు సాగలేదు. చెన్నైలో టొరంట్ గ్యాస్ సంస్థ పైప్‌లైన్ల ద్వారా ఇళ్లకే గ్యాస్ పంపిణీకి నిర్ణయించింది. ఈ అనుమతుల్లో జాప్యం తప్పలేదు. ఈ పరిస్థితుల్లో చెన్నై కార్పొరేషన్ వర్గాలు ఈ వ్యవహారంపై చర్చించి ప్రస్తుతం నిర్ణయం తీసుకున్నారు. చెన్నైలో అధిక శాతం రోడ్లు, వీధులు కార్పొరేషన్, రహదారుల శాఖ పరిధిలో ఉన్నాయి. ఈ రెండు విభాగాల సమన్వయంతో ప్రస్తుతం ఈ పథకం అమల్లోకి రానుంది. పలు విడతలుగా సాగిన సమీక్షల తర్వాత ఇంటింటికీ గ్యాస్ పంపిణీ నిమిత్తం పైప్‌లైన్ పనులకు కార్పొరేషన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే వర్షపు నీటి కాలువల మార్గం, భూగర్భ డ్రైనేజీ కాలువల వద్ద పనులు చేపట్టకుండా ఆంక్షలు విధించారు.

గంటన్నర ఆలస్యంగా గరుడాద్రి ఎక్స్‌ప్రెస్

తిరుత్తణి: రేణిగుంట రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ రైలు ప్రమాదం కారణంగా గరుడాద్రి ఎక్స్‌ప్రెస్ శనివారం గంటన్నర ఆలస్యంగా ప్రయాణించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివరాలు.. చెన్నై నుంచి తిరుపతికి వెళ్లే గరుడాద్రి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరుత్తణి రైల్వే స్టేషన్ చేరుకుంది. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంట రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ రైలు ప్రమాదానికి గురైంది. ఫలితంగా రైలు సేవలు స్తంభించిపోయాయి. దాదాపు గంటన్నర తర్వాత సిగ్నల్ లభించడంతో ఈ రైలు తిరుపతికి బయలుదేరింది.

వానియంబాడిలో ఘోరం

- పంచెలు, చీరల పంపిణీలో తొక్కిసలాట
- నలుగురి మృతి, 10 మందికి తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం



మృతదేహాలను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీపంలో శనివారం ఘోరం చోటు చేసుకుంది. పంచెలు, చీరల పంపిణీలోని తొక్కిసలాట జరిగి నలుగురు మహిళలు అక్కడిక్కడే మృతి చెందగా మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక జిన్నా బ్రిడ్జి వద్ద కోట గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త అయ్యప్పన్ ఏటా తైపూస ఉత్సవాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు ఉచితంగా పంచెలు, చీరలను పంచి పెట్టడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం తైపూస ఉత్సవాన్ని పురస్కరించుకొని పంచె, చీరలు అందజేయనున్నట్లు ప్రకటించడంతో ముందస్తుగా టోకెన్‌లు పొందిన మహిళలు సుమారు 2 వేల మందికి పైగా జిన్నా బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అయితే మహిళలు క్యూలో కాకుండా గుంపులుగా చేరడంతో తోపులాట, తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈక్రమంలో కింద పడి అరకాందపట్టి గ్రామానికి చెందిన రాజాత్తి (45), ఈచంపట్టుకు చెందిన నాగమ్మ (47), ముత్తంపట్టికి చెందిన చిన్నమ్మ (57), కురుంబట్టికి చెందిన వళ్లియమ్మ (65) మృతి చెందారు. వానియంబాడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో స్పృహ తప్పి పడి ఉన్న 10 మంది మహిళలను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కాగా చీరల పంపిణీకి సదరు పారిశ్రామికవేత్త ముందుస్తు అనుమతి తీసుకున్నారా..? లేదా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా చీరల కోసం వచ్చిన నిరుపేద మహిళలు మృత్యువాత పడడం స్థానికులను తీవ్ర ఆవేదనకు గురి చేసింది.



ఉచిత పంచెలు, చీరల కోసం భారీగా వేచి ఉన్న మహిళలు

ముంచిన వాన

- తిరువారూర్‌లో 2.28 లక్షల ఎకరాలు వర్షార్పణం
- పరిహారం కోసం అన్నదాతల వేడుకోలు
- ఆదుకోవాలని జాలర్ల డిమాండ్



నీటమునిగిన పంటను చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

సాక్షి, చెన్నై: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డెల్టా జిల్లాల్లో పంటలు అతలాకుతలం అయ్యాయి. చేతికి అందొచ్చిన పంటలు దెబ్బ తినడంతో అన్నదాతలు లబోదిబో మంటున్నారు. పరిహారం కోసం ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. శ్రీలంక సమీపంలో వాయుగుండం తీరం దాటి రెండు రోజులైనప్పటికీ, ఈ ప్రభావం తమిళనాడులోని నాగపట్నం, తిరువారూర్, మైలాడుతురై, పుదుకోట్టై, తంజావూరు జిల్లాలపై అధిక ప్రభావాన్ని చూపించింది. ఫలితంగా పలుచోట్ల వరి, ఉద్ది పంట, వేరుశనగ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క తిరువారూర్ జిల్లాలో 2.28 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. పుదుకోట్టై, నాగపట్నం, మైలాడుతురై జిల్లాలోనూ రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి రూ.30 వేలు నష్ట పరిహారం చెల్లించాలని అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ వర్షాల కారణంగా ఐదు జిల్లాలోని లక్షన్నర మంది జాలర్లు 5 రోజులుగా చేపల వేటకు వెళ్లలేదు. కోట్లాది రూపాయల వర్తకం ఆగింది. తమను ఆదుకోవాలని, నివారణ సాయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ వర్షాలు ఆదివారం సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

డెల్టాకు మంత్రుల బృందం..

తంజావూరు, తిరుచ్చి, మైలాడుతురై, నాగపట్నం, తిరువారూర్, అరియలూరు, పుదుకోట్టై జిల్లాలో వర్ష బీభత్సాన్ని పరిశీలించేందుకు మంత్రుల బృందాన్ని సీఎం ఎంకే స్టాలిన్ రంగంలోకి దించారు. శనివారం రాత్రి ఇందుకు సంబంధించి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షం సృష్టించిన విలయం కారణంగా సంభవించిన పంట నష్టం తీవ్రతను పరిశీలించి నివేదిక రూపొందించడంతో పాటు పరిహారానికి సంబంధించిన చర్యలు చేపట్టేందుకు మంత్రుల బృందాన్ని పంపిస్తున్నట్లు అందులో వివరించారు. వ్యవసాయ మంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం, పౌర సరఫరాల శాఖ మంత్రి చక్రపాణిలతో పాటు వ్యవసాయ, రెవెన్యూ, తదితర విభాగాల కార్యదర్శులు, డైరెక్టర్లు ఈ బృందంలో ఉంటారన్నారు.





దెబ్బతిన్న పంటను రక్షించుకునేందుకు యత్నిస్తున్న అన్నదాతలు

బాధ్యతతో కర్తవ్యాన్ని నెరవేర్చండి





కొత్త ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సీఎం స్టాలిన్

- కొత్త ఐఏఎస్, ఐపీఎస్‌లకు సీఎం స్టాలిన్ పిలుపు
- సచివాలయంలో భేటీ

సాక్షి, చెన్నై: విధి నిర్వహణలో బాధ్యతతో పని చేయాలని నూతనంగా నియమితులైన ఐఏఎస్, ఐపీఎస్‌లకు సీఎం స్టాలిన్ పిలుపు నిచ్చారు. శనివారం సచివాలయంలో ఆయన కొత్త అధికారులతో సమావేశమయ్యారు. వారి విధులు, ప్రభుత్వ పథకాలు, ప్రజలతో మమేకమయ్యే విధంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ మేరకు ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల్లో పనిచేయడానికి వెళ్తున్న వారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే మన్ననలు పొందినట్లు గుర్తు చేశారు. దీనికి సీఎం, సీఎస్, వ్యక్తిగత కార్యదర్శులే కాదు, ప్రతి అధికారి, కిందిస్థాయి సిబ్బంది ప్రధాన కారణమని వివరించారు.

హఠాత్తుగా పర్యటనకు వస్తా..

ప్రతి జిల్లాలో చేపడుతున్న పనులు, పథకాల తీరుతెన్నుల గురించి సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. రెండు రోజుల క్రితం తాను రాణిపేట, వేలూరు, తిరుపత్తూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించానని, అక్కడి పనులు సంతృప్తికరంగా ఉన్నట్లు వివరించారు. ప్రతిఒక్కరి మెప్పు పొందే విధంగా జిల్లాల్లోని అధికారుల పనితీరు ఉండాలని, ఈమేరకు సుదీర్ఘ ప్రయాణం సాగించాలని ఆకాంక్షించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పెండింగ్ పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులు, అడ్డంకుల కారణంగా ఆగిన పనులు ఇలా అన్నింటిని గురించి సమగ్ర పరిశీలన చేయాలని వివరించారు. సీఎం ఫీల్డ్ సర్వే కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయి పర్యటనకు ఏ సమయంలో ఏ జిల్లాకు వస్తానో తెలియదని, అన్నింటికి సిద్ధమై ఉండాలన్నారు. జాతి పిత మహాత్మాగాంధీ పేర్కొన్నట్లు 'క్షేత్ర స్థాయిలోకి వెళ్లండి', దివంగత నేత అన్నాదొరై పేర్కొన్నట్లు 'ప్రజల్లోకి వెళ్లండి' అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని నిత్యం జాగ్రత్తగా పని చేయాలని సూచించారు.

మౌనంగా ఉంటాననుకోవద్దు..

పనులను అధికారులకు అప్పగించి తాను మౌనంగా ఉంటానని అనుకోవద్దని స్టాలిన్ హితవు పలికారు. ఏఏ సమయాల్లో, ఏఏ రోజుల్లో ఏఏ పనులు పూర్తి చేశారో, ప్రతి ఒక్కరి పనితీరుపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక పరిశీలన ఉంటుందన్నారు. మార్చిలో రాష్ట్ర బడ్జెట్ దాఖలు చేయనున్నామని గుర్తు చేశారు. ప్రాజెక్టుల స్థితిగతులపై ప్రత్యేక ప్రకటన చేయాల్సి ఉంటుందని, ఇందుకు తగ్గ నివేదికలను సిద్ధం చేయాలని, కొత్త బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ ఇరై అన్బు తదితర అధికారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా తంజావూరులోని 88 ఆలయాల పర్యవేక్షణకు రూ. 3 కోట్ల నిధులను సీఎం కేటాయించారు.

దివికేగిన సంగీత శిఖరం



వాణిజయరాం పార్థీవదేహాన్ని ఇంటిలోకి తరలిస్తున్న బంధువులు



నివాళులు అర్పించడానికి వచ్చిన గవర్నర్ ఆర్ ఎన్ రవి



నివాళులు అర్పించేందుకు వెళ్తున్న గాయని చిత్ర



భౌతికకాయాన్ని సందర్శించడానికి వస్తున్న ప్రముఖులు, బంధువులు

ప్రముఖ గాయని వాణిజయరాం (78) శనివారం చెన్నైలో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆమె భౌతిక కాయాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగృహంలో ఆప్తులు, అభిమానులు సందర్శనార్థం ఉంచారు. పలువురు ప్రముఖులు ఆమెకు నివాళులర్పించారు. – తమిళ సినిమా

చెన్నై ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023 సాక్షి

క్లుప్తంగా

దార్శనికుడు స్వామి వివేకానంద



గోపాలకృష్ణన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న స్వామి విమూర్తానంద

కొరుక్కుపేట: స్వామి వివేకానంద మానవాళికి దార్శనికుడు అని తంజావూరు రామకృష్ణ మఠం విమూర్తానందస్వామిజీ అన్నారు. 1897 ఫిబ్రవరిలో స్వామి వివేకానంద కుంభకోణం ప్రాంతాన్ని సందర్శించి 125 ఏళ్ల పూర్తి చేసుకుంది. మూడు రోజుల పాటు విద్యా సంస్థలను సందర్శించి తన అమూల్యమైన సందేశాన్ని అందించారు. అందుకు గుర్తుగా తంజావూరు రామకృష్ణ మఠం మూడు రోజుల ర్యాలీ, ఉపన్యాస కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. తంజావూరు రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామి విమూర్తానంద సదరన్ రైల్వే సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్ కేకే గోపాల కృష్ణన్‌ను ఘనంగా సత్కరించారు. హిందూమత వ్యాప్తికి స్వామి వివేకానంద చేసిన కృషిని వివరించారు. స్వామి వివేకానంద మాటలు స్ఫూర్తిదాయకం అని, నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

నామక్కల్‌లో బిర్యానీ పోటీ

అన్నానగర్: నామక్కల్‌లోని పరమత్తి రోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం బిర్యానీ పోటీ నిర్వహించారు. ఇందు కోసం లాటరీ పద్ధతిలో 40 మందిని ఎంపిక చేశారు. ఎంట్రీ ఫీజుగా రూ.99 వసూలు చేశారు. 20 నిమిషాల్లో ఎక్కువ తినే ముగ్గురికి బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. బిర్యానీతో పాటు రెండు గుడ్లు, స్వీట్ వడ్డించారు. నామక్కల్‌కు చెందిన శరవణన్ (23) అత్యధికంగా 2.650 కిలోల బిర్యానీ తిని మొదటి స్థానం, జీవా 2.350 కిలోలతో రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఖైదీలకు పుస్తకాలు వితరణ

అన్నానగర్: మదురై సెంట్రల్ జైలులో ఖైదీల పఠనా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు లైబ్రరీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జైలు అధికారులు ప్రజల నుంచి పుస్తకాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మదురైలోని రైలర్‌నగర్‌కు చెందిన బాలకృష్ణన్ (92) మదురై సెంట్రల్ జైలుకు లేఖ రాశారు. అందులో తన వద్ద ఉన్న 300 పుస్తకాలను జైలు లైబ్రరీకి ఉచితంగా ఇవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు. వృద్ధాప్యం కారణంగా తాను రాలేనని.. వచ్చి తీసుకోవాలని పేర్కొన్నారు. మదురై సెంట్రల్ జైలు అధికారులు శుక్రవారం రాధాకృష్ణన్ వద్దకు వెళ్లి ఆయన నుంచి 300 పుస్తకాలు తీసుకున్నారు. ఆయనను ప్రశంసించారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతం



సమావేశంలో డాక్టర్ వీఎల్ ఇందిరాదత్, చార్టర్డ్ అకౌంటెంట్లు

కొరుక్కుపేట: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్–2023 చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊతమిచ్చేలా ఉందని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ)అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మైలాపూర్‌లో శుక్రవారం రాత్రి 'కేంద్ర బడ్జెట్ 2023– విశ్లేషణ' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎల్ ఇందిరా దత్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అన్ని రంగాలనూ ప్రోత్సహించేలా ఉందన్నారు. స్టార్టప్‌లను మరింతగా ప్రోత్సహించడమే కాకుండా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను బలోపేతం చేసేలా ఉందని కొనియాడారు. చార్టెడ్ అకౌంటెంట్‌లు ఎంఆర్ వెంకటేష్, సీఏ టీడీ సురేష్, సీఏ వీవీ సంపత్ కుమార్ బడ్జెట్‌లోని అంశాలను వివరించారు. ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ముత్తు వేల్, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ వెంకటేశ్వర రావు, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ కేఎస్ సురేష్ బాబు, సెక్రటరీ జనరల్ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వేలూరు పర్యటన ఎఫెక్ట్?

- ఇద్దరు కలెక్టర్లు, ఎస్పీలపై బదిలీ వేటు



రాణిపేట నూతన కలెక్టర్ వలర్‌మది



రాణిపేట నూతన ఎస్పీ కిరణ్ శృతి



తిరుపత్తూరు కలెక్టర్ భాస్కర పాండియన్

వేలూరు: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకుగాను.. ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల 'సీఎం ఫీల్డ్ సర్వే' కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించారు. ఇందులో భాగంగా వేలూరులో ఈనెల 1,2 తేదీల్లో తొలి పర్యటన సాగించారు. వేలూరు, తిరుపత్తూరు, తిరువణ్ణామలై, రాణిపేట జిల్లాలోని కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వేలూరు కలెక్టరేట్‌లో సమీక్షించారు. తర్వాత చెన్నైకి వెళ్లిన సీఎం స్టాలిన్ 24 గంటలు కూడా కాక ముందే తిరుపత్తూరు, రాణిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా పనిచేస్తున్న వలర్‌మదిని రాణిపేట కలెక్టర్‌గా నియమించారు. ఇది వరకు కలెక్టర్‌గా ఉన్న భాస్కర పాండియన్‌ను తిరుపత్తూరు కలెక్టర్‌గా, తిరుపత్తూరు కలెక్టర్‌గా ఉన్న అమర్ కుస్వాను సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. కలెక్టర్‌లపై ఆకస్మికంగా బదిలీ వేటు పడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సీఎం సమీక్షలో తిరుపత్తూరు జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదనే ఆరోపణలు రావడం, నాట్రంబల్లి ప్రాంతంలో అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో ఈ చర్యలు చేపట్టినట్లు భావిస్తున్నారు. ఇక రాణిపేట జిల్లాలో పలు సంక్షేమ పథకాలను అమలు చేసిన కలెక్టర్ భాస్కర పాండియన్‌ను తిరుపత్తూరుకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అదే విధంగా చెన్నై సైబర్ క్రైమ్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ స్మృతిని రాణిపేట ఎస్పీగా ఇది వరకు పనిచేసిన దీప సత్యన్‌ను చెన్నై పోలీస్ కంట్రోల్ విభాగానికి బదిలీ చేశారు.

ఎస్ఎస్ఈలో స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ సదస్సు

సాక్షి, చెన్నై: ఎస్ఎస్ఈలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ సహకారంతో స్మార్ట్‌హోమ్ ఆటోమేషన్‌పై ఎంటర్ ప్రెన్యూరిషిప్ అవకాశాల సదస్సు శనివారం విజయవంతంగా జరిగింది. ఇందులో పెద్దసంఖ్యలో తరలి వచ్చిన విద్యార్థులకు టెక్నాలజీ, మార్కెటింగ్, ఆటో మెటిక్, రిమోట్ తదితర విధానాల గురించి నిపుణులు వివరించారు. ప్రధానంగా సుప్రీం సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ ఎండీ జాషువా పాల్ ప్రత్యేక ఉపన్యాసం చేశారు. స్మార్ట్ హోమ్‌లను తీర్చిదిద్దే విధానాలు, మానవ ప్రయత్నాల గురించి వివిధ విభాగాల ఇంజీరింగ్ విద్యార్థులకు ఆయన వివరించారు.

క్యాన్సర్ పరిశోధనలే లక్ష్యంగా ఒప్పందాలు

సేలం: క్యాన్సర్‌పై పరిశోధనలను విస్తృతం చేయడమే లక్ష్యంగా ముంబై కార్కినోస్ హెల్త్ కేర్, వినాయక మిషన్ రీసెర్చి ఫౌండేషన్ మధ్య ఒప్పందాలు జరిగాయి. ఇందులో భాగంగా ఈ రెండు సంస్థలు సేలంలో అత్యాధునిక సౌకర్యాలతో వినాయక–కార్కినోస్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (వీకేఓఐ)ను శనివారం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా కార్కినోస్ మెడికల్ డైరెక్టర్ మోని అబ్రహం కురియాకోస్ మాట్లాడుతూ.. ముంబై కేంద్రంగా క్యాన్సర్‌కు సంబంధించిన అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ డయాగ్నోస్టిక్స్ సదుపాయాలతో కూడిన సేవలను అందిస్తున్నామని వివరించారు. రోగులకు మెరుగైన వైద్యు సదుపాయాలతోపాటు ఆంకాలజీ పరిశోధన సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో సేలం పుదుచ్చేరిలలో ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేశామన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



డిగ్రీ పట్టాలను అందజేస్తున్న తిరువళ్లువర్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆరుముగం

వేలూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టి పెట్టాలని తిరువళ్లువర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆరుముగం అన్నారు. వేలూరు అన్నై మీరా ఇంజినీరింగ్ కళాశాల ఐదో స్నాతకోత్సవం శనివారం ఉదయం జరిగింది. కార్యక్రమానికి వైస్ చాన్స్‌లర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్‌లతో సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే విజయం సాధించగలరని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే ఎలక్ట్రానిక్ వస్తువులు 60 శాతం చైనావేనని అన్నారు. మన దేశంలో అలాంటి వస్తువులను తయారు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే మనం నూతన వస్తువులను తయారు చేయకపోవడంతో ఇతర దేశాలకు చెందిన వస్తువులను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం డిగ్రీలు సాధించిన విద్యార్థులు ఇంతటితో విద్యను నిలిపివేయకుండా పరిశోధనలు చేసి దేశాభివృద్ధికి దోహదపడాలని హితవు పలికారు. తెలియని విషయాలను తెలుసుకోవాలే తప్పా తనకు అన్నీ తెలుసునని గర్వించరాదన్నారు. అనంతరం డిగ్రీ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రామదాస్, కళాశాల కార్యదర్శి దామోదరన్, డైరెక్టర్‌లు కిషోర్ కుమార్, ప్రశాంత్, ప్రిన్సిపల్ గోపినాథన్, వైస్ ప్రిన్సిపల్ శరవణన్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులను ఆదుకోండి

– సినీ దర్శకుడు వెట్రిమారన్ పిలుపు



ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో వెట్రిమారన్ తదితరులు

కొరుక్కుపేట: క్యాన్సర్ బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని, రోగులకు కేశాలు దానం చేసేందుకు సహాయపడాలని సినీ దర్శకుడు వెట్రిమారన్ పిలుపునిచ్చారు. చెన్నైకి చెందిన చెరియన్ ఫౌండేషన్ తన క్యాంపెయిన్ 'గిఫ్ట్ హెయిర్ గిఫ్ట్ కాన్ఫిడెన్స్' పేరిట జుట్టు రాలుతున్న క్యాన్సర్ రోగులకు సహాయం చేయడానికి కృషి చేస్తోంది. శనివారం సాయంత్రం చెరియన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం, గిఫ్ట్ హెయిర్ గిఫ్ట్ కాన్ఫిడెన్స్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దర్శకుడు వెట్రిమారన్, ఫౌండేషన్ ట్రస్టీ సారా బెంజమిన్ చెరియన్, రాజ్ హెయిర్ ఇంటర్నేషనల్ సీఈవో ట్రస్టీ జార్జి బి చెరియన్ పాల్గొన్నారు. దేశంలోని నాలుగు ప్రధాన క్యాన్సర్ ఆసుపత్రులకు 250 విగ్గులను అందజేయనున్నామని వెల్లడించారు.ఈ ఫౌండేషన్ ద్వారా 10 ఏళ్లలో 10 వేల విగ్గులను విరాళంగా అందజేసినట్లు వివరించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న తమిళిసై సౌందరరాజన్

కొరుక్కుపేట: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన పోషకాహారాన్ని అందించాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. శనివారం నగరంలోని ఐఏపీఈఎన్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండియా క్లినికల్ న్యూట్రిషన్ కాంగ్రెస్–2023 సదస్సును ఆమె ప్రారంభించారు. సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన పోషకాహారం అందించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మెడికల్ సెమినార్లలో పాల్గొనాల్సిందిగా తనకు ఆహ్వానం అందితే ప్రాథమిక కర్తవ్యంగా భావిస్తానని పేర్కొన్నారు. వైద్య రంగంలో పరిశోధనలు దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనంలో కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలంగాణలో పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పుదుచ్చేరి పాఠశాలల్లో విద్యార్థులకు తన మొదటి సంతకంతో 3 గుడ్లు అందించే ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్లినికల్ న్యూట్రిషన్ కమిటీల అభిప్రాయాలను నమోదు చేసి వర్క్‌షాప్‌లు నిర్వహించారు. భువనేశ్వరి, పీసీ విజయకుమార్ పాల్గొన్నారు.

మణిరత్నంకు ధన్యవాదాలు

తమిళ సినిమా: గౌతమ్ కార్తీక్ ఇటీవలే నటి మంజిమా మోహన్‌ను పెళ్లి చేసుకుని ఓ ఇంటి వాడయ్యారు. తాజాగా నటుడిగా మరో మైలురాయిని కూడా టచ్ చేశారు. సీనియర్ నటుడు కార్తీక్ వారసుడిగా 2012లో మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన కడల్ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయమయ్యారు. అలా నటుడిగా 10 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ కార్తీక్ తాజాగా నటిస్తున్న క్రిమినల్ చిత్ర షూటింగ్‌లో యూనిట్ వర్గాలు కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ కార్తీక్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ తనపై నమ్మకంతో మంచి అవకాశాన్ని కల్పించిన దర్శకుడు మణిరత్నంకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తన ఈ సినీ ప్రయాణం ఉత్సాహంగానూ, ఉన్నతంగానూ, భయంగానూ, చాలెంజ్ గానూ, అద్భుతంగానూ, కొత్త విషయాలను నేర్చుకునే విధంగా ఉందన్నారు. నటుడిగా విజయాలు, అపజయాలు ఇచ్చిన అనుభవంతో ఇకపై మంచి చిత్రాలతో అలస్తారని గౌతమ్ కార్తీక్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈయన 1947, పత్తుతల, క్రిమినల్ తదితర చిత్రాల్లో నటిస్తున్నారు.



గౌతమ్ కార్తీక్‌ను సత్కరిస్తున్న యూనిట్ సభ్యులు

కోలీవుడ్ టాక్స్



పాట్టి సొల్లై తట్టాదే చిత్ర ఆడియో ఆవిష్కరణ

చిన్న చిత్రాలను ఆదరించాలి

తమిళ సినిమా: ఎంజాయ్ సినిమాస్, ఫ్రెండ్స్ టాకీస్ సంస్థల అధినేతలు కేఎల్ ధనశేఖర్, సాయి శరవణన్ కలిసి నిర్మిస్తున్న చిత్రం పాట్టి సొల్లై తట్టాదే. హేమసూర్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటి నళిని, ఆర్ పాండిరాజన్, ఎంఎస్ భాస్కర్, ఆర్‌జె.విజయ్, పవర్‌స్టార్ శ్రీనివాసన్, అనుషీల, కేపీవై బాలా, సెంథిల్ కుమారి, కాదల్ శరవణన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. విజయ శంకర్ సంగీతాన్ని కేఎస్.సెల్వరాజ్ చాయాగ్రహణం అందించారు. చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం చెన్నైలోని సత్యం సినిమాస్ థియేటర్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో సీనియర్ దర్శకుడు ఎస్పీ ముత్తురామన్, కె.భాగ్యరాజ్, కే రాజన్, రాజేష్, ఎస్వీ.శేకర్, ఆర్ పాండిరాజన్, జాగ్వర్ తంగం, సంగీత దర్శకుడు దీనా, నటి నళిని తదితరులు పాల్గొన్నారు. సంగీత దర్శకుడు దీనా చిత్ర ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటి నళిని మాట్లాడుతూ.. కరోనా కాలంలో రూపొందించిన చక్కని కథా చిత్రం ఇదని చెప్పారు. తనది చాలా మంచి పాత్ర అని.. దర్శకుడు హేమసూర్య చక్కని సందేశంతో వైవిధ్యంగా తెరపై ఆవిష్కరించారన్నారు. ఇంతకుముందు మనోరమ నటించిన ఈ చిత్ర టైటిల్ తమకు ఇచ్చిన ఏబీఎస్ సంస్థకు ఈ సందర్భంగా ధన్యవాదాలు చెప్పుకుంటున్నానన్నారు. నటుడు, నిర్మాత కే రాజు మాట్లాడుతూ చిన్న చిత్రాలు విజయవంతం అయితే కొత్త నిర్మాతలు చిత్రాలు నిర్మించడానికి వస్తారన్నారు. చిన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

జీవితంలో అవి ఉంటే చాలు

తమిళ సినిమా: అనతికాలంలోనే దక్షిణాదిలో మంచి పేరు తెచ్చుకున్న నటి సాయి పల్లవి. గ్లామరస్ హీరోయిన్లకు పోటీగా సంప్రదాయ కట్టు, బొట్టు అంతకు మించి హావభావాలతో పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. మేకప్ విషయంలో సహజత్వానికి ప్రాముఖ్యత నిచ్చే నటి సాయి పల్లవి. మలయాళం నుంచి దిగుమతి అయినా తెలుగు ప్రేక్షకులు అక్కున చేర్చుకున్నారు. ఈమె కూడా వారు మెచ్చే విధంగా నటనకు అవకాశం ఉన్న పాత్రలనే ఎంపిక చేసుకుంటోంది. అయితే ఎందుకనో కోలీవుడ్‌లో ఈమెకు సరైన విజయం దక్కలేదనే చెప్పాలి. ఇక్కడ కూడా సూర్య, ధనుష్ వంటి స్టార్ హీరోలతో నటించింది. అయినా సక్సెస్ మాత్రం రాలేదు. ఆ మధ్య టైటిల్ పాత్రలో నటించిన గార్గీ అనే మలయాళ చిత్రాన్ని అదే పేరుతో నటుడు సూర్యకు చెందిన 2డీ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ అనువాదం చేసి విడుదల చేసింది. ఆ చిత్రం సాయి పల్లవికి మంచి పేరే తెచ్చిపెట్టింది. అయితే ఆ తరువాత ఈమె నటించిన చిత్రాలేవీ రాలేదు. గ్యాప్ వచ్చిందా? అంటే తనే తీసుకుందనే సమాధానమే వస్తోంది. ఇటీవల తెలుగులో చిరంజీవికి చెల్లెలుగా నటించే మంచి అవకాశం వచ్చినా, తిరస్కరించింది. ఆ తరువాత సాయి పల్లవిపై రకరకాల వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నటనకు స్వస్తి చెబుతుందనే ప్రచారం కూడా జరిగింది. కారణం ఏమైనా సాయి పల్లవి సామాజిక మాధ్యమాలకు కూడా దూరంగా ఉంటోంది. తాజాగా ఆమె ట్విట్టర్‌లోకి వచ్చింది. అందులో జీవితంలో చిరునవ్వు, ఆశ, కృతజ్ఞతా భావం ఉంటే చాలు అని పోస్ట్ చేసి చిరునవ్వులు చిందిస్తున్న తన ఫొటోను ఉంచింది. దీంతో ఈమె భావం ఏమిటా అని నెటిజన్లు ఆరా తీయడం మొదలు పెట్టారు. కాగా ప్రస్తుతం కోలీవుడ్‌లో శివకార్తికేయన్‌తో నటిస్తున్న చిత్రం ఒక్కటే ఈమె చేతిలో ఉంది.



నటి సాయి పల్లవి

దళపతి కొత్త చిత్రం లియో

తమిళ సినిమా: నటుడు విజయ్ బ్యాక్ టు బ్యాక్ చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఈయన తాజా చిత్రం వారిసు పొంగల్ సందర్భంగా జనవరి 11వ తేదీ విడుదలై మంచి వసూళ్లను సాధించింది. అందులో నటి రష్మిక మందన్న, జయసుధ, సంగీత, శరత్ కుమార్, ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, శ్యామ్, అతిథి పాత్రలో ఎస్‌జే సూర్య నటించారు. కాగా తాజాగా విజయ్ తన 67వ చిత్రంలో నటిస్తున్నారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని 7 స్క్రీన్ స్టూడియో పతాకంపై ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మిస్తున్నారు. మాస్టర్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రం తర్వాత విజయ్ దర్శకుడు లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం ఇది. వారిసు చిత్రంలో కంటే ఇందులో మరింత భారీ తారాగణం నటించడం విశేషం. నటి త్రిష, ప్రియా ఆనంద్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, మన్సూర్ అలీ ఖాన్, దర్శకుడు గౌతమ్ మీనన్, మిష్కిన్, నృత్య దర్శకుడు శాండీ, మలయాళ నటుడు మాథ్యూ థామస్ తదితరులు నటిస్తున్నారు. అనిరుద్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను జనవరి 2వ తేదీ చెన్నైలో ప్రారంభించారు. తాజాగా రెండో షెడ్యూల్ కోసం కాశ్మీర్‌లో మకాం వేశారు. ఈ చిత్ర టైటిల్, విడుదల తేదీని శుక్రవారం సాయంత్రం అధికారికంగా వెల్లడించారు. చిత్రానికి లియో అనే టైటిల్ నిర్ణయించారు. అదేవిధంగా దీన్ని అక్టోబర్ 19వ తేదీ విడుదల చేయనున్నట్లు వీడియోను విడుదల చేశారు. అందులో విజయ్ తనను చంపడానికి వచ్చిన విలన్లతో ఫైట్ చేయడానికి సిద్ధం అవుతున్న సన్నివేశాన్ని పొందుపరిచారు. దీంతో విజయ్ అభిమానులు ఖుషి అవుతున్నారు. అదేవిధంగా చిత్రాన్ని తమిళం, తెలుగు, కన్నడం, హిందీ తదితర భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.



విజయ్‌తో త్రిష

తాన్యా కథానాయకిగా రెక్కై ముళైత్తేన్



రెక్కై ముళైత్తేన్ చిత్రంలో తాన్యా రవిచంద్రన్

తమిళ సినిమా: నటి తాన్య రవిచంద్రన్ కథానాయకిగా నటిస్తున్న చిత్రం రెక్కై ముళైత్తేన్. ఈమె తొలి లేడీ ఓరియంటెడ్ చిత్రం ఇది. ఇంతకుముందు నటుడు శశి కుమార్ కథనాయకుడిగా నటించిన సుందర పాండియన్ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన ఎస్సార్ ప్రభాకరన్ ఆ తర్వాత ఉదయనిధి స్టాలిన్ హీరోగా ఇదు కదిర్వేలన్ కాదల్, విక్రమ్ ప్రభుతో సత్యన్, శశి కుమార్‌తో కొంబు వచ్చ సింగండా వంటి సక్సెస్ ఫుల్ చిత్రాలను తెరకెక్కించారు. తాజాగా ఈయన పంకజం టాకీస్ ప్రొడక్షన్స్ అనే చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించి స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం ఇది. ఇప్పటి వరకు ప్రేమ, స్నేహం వంటి అంశాలతో కుటుంబ కథా చిత్రాలను రూపొందించిన ఈయన తొలిసారిగా క్రైమ్, థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండడం విశేషం. ఇందులో నటి తాన్య రవిచంద్రన్‌తో పాటు నటుడు జయప్రకాష్, ఆడుగలం నరేన్, బోస్ వెంకట్, జీవారవి, మీరా కృష్ణన్ తదితరులు ముఖ్యపాత్రలు పోస్తున్నారు. వీరితో పాటు స్వాతిస్, ప్రభ, మెర్లిన్, నితీషా అనే కొత్త తారలను పరిచయం చేస్తున్నారు. దీనికి గణేష్ సంతానం చాయాగ్రహణను, కిడా చిత్రం ఫ్రేమ్ దీశన్ సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా చిత్ర టైటిల్‌ను నటుడు శశి కుమార్ విడుదల చేయగా, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు, నటుడు సముద్రఖని, కార్తీక్ సుబ్బరాజ్, నటి మడోనా సెబాస్టియన్, సూరి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై, మురారి టిక్కడి, వాగమన్ తదితర ప్రాంతాల్లో పూర్తి చేసినట్లు దర్శకుడు తెలిపారు. విద్యార్థులు తప్పకుండా చూడాల్సిన చిత్రం అన్నారు. తన నిర్మాణ సంస్థ ద్వారా మంచి కథలతో వచ్చే నూతన దర్శకులకు అవకాశం కల్పిస్తానని ఎస్సార్ ప్రభాకరన్ తెలిపారు.

క్లుప్తంగా

హత్య కేసులో దంపతులకు యావజ్జీవం

అన్నానగర్: మహిళను హత్య కేసులో భార్యాభర్తలకు మదురై కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. మదురైలోని అన్నానగర్‌కు చెందిన కచ్చమ్మాళ్‌కు ఇంటి సమీపంలో ఇరులాండి, మునియమ్మాళ్ దంపతులు ఉండేవారు. ఇరు కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. 2017 నవంబర్ 25వ తేదీ గొడవ జరిగింది. ఈ క్రమంలో దంపతులు ఇద్దరూ కచ్చమ్మాళ్‌పై ఆయుధాలతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై అన్నానగర్ పోలీసులు కేసు నమోదు చేసి భార్యాభర్తలను అదుపులోకి తీసుకున్నారు. మదురై జిల్లా ప్రత్యేక కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో ఇరులాండి, మునియమ్మాళ్‌లకు యావజ్జీవ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి రాధిక శనివారం తీర్పు చెప్పారు.

పాము కాటుతో బాలుడి మృతి

అన్నానగర్: పాము కాటుతో బాలుడు మృతి చెందాడు. వివరాలు.. దిండుక్కల్ జిల్లా పశ్చిమ అయకుడిలోని ఓబాలపట్టికి చెందిన ప్రభు (37) టైలర్. ఇతనికి భార్య ప్రియ, కుమారుడు లోకేశ్వరన్ (5) ఉన్నారు. ఉపాధి నిమిత్తం కిన్నత్తు కడవు సమీపంలోని దేవరాయపురంలో ఉంటున్నారు. జనవరి 28వ తేదీ రాత్రి లోకేశ్వరన్ ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. నొప్పితో కేకలు వేస్తూ తల్లి ప్రియకు విషయం చెప్పాడు. బాలుడిని హుటాహుటిన అంబులెన్స్‌లో పొల్లాచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు.

వ్యభిచార దందా.. వ్యక్తిపై గూండా చట్టం


అరెస్టయిన రమేష్

తిరువళ్లూరు: యువతులను వ్యభిచార కూపంలోకి దించుతున్న వ్యక్తిపై గూండా చట్టాన్ని ప్రయోగిస్తూ ఆవడి పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నై కొరట్టూరు ప్రాంతానికి చెందిన రమేష్ అలియాస్ కవియరసు(30) కొరట్టూరు, ఆవడి తదితర ప్రాంతాల్లో వ్యభిచార కూపాన్ని నిర్వహిస్తూ పలువురు యువతులను కూపంలో దించి పలుమార్లు అరెస్టయ్యాడు. ప్రవర్తన మార్చుకోవాలని పోలీసులు హెచ్చరించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం కొరట్టూరులో వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడి పుళల్ జైలులో ఉంటున్నాడు. ఇతడి ప్రవర్తన మారకపోవడంతో గూండా చట్టాన్ని ప్రయోగిస్తూ శనివారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రియుడి నిర్వాకం.. బాలిక ఆత్మహత్య

అన్నానగర్: ప్రేమించిన వ్యక్తి తన తల్లి వద్ద తీసుకున్న అప్పుపై ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన బాలిక శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. పుదువన్నార్‌పేట ఆవూరుకు చెందిన హేమలత (48) భర్త మృతిచెందడంతో ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది. ఆమె కుమార్తె సెంజన (17) ప్లస్‌టూ చదువుతోంది. బ్రాడ్‌వేలో కళ్లద్దాల దుకాణం నిర్వహిస్తున్న అశోక్‌తో సంజనకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. దుకాణం విస్తరించేందుకు అశోక్ సంజన తల్లి వద్ద రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇందులో రూ. 2 లక్షలు చెల్లించాడు. మిగిలిన రూ. లక్ష అడగగా మీ కూతురు కోసం ఖర్చు చేశానని చెప్పాడు. దీంతో హేమలత, సంజన మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన సంజన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మూడో అంతస్తు నుంచి పడి మేస్త్రి దుర్మరణం

అన్నానగర్: భవన నిర్మాణ పనులు జరుగుతున్న మూడో అంతస్తు నుంచి పడి మేస్త్రి మృతిచెందిన ఘటన మరైమలైనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. మైలాడుతురై మరుదూరుకు చెందిన మదియళగన్ చెన్నై పొత్తేరిలో మేస్త్రిగా ఉన్నాడు. ఎస్ఆర్ఎం కాలేజీలో భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. శనివారం 3వ అంతస్తులో నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యాడు. భవనం అంచున నిలబడి మెటీరియల్ లిఫ్ట్‌లో వచ్చిన ఇసుకను తీసుకునేందుకు ప్రయత్నించగా మదియళగన్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మరైమలైనగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిర్మాణ కాంట్రాక్టర్ గణేశన్‌ను విచారిస్తున్నారు.

వ్యవసాయ శాఖ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

తిరువొత్తియూరు: నామకల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీపంలో ఉన్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీస్‌లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో నామక్కల్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 15 కంప్యూటర్లు, రెండు ల్యాప్‌టాప్, కార్యాలయంలోని పలు రిజిస్టర్లు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు.

పన్నీరు తప్పుకో..!

- అన్నామలై అల్టిమేటం
- పళనికి బీజేపీ పరోక్ష మద్దతు


పన్నీరుసెల్వం, పళనిస్వామి, అన్నామలై

సాక్షి, చెన్నై: ఉప ఎన్నికల రేసులో నుంచి అభ్యర్థిని వెనక్కి తీసుకోవాలని అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సూచించారు. పరోక్షంగా తమ మద్దతును ఆ పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళనిస్వామి శిబిరానికి తెలియజేశారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దామంటూనే.. అన్నాడీఎంకే అంతర్గత వివాదాల్లో బీజేపీ జోక్యం చేసుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

నేపథ్యం ఇదీ..
ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో విడివిడిగా ఉన్న అన్నాడీఎంకే నేతలను ఏకం చేయడానికి బీజేపీ పెద్దన్న పాత్రను శుక్రవారం పోషించిన విషయం తెలిసిందే. పళని, పన్నీరు సెల్వంలో బీజేపీ నేతలు అన్నామలై, సీటీ రవి భేటీ అయ్యారు. మరోవైపు రెండాకుల గుర్తు వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు పళని శిబిరానికి పరోక్షంగా అనుకూలం అయ్యాయి. ఈ పరిస్థితుల్లో శనివారం అన్నామలై మరో మారు మీడియా ముందుకు వచ్చారు. అన్నాడీఎంకే అంతర్గత విభేదాల జోలికి బీజేపీ వెళ్ల దలచుకోలేదని, అయితే సమష్టిగా ఉంటే ఉప ఎన్నికల్లో గెలిచి డీఎంకే అనే దుష్టశక్తికి గుణపాఠం చెప్పవచ్చు అనే విషయాన్ని ఆ పార్టీ నేతలకు సూచించామని తెలిపారు. ఈ ఎన్నికల నుంచి పన్నీరు సెల్వం తన అభ్యర్థిని వెనక్కి తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. ఆయన మంచి నిర్ణయమే తీసుకుంటారనే నమ్మకంతో ఉన్నామని తెలిపారు. అదే సమయంలో పన్నీరు సెల్వం శిబిరానికి చెందిన బన్రూటి రామచంద్రన్ మీడియాతో మాట్లాడుతూ, వెనక్కి తగ్గే విషయంపై చర్చిస్తామంటూ వ్యాఖ్యానించారు. రెండాకుల గుర్తు విషయంగా సుప్రీంకోర్టు సూచనను పాటిస్తామని, ఆ చిహ్నం ఎవరికి దక్కుతుందో ఆ అభ్యర్థికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా అన్నామలైను కర్ణాటక ఎన్నికల బీజేపీ వ్యవహారాల కో– ఇన్‌చార్జ్‌గా నియమించిన నేపథ్యంలో ఆయన ఈ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారా..? లేదా..? అనే అంశంపై స్పష్టత రాలేదు.

మద్దతు కోసం..
సర్వసభ్య సమావేశం సభ్యులు మెజారిటీ మద్దతు ఆధారంగా రెండాకుల చిహ్నం కోసం ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు అని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో పళని స్వామి శిబిరం దూకుడు పెంచింది. అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్‌కు అధికారాలు కట్టబెడుతూ శనివారం జరిగిన పార్టీముఖ్య నిర్వహకుల సమావేశంలో తీర్మానం చేశారు. ఈ మేరకు సర్వ సభ్య సభ్యులకు అఫిడవిట్ ఫాం పంపించి, ఆదివారం సాయంత్రంలోపు మద్దతు సేకరణకు నిర్ణయించారు. ఇప్పటికే పళని స్వామి శిబిరానికి 2 వేల మందికి పైగా సర్వసభ్య సభ్యుల మద్దతు ఉన్న దృష్ట్యా, ఆ శిబిరం అభ్యర్థి తెన్నరసు ఎన్నికల రేసులో ఉండే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. తమిళ్ మగన్ హుస్సేన్ పంపిస్తున్న దరఖాస్తులో తెన్నరసుకు మద్దతు ఇవ్వాలని పేర్కొని ఉండడం గమనార్హం.

ఆంధ్రా విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న మేదరమెట్ల చరణ్(ఫైల్)

తిరువళ్లూరు: అరణ్‌వాయల్‌కుప్పం సమీపంలోని ప్రత్యూష ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థి చరణ్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని గౌరవరం ప్రాంతానికి చెందిన పిచ్చిరెడ్డి కుమారుడు చరణ్. ఇతను ప్రత్యూష తెలుగు మైనారిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫస్టియర్ కంప్యూటర్ సైన్స్ చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి క్యాంటీన్‌లో భోజనం ముగించుకుని రూమ్‌కి వెళ్లి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చరణ్ ఆత్మహత్య విషయాన్ని శనివారం గుర్తించిన సహచర విద్యార్థులు, కళాశాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ ముత్తువేల్‌పాండి, తిరువళ్లూరు తాహసీల్దార్ మదియళగన్ సెవ్వాపేట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌ను ప్రశ్నించారు. ప్రాథమిక విచారణలో ఇంజినీరింగ్ కష్టంగా మారిందని, సరిగ్గా చదవకపోవడంతో మానసిక ఒత్తిడికి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. తొలుత ఈసీఈ విభాగంలో చేరిన చరణ్, డిసెంబర్ 20న కంప్యూటర్ సైన్సుకు మారాడు. అయితే కంప్యూటర్ సైన్సు నచ్చక మళ్లీ ఈసీఈ మారడానికి యత్నించినట్లు పోలీసులు నిర్ధారించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 10 కిలోల గంజాయి స్వాధీనం


అరెస్టయిన లోకేష్


చక్రియ

తిరువళ్లూరు: గంజాయి తరలిస్తున్న యువకుడిని సెంగుండ్రం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూరు జిల్లా సెంగుండ్రం ఇన్‌స్పెక్టర్ మునస్వామి గస్తీలో ఉండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగుతున్నాడు. అతన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. బ్యాగులో గంజాయి లభ్యమైంది. నిందితుడు శ్రీపెరంబదూరు సమీపంలోని కట్రాంబాక్కం గ్రామానికి చెందిన వెంకటేషన్ కుమారుడు లోకేష్(22)గా గుర్తించారు. ఇతడు క్రిష్ణగిరి నుంచి గంజాయిని తీసుకొచ్చి సెంగుండ్రంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. అతడి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఇదే విధంగా పూందమల్లి బస్టాండ్‌లో గంజాయి విక్రయించడానికి యత్నించిన తిరునల్వేలికి చెందిన చక్రియ(50)ని అదుపులోకి తీసుకున్నారు. ఇతను కేరళ నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కక్కన్ మనవరాలు గీత గుండెపోటుతో మృతి

తిరువొత్తియూరు: కామరాజర్ హయాంలో విశేష గుర్తింపు పొందిన మాజీ హోంశాఖ మంత్రి కక్కన్ మనవరాలు గీత గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈమె రిజిస్ట్రేషన్ శాఖలో ఏఐజీగా సేలంలో పని చేస్తున్నారు. కరోనా సమయంలో భర్త, అత్త మృతి చెందారు. ఇటీవల ఆమె తండ్రిని కూడా కోల్పోయారు. ఈ క్రమంలో చెన్నై నుంచి సేలంకు బదిలీ అయ్యారు. సెలవు పెట్టి సొంత ఊరైన మధురైకి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గీతకు అక్కడే గుండెపోటు వచ్చి మృతి చెందారు. ఆమె మృత దేహానికి చెన్నై పడప్పై ఒరగడం వద్ద శనివారం పలువురు నాయకులు, ప్రజలు అంత్యక్రియలు నిర్వహించారు.

పశువైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో పశువులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

తిరుత్తణి: కొడివలస పంచాయతీలో శనివారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 100 పైగా మూగజీవులకు వైద్య చికిత్సలందించారు. తిరుత్తణి సబ్ డివిజన్ పశుసంవర్ధఖ శాఖ సహాయ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, డాక్టర్ ఆముద, ఇన్‌స్పెక్టర్ స్టాలిన్, శరవనన్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి ఇద్దరు భక్తుల మృతి

అన్నానగర్: పళనికి పాదయాత్ర వెళ్లిన ఇద్దరు భక్తులు శనివారం సుల్తాన్‌పేట సమీపంలోని బీఏపీ కాలువలో మునిగి మృతి చెందారు. కోయంబత్తూరు సుల్తాన్‌పేట సమీపంలోని పెరియాక్విలికి చెందిన 110 మంది భక్తులు ఈ నెల 1వ తేదీ పళని మురుగన్ ఆలయానికి పాదయాత్ర ప్రారంభించారు. శుక్రవారం సుల్తాన్‌పేట బచ్చగౌండం పాళయం వద్ద బీఏపీ కాలువలో స్నానానికి దిగారు. సెంథిల్ కుమార్ కుమారుడు గోపీనాథ్ (17) కాలువ మెట్లపై స్నానం చేస్తున్నాడు. ఒక్కసారిగా కాలుజారి నీటిలో పడిపోయాడు. ఇది చూసిన మహాలింగం(38) దూకి కాపాడే ప్రయత్నం చేశాడు. నీటి మట్టం ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ కొట్టుకుపోయారు. ఇది చూసిన తోటి యాత్రికులు సుల్తాన్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. సూలూరు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. గోపినాథ్, మహాలింగం మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసే హంతకుడు

అన్నానగర్: అప్పు చెల్లించాలని కోరడంతో వృద్ధురాలిని హత్య చేసి నగలను లూటీ చేసిన కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సుంగువార్ సత్రం పోలీసుల కథనం మేరకు.. శ్రీపెరంబత్తూరు సమీపంలోని సుంగ్వార్ మేలేరికి చెందిన యశోద అమ్మాళ్ (75)కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె భర్త ఆర్.బలరాముడు కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. యశోద అమ్మాళ్‌కు చెందిన 2 ఎకరాల భూమితో వచ్చే ఆదాయంతో ఒంటరిగా జీవిస్తోంది. వచ్చే నగదును పలువురికి వడ్డీకి ఇచ్చేది. చెన్నై సాయుధ దళంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సతీష్ (25) యశోద అమ్మాళ్ వద్ద రూ.2 లక్షలు తీసుకున్నాడు. వడ్డీ, అసలు చెల్లించకుండా జాప్యం చేశాడు. నగదు చెల్లించకుంటే తల్లిదండ్రులకు చెబుతానని యశోద అమ్మాళ్ చెప్పడంతో ఆగ్రహానికి గురయ్యాడు. జనవరి 28వ తేదీ ఆమెను ఇంటి వెనుకకు తీసుకెళ్లి తలపై గన్‌తో కాల్చి హతమార్చాడు. మరుసటి రోజు ఆమె ఇంటికి వెళ్లి 25 సవర్ల నగలు తీసుకుని వెళ్లిపోయాడు. పోలీసులు శనివారం సతీష్‌ను అరెస్టు చేశారు. నగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అతడు పలువురి వద్ద నగదు తీసుకుని మోసం చేసినట్లు తెలిసింది.

అరుణాచలేశ్వరునికి ఘనంగా తీర్థవారి


స్వామి వారికి తీర్థవారి నిర్వహిస్తున్న శివాచార్యులు

తిరువణ్ణామలై(వేలూరు): తమిళ తైపూస ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మురుగన్ ఆలయాల్లోని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధన పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని అన్నామలైయార్‌ను శనివారం ఉదయం మేళతాళాల నడుమ శివాచార్యులు ఊరేగింపుగా ఈశాన్య పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం స్వామి వారికి తీర్థవారి నిర్వహించి దీపారాధన చేశారు. ఈ ఆదివారం తైపూస పౌర్ణమి కావడంతో స్వామి వారి ప్రత్యేక పుష్పాలంకరణల మధ్య భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. కోనేటిలో స్వామి వారికి తీర్థవారి నిర్వహించే సమయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వడలూరులో తైపూస ఉత్సవాలు ప్రారంభం
తిరువొత్తియూరు: వడలూరు దివ్యజ్యోతి వల్లలార్ ఆధ్యాత్మిక నిలయంలో తైపూస ఉత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆదివారం తెరలను తొలగించి జ్యోతి దర్శనం కలిపించనున్నారు. వివరాలు.. కడలూరు జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి పొందిన వడలూరు శ్రీ ప్రకాశం వల్లల్ ఆధ్యాత్మిక నిలయంలో ఏటా వేట జ్యోతి దర్శనం ఉత్సవాలు విశేషంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో శనివారం ఉదయం జ్యోతి పారాయణం, ధ్వజారోహణం చేపట్టారు.

ప్రత్యేక రైళ్లు, బస్సులు నడుస్తాయి
సత్యజ్ఞాన సభలో తైపూస జ్యోతి దర్శన ఉత్సవాలను పురస్కరించుకుని రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అలాగే కడలూరు, విరుదాచలం, నైవేలి, బండ్రుట్టి, చిదంబరం, విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరుకోవిలూరు, సేలం, తిరువన్నామలై, కుంభకోణం, వేలూరు, చెన్నై, పుదుచ్చేరి తదితర ప్రాంతాల నుంచి భక్తులకు అదనపు బస్సులు నడుపుతున్నారు.

పళనిలో రథోత్సవం..
తైపూస ఉత్సవాలను పురస్కరించుకొని పళని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దుండుగల్ జిల్లా పళని దండాయుధపాణి స్వామి ఆలయంలో గత జనవరి 29వ తేదీ ధ్వజారోహనంతో తైపూస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో వల్లి, దేవయాని సమేత సుబ్రహ్మణ్య స్వామి నెమలి, అశ్వం, సింహం, చంద్ర ప్రభ, సూర్యప్రభ వాహనాలు, పల్లకి సేవ, భూత వాహనంలో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. శుక్రవారం రోజు ఒకే రోజున సుమారు 5 లక్షల మంది భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. తైపూస ఉత్సవాలను పురస్కరించుకుని తిరుచ్చి జిల్లా వయ్యంపట్టి నుంచి వచ్చిన భక్తులు శనివారం పూల కావళ్లతో నృత్యాలు చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

పట్టపగలే యువతి దారుణ హత్య


హత్యకు గురైన వర్ష

అన్నానగర్: మధురైలో పట్టపగలు నడురోడ్డుపై యువతి హత్యకు గురైంది. ప్రేమ వివాహం చేసుకున్న భర్తే హెల్మెట్ ధరించి ఈ హత్యకు పాల్పడినట్లు తేలింది. నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు. వివరాలు.. మధురైలోని సౌత్‌గేట్ సప్పాని కోవిల్ వీధికి చెందిన మీనాక్షి సుందరం చిన్న కుమార్తె వర్ష (19) కీరైత్తురైకు చెందిన పళని(25)ని ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. కొద్ది రోజులుగా ఇద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. నెలన్నర క్రితం వర్ష పుట్టింటికి వచ్చింది. పళని రావాలని కోరినా నిరాకరించింది. శుక్రవారం మధ్యాహ్నం వర్ష సప్పాని కోవిల్ వీధిలో ఓ దుకాణానికి వెళ్లి ఇంటికి వెళుతోంది. హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చిన పళని ఆమెతో మాట్లాడేందుకు యత్నించాడు. ఆమె వినకపోవడంతో వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. అనంతరం బైక్‌పై పరారయ్యాడు. వర్షను చికిత్స నిమిత్తం మధురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సౌత్ గేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా పళనిగా గుర్తించారు. ఈ క్రమంలో పళని కీరైత్తురై పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు.

నకిలీ గుర్తింపు కార్డులతో మోసం

తిరువొత్తియూరు: సహకార సంఘం సభ్యుల పేర్ల మీద నకిలీ గుర్తింపు కార్డులతో రూ.2.11 కోట్లు మోసం చేసిన ఎన్‌జీఆర్ సహకార సంఘం కార్యదర్శిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కోవై సింగానల్లూరు వరదరాజపురంలో ఎన్‌జీఆర్ కార్మిక సహకార సంఘం ఉంది. సంఘం అధ్యక్షుడిగా రాజేంద్ర, కార్యదర్శిగా కోదండరామన్ ఉన్నారు. వీరిద్దరూ 2015–20కు సంబంధించి సంఘం సభ్యుల పేర్లతో నకిలీ గుర్తింపు కార్డులను సృష్టించి వారి పేర్లతో రూ. 2.11 కోట్లు అప్పు తీసుకుని మోసం చేసినట్లు తెలిసింది. అధికారులు లెక్కలు సరిచూసిన క్రమంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై సహకార సంఘం డిప్యూటీ సబ్ రిజిస్టర్ అర్ధనారీశ్వరన్ వాణిజ్య క్రైమ్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి కార్యదర్శి కోదండరామన్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. అధ్యక్షుడు రాజేంద్రన్ కొద్ది నెలల క్రితమే మృతి చెందినట్లు తెలిసింది.

వ్యాపారి ఇంట్లో చోరీ


చిందరవందరగా పడి వున్న వస్తువులు

తిరువళ్లూరు: ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉంచిన 40 సవర్ల బంగారు నగలను ఎత్తుకెళ్లిన సంఘటన తిరువళ్లూరు పట్టణంలో చోటుచేసుకుంది. వీఎంనగర్‌కు చెందిన కార్తికేయన్ సెకండ్ హ్యాండ్ వాహనాల వ్యాపారం చేస్తున్నాడు. భార్య సుమతి(38), కుమార్తె షర్మిల ఉన్నారు. కార్తికేయన్ తల్లి 15 రోజుల క్రితం మృతి చెందారు. ఆమెకు గురువారం కర్మక్రియలు ఉండడంతో కుటుంబంతో సహా మనవాలనగర్‌కు వెళ్లి శనివారం ఉదయం ఇంటికి వచ్చారు. అయితే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో షాక్‌కు గురయ్యారు. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 40 సవర్ల బంగారు నగలు మాయమైనట్లు గుర్తించి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుత్తణిలో లోక్ అదాలత్


లోక్ అదాలత్‌లో అధికారులు

తిరుత్తణి: తిరుత్తణి న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో వందకు పైగా ప్రమాదాలకు సంబంధించిన కేసులను పరిష్కరించారు. న్యూ ఇండియా అస్యూరెన్స్ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. చెన్నై డివిజన్ మేనేజర్ చంద్రశేఖర్ అస్యూరెన్స్ పథకం న్యాయవాది కిషోర్‌రెడ్డి, లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

157 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

– ఉత్తరాది యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: కోవైలో రూ.10.82 లక్షల విలువైన 157 కిలోల గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. డీఎస్పీ వెత్రి సెల్వన్ నేతృత్వంలో పెరియనాయకన్ పాళయం ఎక్సైజ్ విభాగం పోలీసులు శుక్రవారం తనిఖీలు చేశారు. స్కూటర్‌పై బస్తాలతో అనుమనాస్పదంగా వస్తున్న వ్యక్తిని విచారణ చేశారు. అతను బీహార్ రాష్ట్రం అసలమానగర్‌కు చెందిన దిలీప్ కుమార్ (38) అని తెలిసింది. తెక్కలూరు మెయిన్ రోడ్‌లో 22 ఏళ్లగా నివాసం ఉంటున్నట్లు తెలిసింది. అతను తీసుకొచ్చిన బస్తాలను విప్పి చూడగా గంజాయి చాక్లెట్లు ఉన్నాయి. అతని ప్రొవిజన్ దుకాణంలో తనిఖీ చేసి రూ. 10.82 లక్షల విలువ గల 157 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దిలీప్ కుమార్‌ను అరెస్టు చేశారు.

రామకృష్ణ తీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల: మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం రామకృష్ణ తీర్థ ముక్కోటికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం తిరుమల అన్నమయ్య భవనంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేట్ వాహనాలు, టాక్సీలను గోగర్భం డ్యాం వద్ద నుంచే అనుమతించరు. భక్తులకు సౌకర్యవంతంగా 5 నిమిషాలకు ఒక బస్సు చొప్పున 30 ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. చలువ బండ పాయింట్ నుంచి రామకృష్ణ తీర్థం వరకు ప్రతి 15 మీటర్లకు విజిలెన్స్, పోలీస్, ఫారెస్ట్ సిబ్బందిని నియమించారు. పాపవినాశనం, చలువబండ, రామకృష్ణ తీర్థ ముక్కోటి వద్ద మూడు వైద్య బందాల ఏర్పాటు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పాప వినాశనం నుంచి రామకృష్ణ తీర్థ ప్రవేశం మార్గం మూసివేస్తారు. ఎస్ఈ–2 శ్రీ జగదీశ్వర్‌రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, డీఈవోలు హరీంద్రనాథ్, సెల్వం, ఆరోగ్య విభాగం అధికారిని డాక్టర్ శ్రీదేవి, అదనపు ఎస్పీ మునిరామయ్య, వీజీవో బాలిరెడ్డి పాల్గొన్నారు.

కత్తులతో బైక్‌పై వీరంగం

– ముగ్గురు రౌడీషీటర్ల అరెస్టు

తిరువొత్తియూరు: కత్తులతో బైక్‌పై హల్‌చల్ చేస్తున్న ముగ్గురు రౌడీషీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై టీపీ సత్రం న్యూఆవిడి రోడ్డులో శుక్రవారం రాత్రి ఒకే బైక్‌పై ముగ్గురు వ్యక్తులు కత్తులతో తిరుగుతూ వీరంగం సృష్టిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. టీపీ సత్రం ఇన్‌స్పెక్టర్ శక్తి వేలాయుధం కానిస్టేబుళ్లతో కలిసి అక్కడికి వెళ్లారు. వారిని చూసిన రౌడీలు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెన్నై కొరటూర్‌కు చెందిన గణేషన్ (26), సెక్రటరియేట్ కాలనీకి చెందిన ముఖేష్ కుమార్ (20), రేట్టేరికి చెందిన అజిత్ కుమార్ (30)గా గుర్తించారు. విచారణలో ఓ రౌడీని హత్య చేయడానికి వెళుతున్నట్లు తెలిసింది.

విమానాశ్రయంలో బంగారం స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో శనివారం రూ.31.6 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి ఎయిర్ ఏషియా విమానం తిరుచ్చికి వచ్చింది. ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఓ మగ ప్రయాణికుడిపై అనుమానం రావడంతో అతడిని సోదాలు చేశారు. సెల్‌ఫోన్‌లో ప్లేట్ రూపంలో బంగారాన్ని దాచి, చైన్ రూపంలోను తీసుకొచ్చినట్లు గుర్తించారు. అక్రమంగా తరలిస్తున్న 67 సవర్ల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.31.62 లక్షలు ఉంటుంది. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

శ్రీలంక నుంచి ధనుష్కోటికి శరణార్థులు

తిరువొత్తియూరు: శ్రీలంక పుంగుడుతీవు నుంచి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు శుక్రవారం రాత్రి ధనుష్కోటికి శరణార్థులుగా వచ్చారు. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం కారణంగా ప్రజలు సాధారణ జీవనం దుర్లభమైంది. ఈ క్రమంలో శ్రీలంక తమిళలు తరచూ తమిళనాడు రాష్ట్రానికి శరణార్థులుగా చేరుకుంటున్నారు. శ్రీలంక యాల్పానం జిల్లా పుంగుడుతీవుకు చెందిన జయ పరమేశ్వరన్ (44), భార్య మాలినిదేవి (42), కుమార్తె తమిళని (12), కుమారుడు మాధవన్ శుక్రవారం రాత్రి శ్రీలంక తలైమన్నార్ నుంచి పడవలో బయలుదేరి రాత్రి ధనుష్కోటి సముద్రతీరానికి చేరుకున్నారు. రామేశ్వరం సముద్ర తీరం పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. వారిని మండపం శ్రీలంక శరణార్థుల శిబిరానికి పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నారాయణ ఇంజినీరింగ్ కాలేజిలో విద్యార్థి ఆత్మహత్య

- షాక్‌కు గురై గుండెపోటుతో వార్డెన్ మృతి
- హాస్టల్ గదిలో ఉరేసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థి
- యాజమాన్యం ఒత్తిడే కారణం!
- విద్యార్థి బ్యాగులో కత్తి.. స్వాధీనం చేసుకున్న పోలీసులు


ధరణేశ్వరరెడ్డి (ఫైల్)

గూడూరు రూరల్ (తిరుపతి జిల్లా): గూడూరు సమీపంలో ఉన్న నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఒకే రోజు రెండు మరణాలు చోటుచేసుకున్నాయి. ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థి హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకోగా, ఆ విషయం తెలియడంతో షాక్‌కు గురైన వార్డెన్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటనలతో కళాశాల విద్యార్థులు, సిబ్బంది హతాశులయ్యారు.

పోలీసుల కథనం ప్రకారం.. వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన ధరణేశ్వరరెడ్డి (21) నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం కళాశాలకు వెళ్ళి వచ్చిన విద్యార్థి గదిలో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి ఈ విషయాన్ని సహచర విద్యార్థులు గుర్తించి వార్డెన్ శ్రీనివాసులు నాయుడు (57)కు చెప్పారు. దీంతో వార్డెన్ షాక్‌కు గురయ్యారు. గుండెపోటుతో అక్కడే కుప్పకూలిపోయారు. ఆయన్ని హాస్టల్ సిబ్బంది ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. విద్యార్థి ఆత్మహత్య సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించిన అనంతరం విద్యార్థి మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థిపై ఒత్తిడి?

విద్యార్థిని కళాశాల యాజమాన్యం ఒత్తిడికి గురిచేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. మూడు రోజులుగా కళాశాలలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) ఇన్‌స్పెక్షన్ జరుగుతోందని, ఈ కారణంగా విద్యార్థులను రికార్డుల కోసం, ఇతరత్రా తీవ్రంగా ఒత్తిడికి గురి చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. గతంలో కూడా ఈ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు యాజమాన్యం ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు అతని కుటుంబంలో కలహాలే కారణమని కళాశాల యాజమాన్యం చెబుతోంది. ఇదిలా ఉంటే విద్యార్థి బ్యాగులో ఓ కత్తి ఉండడాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఏపీలో విద్యా సంస్కరణలు భేష్

- పాఠశాలలను సందర్శించిన వివిధ రాష్ట్రాల ప్రతినిధుల బృందం
- పథకాలు, కార్యక్రమాలు, బోధన విధానంపై సంతృప్తి
- తమ రాష్ట్రాల్లో కూడా అమలుకు స్ఫూర్తిదాయకమని ప్రశంసలు



సాక్షి, అమరావతి: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంస్కరణలు ఎంతో స్ఫూర్తిదాయకమని, తమ రాష్ట్రాల్లో అమలుకు అవి మార్గదర్శకంగా ఉన్నాయని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ప్రశంసించారు. విద్యారంగ అభివృద్ధి కోసం పనిచేస్తున్న అనేక ప్రఖ్యాత సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఐఏఎస్ అధికారులు, విద్యావేత్తలు, నిపుణులు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శనివారం సందర్శించారు. అనంతరం విద్యా శాఖ ఉన్నతాధికారులతో సంభాషించారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ రాష్ట్రంలో అమలవుతున్న విద్యా పథకాల గురించి ఈ బృందానికి వివరించారు. సీఎం వైఎస్ జగన్.. విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ.. జగనన్న అమ్మఒడి, మన బడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, సీబీఎస్ఈ సిలబస్, ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ తదితర కార్యక్రమాల ద్వారా విద్యా రంగాన్ని పటిష్టం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు మాట్లాడుతూ.. తాము సందర్శించిన పాఠశాలలు సంతృప్తికరంగా ఉన్నాయని ప్రశంసించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, సంతోషకరమైన అభ్యాస వాతావరణం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ గవర్నెన్స్, ఉపాధ్యాయుల సృజనాత్మకత, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, టీచర్ మెంటార్‌లు వినియోగిస్తున్న 'టీచ్ టూల్', బోధన అభ్యాస పద్ధతులు, కొత్త యాప్‌లు.. తదితర కార్యక్రమాలన్నీ బాగున్నాయని మెచ్చుకున్నారు. ఇవన్నీ తమ రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి స్ఫూర్తిగా ఉన్నాయని చెప్పారు.

విద్యా రంగ ప్రముఖుల బృందం ఇదీ..

కృష్ణా జిల్లా కోలవెన్ను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పునాదిపాడు, ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎన్టీఆర్ జిల్లాలోని పటమట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను విద్యా రంగ ప్రముఖుల బృందం సందర్శించింది. ఈ బృందంలో రతీ ఫోర్బ్స్ (డైరెక్టర్ ఫోర్బ్స్ మార్షల్ లిమిటెడ్), వివేక్ రాఘవన్ (ట్రస్టీ, ఆర్ఘీ మనుధనే ఫౌండేషన్ సీఈఓ ప్రెసిడెంట్, ఎయిర్‌వైన్ సైంటిఫిక్), నీలేష్ నిమ్కర్ (ఫౌండర్ ట్రస్టీ, క్వెస్ట్), కవితా ఆనంద్ (విద్యాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు), మురుగన్ వాసుదేవన్ (సీఈఓ, లెట్స్ డ్రీమ్ ఫౌండేషన్, మాజీ హెడ్, సోషల్ ఇన్నోవేషన్, సిస్కో ఇండియా దక్షిణాసియా), మినాల్ కరణ్వాల్ (సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్, ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, నందుర్‌బార్, మహారాష్ట్ర), ఆకాంక్ష గులాటి (డైరెక్టర్, యాక్ట్ గ్రాంట్స్), ప్రాచీ విన్లాస్ (మైఖేల్ సుసాన్ డెల్ ఫౌండేషన్, డైరెక్టర్, ఇండియా), తరుణ్ చెరుకూరి (సీఈఓ, ఇండస్ యాక్షన్), స్నేహ మీనన్(క్యాటలిటిక్ ఫిలాంత్రోపీ, దస్రా) తదితరులు ఉన్నారు.

బడి నుంచి మృత్యు ఒడికి...

- స్కూల్ ఆటో బోల్తా... ఇద్దరు విద్యార్థినుల మృతి
- నంద్యాల జిల్లా నేరేడుచెర్లలో దుర్ఘటన


రజని(ఫైల్)


షాహిదాబి(ఫైల్)

ప్యాపిలి(నంద్యాల): మరో ఐదు నిమిషాల్లో బడి నుంచి తమ ఇళ్లకు చేరుకోవాల్సిన ఇద్దరు పిల్లలు... డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆటో బోల్తా కొట్టడంతో మృత్యుఒడికి చేరుకున్నారు. అప్పటి వరకు తమతో సరదాగా గడిపిన స్నేహితులు ఒక్కసారిగా రక్తపు మడుగులో అచేతనంగా పడి ఉండటం సహచర విద్యార్థులను కలచివేసింది. ఈ హృదయవిదారక ఘటన నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నేరేడుచెర్ల వద్ద శనివారం జరిగింది. రాచర్ల ఉన్నత పాఠశాలలో నేరేడుచెర్ల గ్రామానికి చెందిన శివమ్మ, రంగన్న దంపతుల కుమార్తె రజని(15) పదో తరగతి, ఐరా, మదార్ దంపతుల కుమార్తె షాహిదాబి(13) ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరితోపాటు అదే గ్రామానికి చెందిన మరో 18 మంది విద్యార్థులు కూడా రాచర్ల ఉన్నత పాఠశాలలోనే విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా ప్రతి రోజు ఉదయం ఆర్టీసీ బస్సులో పాఠశాలకు వెళ్తారు. సాయంత్రం ఆటోలో ఇంటికి చేరుకుంటారు. యథావిధిగా శనివారం సాయంత్రం నాలుగు గంటలకు పాఠశాల ముగిసిన తర్వాత ఆటోలో నేరేడుచెర్లకు బయలుదేరారు. అతి వేగంగా వెళుతున్న ఆటో గ్రామ శివారులో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆటో డోర్ వైపు కూర్చున్న రజని, షాహిదాబి ఎగిరి రోడ్డుపై పడగా, వారి మీద ఆటో పడటంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించారు. మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. పిల్లల రోదనలతో ఘటనాస్థలం దద్దరిల్లింది. రాచర్ల పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సొంత ఆటోలో వస్తూనే..

ప్రమాదంలో మృతిచెందిన షాహిదాబి తండ్రి మదార్‌కు టాటా మ్యాజిక్ ఆటో ఉంది. ప్రతి రోజు సాయంత్రం మదార్ రాచర్ల ఉన్నత పాఠశాలకు వెళ్లి తన కుమార్తెతోపాటు మిగిలిన విద్యార్థినులను ఆటోలో ఎక్కించుకుని నేరేడుచెర్లకు తీసుకువచ్చేవాడు. అయితే, మదార్‌కు శనివారం వ్యక్తిగత పని ఉండటంతో వెళ్లలేదు. తమ గ్రామానికే చెందిన శివ అనే డ్రైవర్‌ను పంపాడు. అతను వేగంగా నడపడం వల్లే ఆటో బోల్తా పడి షాహిదాబి, రజని మృతిచెందారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు.

పురాతన ఆలయాలకు పూర్వ వైభవం

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

డోన్(నంద్యాల): రాష్ట్రంలో అత్యంత పురాతన దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. డోన్ మండలంలోని స్తోత్రం గుండాల గ్రామంలో ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన లక్ష్మీ చెన్న కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.5కోట్లతో నిర్మించనున్న టీటీడీ కళ్యాణ మండపం, ఉడుములపాడు గ్రామ సమీపంలోని వేణుగోపాలస్వామి మాన్యం భూమిలో రూ.3.5కోట్లతో చేపట్టిన కళ్యాణ మండపం పనులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌తో కలిసి ఆయన శనివారం భూమిపూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలు, దళితులు, గిరిజనులు నివసించే ప్రాంతాల్లో సుమారు 2వేల దేవాలయాలను నిర్మించినట్లు తెలిపారు. మరో 800 ఆలయాల పునరుద్ధరణ పనులకు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే అత్యంత ఆధునిక టీటీడీ కళ్యాణ మండపాలను పులివెందుల, డోన్ మండలం గుండాల గ్రామంలో రూ.5కోట్లు చొప్పున ఖర్చు చేసి నిర్మిస్తున్నామన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై న్యాయవాదులు నిత్యం అధ్యయనం చేయాలి

- కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- సీనియర్లు జూనియర్లకు సూచనలు, సలహాలు ఇవ్వాలి
- న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య సమన్వయంతోనే నాణ్యమైన తీర్పులు
- సదస్సులో హైకోర్టు న్యాయమూర్తులు


సదస్సును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

నరసాపురం: చట్టాలపై న్యాయవాదులు నిత్యం అధ్యయనం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ సూచించారు. కొత్త చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలన్నారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వైఎన్ కళాశాలలో నరసాపురం, పాలకొల్లు బార్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. దీనికి ఏపీ బార్ కౌన్సిల్ సహకారం అందించింది. ఈ సదస్సుకు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య మంచి వాతావరణం ఉండాలన్నారు. ప్రతి వ్యక్తి బీఆర్ అంబేద్కర్‌లా చదువుకోవాలన్నారు. గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించాలని చెప్పారు. ఈ అంశంపై న్యాయవాదులు ప్రత్యేక దృష్టి పెట్టి ఆదర్శంగా నిలవాలని సూచించారు. న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మాట్లాడుతూ కోర్టు వ్యవహారాలు.. విలువలు, క్రమశిక్షణతో సాగాలంటే సీనియర్ న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. సీనియర్లు జూనియర్లకు మంచి సూచనలు, సలహాలు ఇచ్చి ముందుకు నడిపించాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు వృత్తి విలువలు పాటిస్తూ కోర్టుల గౌరవాన్ని కాపాడాలన్నారు. కాగా పలు చట్టాలు, కోర్టు వ్యవహారాల్లో పాటించాల్సిన పద్ధతులపై న్యాయమూర్తులు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, కౌన్సిల్ సభ్యులు కలిగినీడి చిదంబరం, బీవీ కృష్ణారెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి కూడా మాట్లాడారు. న్యాయమూర్తులను నరసాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి పురుషోత్తం కుమార్, నరసాపురం కోర్టు జడ్జిలు పి.విజయదుర్గ, వై.శ్రీనివాసరావు, వి.గౌరీశంకరరావు, కె.శ్రీనివాస్, ఉషారాణి, జిల్లా ఎస్పీ రవిప్రకాష్, నరసాపురం, పాలకొల్లు బార్ అసోసియేషన్‌ల అధ్యక్షులు కామన బుజ్జి, జీవీ సుబ్బారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా కూలీలను కబళించిన లారీ

- లారీ ఢీకొని నలుగురు మహిళా కూలీల దుర్మరణం
- శ్రీకాకుళం జిల్లా మందాదిలో విషాదం


సత్తెమ్మ (ఫైల్)


పాపమ్మ (ఫైల్)


లక్ష్మి (ఫైల్)


గౌరమ్మ (ఫైల్)

ఆమదాలవలస: ఉపాధి హామీ పథకం కింద పనికి వెళుతున్న మహిళా కూలీలపైకి ఓ లారీ మృత్యువు రూపంలో దూసుకువచ్చింది. తమ ఇళ్ల నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే నలుగురిని కబళించింది. ఈ విషాద ఘటన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ మందాది గ్రామం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగింది. మందాదికి చెందిన సుమారు 200 మంది ఉపాధి కూలీలు తమ గ్రామ శివారులోని చెరువు వద్ద పని చేస్తున్నారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం రెండో పూట పని చేసేందుకు 3 గంటల సమయంలో కూలీలు అందరూ శ్రీకాకుళం నుంచి పాలకొండ వెళ్లే సీఎస్పీ రహదారి మీదుగా గ్రూపులుగా నడుచుకుంటూ వెళుతున్నారు. అదే సమయంలో విజయనగరం నుంచి ఒడిశా కాశీనగర్ వైపు వేగంగా వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి నలుగురు కూలీలపై నుంచి దూసుకువెళ్లింది. దీంతో మురువందల పాపమ్మ (52), అంబటి సత్తెమ్మ (55), కురమాన లక్ష్మి(48) అక్కడికక్కడే మృతిచెందారు. అమలాపురపు గౌరమ్మ(55)కు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స చేస్తుండగా, ఆమె కూడా మరణించింది. ఒకే గ్రామానికి చెందిన నలుగురు మహిళలు మృతిచెందడంతో పెను విషాదం నెలకొంది. శ్రీకాకుళం డీఎస్పీ మహేంద్ర, సీఐ ఆదాం, ఎస్ఐ వై.కృష్ణ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మున్సిపాలిటీల్లో తల'సిరి' తక్కువే

దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

- జాతీయ సగటు రూ.4,624లు కన్నా వీటి ఆదాయం తక్కువ
- పట్టణ జనాభా పెరుగుతున్నా జీడీపీలో మున్సిపాలిటీల వ్యయం 0.44 శాతం నుంచి 0.37 శాతానికి తగ్గుదల
- జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు సంస్కరణలు అవసరం
- పట్టణ స్థానిక సంస్థలు సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలి
- 223 క్రెడిట్ రేటింగ్‌లు ఇస్తే 95 మున్సిపాలిటీలకే పెట్టుబడి రేటింగ్
- ఇందులో 41 మున్సిపాలిటీలు బాండ్ల ద్వారా రూ.5,459 కోట్ల నిధులు సమీకరణ
- నీతి ఆయోగ్ అధ్యయన నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి : దేశంలో 15 రాష్ట్రాల్లోని మున్సిపాలిటీల మొత్తం ఆదాయంలో తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉందని నీతి ఆయోగ్ అధ్యయన నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా మొత్తం మున్సిపాలిటీల జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.4,624 కాగా.. 15 రాష్ట్రాల్లో ఈ సగటు ఇంకా తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. పట్టణ జనాభా పెరుగుతున్నప్పటికీ జీడీపీలో మున్సిపాలిటీల వ్యయం 0.44 శాతం నుంచి 0.37 శాతానికి తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితులు, అకౌంటింగ్ విధానంపైనా నీతి ఆయోగ్ నివేదికను విడుదల చేసింది. ఇందులో దేశవ్యాప్తంగా మున్సిపాలిటీల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంతో పాటు పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక, పరిపాలన సంస్కరణలు చేపట్టాలని పేర్కొంది.

ఏపీలో స్థానిక సంస్థలకు 16 అంశాలు బదిలీ

74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు 18 అంశాలను బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ కేవలం ఆరు రాష్ట్రాలు మాత్రమే 18 అంశాలను బదిలీ చేశాయని, ఆంధ్రప్రదేశ్ 16 అంశాలను బదిలీ చేసిందని నివేదిక వెల్లడించింది. అలాగే, పట్టణ స్థానిక సంస్థల్లో ఏటా తప్పనిసరిగా అకౌంటింగ్ విధానం ఉండాలని నివేదిక సూచించింది. అలాగే, నీతి ఆయోగ్ ఇంకా ఏం సూచించిందంటే..

- రాష్ట్రాల తరహాలోనే పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం అమలు చేయాలి.
- పట్టణ స్థానిక సంస్థలు సొంత ఆదాయ వనరులను పెంచుకోవడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి.
- దేశంలో 223 క్రెడిట్ రేటింగ్‌లు ఇస్తే కేవలం 95 పట్టణ స్థానిక సంస్థలకే పెట్టుబడి రేటింగ్ ఉంది. ఇందులో కేవలం 41 మున్సిపాలిటీలే బాండ్ల ద్వారా రూ.5,459 కోట్ల నిధులు సమీకరించాయి.
- 2036 నాటికి పెరిగే జనాభాలో 73 శాతం పట్టణాల్లోనే ఉంటుందని, అందుకనుగుణంగా మౌలిక వసతుల కోసం అవసరమైన నిధుల సమీకరణకు మున్సిపల్ బాండ్ల జారీతో పాటు ఇతర మార్గాలను అనుసరించాలి. ఇందుకోసం మున్సిపాలిటీల సొంత ఆదాయాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. అప్పుడు క్రెడిట్ రేటింగ్ సాధ్యమవుతుంది.
- స్థానిక సంస్థలకు ప్రధాన ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, వినియోగ రుసుం చాలా తక్కువగా వస్తున్నాయి. అయితే, దేశ జీడీపీలో మున్సిపాలిటీల ఆస్తి పన్ను కేవలం 0.2 శాతమే ఉంది.
- మున్సిపాలిటీలు ఎక్కువగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీచేసే నిధులపైనే ఆధారపడుతున్నాయి.
- మెరుగైన మున్సిపల్ పాలన కోసం ఆర్థిక సంస్కరణలు చేపట్టాలి.
- మున్సిపల్ అకౌంటింగ్ రికార్డులు, వార్షిక ఖాతాలు కచ్చితత్వంతో ఉండాలి.
- వాస్తవ ఆదాయం, వ్యయంతోనే అకౌంటింగ్ ఉండాలి తప్ప ఇంకా రాని ఆదాయం, చేయని వ్యయాలను అకౌంటింగ్‌లో ఉండకూడదు.
- ఏటా ఆదాయంలో 5 శాతం నగదు నిల్వ ఉండేలా చూసుకోవాలి.
- రుణ స్థాయిలో చట్టబద్ధమైన సీలింగ్‌ను విధించుకోవాలి.
- జీతం, పెన్షన్ వ్యయాలను 49 శాతానికి పరిమితం చేయాలి.
- 51 శాతం ఆస్తుల సృష్టి, రుణ సేవలు, పెట్టుబడికి వ్యయం చేయాలి.
- క్రెడిట్ రేటింగ్‌తో బాండ్‌ల జారీని ప్రోత్సహించాలి.
- ఫలితాల ఆధారిత బడ్జెట్‌ను రూపొందించుకోవాలి.
- ఆదాయ అంచనాలు సగటు వార్షిక వృద్ధి కంటే ఎక్కువగా ఉండకూడదు.
- స్థానిక సంస్థలు ఆర్థిక డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలి.
- సొంత పన్నులు, కేంద్ర.. రాష్ట్రాల నుంచి వచ్చే ఆదాయం, వ్యయంతో పాటు అన్ని వివరాలు పౌరులకు ప్రదర్శించాలి.

ప్రధాన రాష్ట్రాల మున్సిపాలిటీల్లో తలసరి ఆదాయం ఇలా.. (రూ.లలో)

రాష్ట్రం	తలసరి ఆదాయం
మహారాష్ట్ర	8,772
గుజరాత్	7,491
మధ్యప్రదేశ్	5,782
కర్ణాటక	5,212
పశ్చిమ బెంగాల్	5,143
తమిళనాడు	3,972
కేరళ	3,822
గోవా	3,584
ఛత్తీస్‌గఢ్	3,357
హరియాణ	3,311
జార్ఖండ్	3,030
ఉత్తరాఖండ్	2,897
రాజస్థాన్	2,894
పంజాబ్	2,894
ఉత్తరప్రదేశ్	2,549
ఆంధ్రప్రదేశ్	2,542
ఒడిశా	2,505
బీహార్	2,224
తెలంగాణ	1,466
అస్సాం	626



టైర్-2, 3 నగరాలకు ప్రాధాన్యత

వీటికి కేంద్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయింపు

- జనసాంద్రత, సౌకర్యాల ఆధారంగా కేటగిరీలుగా విభజన
- రాష్ట్రంలో ఉన్నవన్నీ టైర్-2, టైర్-3 నగరాలే
- దేశంలో టైర్-1 నగరాలు ఎనిమిదే

సాక్షి, అమరావతి: 'దేశంలోని టైర్ 2, టైర్ 3 నగరాలకు రూ. 10 వేల కోట్లు కేటాయింపు'.. బుధవారం కేంద్రం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన ఇది. దేశంలోని నగరాలను మహా నగరాలు, మెట్రో నగరాలు, మెగా సిటీలు, చిన్న సిటీలు అంటూ రకరకాలుగా పిలుస్తుంటాం. వీటిలో ఈ టైర్ 1, 2, 3.. ఇలా విభజన ఏమిటి?.. ఇదీ ఇప్పుడు జరుగుతున్న ఆసక్తికర చర్చ. అదేమిటో మనమూ ఓసారి చూద్దాం.. దేశంలో మహా నగరాలు, నగరాలు, పట్టణాలు చాలా ఉన్నాయి. వీటిలో ఏవి టైర్ 1, ఏవి టైర్ 2, టైర్ 3? వీటిని ఎలా విభజన చేస్తారన్న విషయంపై ఇప్పుడు అందరికీ ఆసక్తి నెలకొంది. ఈ 'టైర్' విధానం మొదట రియల్ ఎస్టేట్ రంగంలో 2007లో మొదలైంది. పది లక్షలు మించిన జనాభా ఉన్న నగరాలను టైర్ 1 గా, 5 లక్షల నుంచి 10 లక్షల మధ్య జనాభా ఉన్న సిటీలను టైర్ 2 సిటీలుగా, అంతకంటే తక్కువ జనాభా ఉన్న వాటిని టైర్ 3 గా పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ సైతం 5 వేల నుంచి లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాలు, నగరాలను ఆరు విభాగాలు (టైర్)గా ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో టైర్ 1 విభాగంలో 8 నగరాలు ఉన్నాయి. టైర్ 2 విభాగంలో 104 నగరాలు చేరాయి. మిగిలినవి టైర్ 3 కేటగిరీలో ఉన్నాయి.

టైర్ 2, 3 నగరాల అభివృద్ధిపై దృష్టి

కరోనా సమయంలో అనుసరించిన వర్క్ ఫ్రం హోం విధానంలోని ప్రయోజనాలను పరిశ్రమలు గ్రహించాయి. టైర్ 1 సిటీలుకంటే తమ పెట్టుబడులకు టైర్ 2 సిటీలు మేలని, వీటిలో జీవన వ్యయం తక్కువగా ఉండడంతోపాటు వర్క్-లైఫ్ మధ్య సమతుల్యత మెరుగ్గా ఉన్నట్టు గుర్తించాయి. పైగా, అనువైన ధరల్లో అద్దె ఇళ్లు లభ్యమవడం, ఖర్చులు కూడా బడ్జెట్‌లో ఉండటంతో ఈ సిటీలపై ఆసక్తి చూపుతున్నాయి. దాంతో టైర్ 2 సిటీల్లో మౌలిక వసతులు కల్పించడం ద్వారా మరిన్ని పెట్టుబడులు ఆకర్షించవచ్చని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. రాష్ట్రంలోని టైర్ 2 సిటీలైన విశాఖపట్నం, నెల్లూరులో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు, అంతర్జాతీయ పరిశ్రమలు సైతం తమ వ్యాపారాలకు కేంద్రంగా ఎంచుకున్నాయి. టైర్ 2, 3 నగరాల్లో ప్రాధాన్యత రంగాలను ప్రోత్సహించేందుకు రూ.10 వేల కోట్లతో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రకటించారు. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉండే ఈ ఫండ్‌ను పట్టణ మౌలిక సదుపాయాల కోసం స్థానిక పట్టణ సంస్థలు ఉపయోగించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీని ప్రకారం రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

టైర్ 1 నగరాలివీ..

అధిక జనాభా, ఆధునిక వసతులతో ఉన్నవి టైర్ 1 (జెడ్ కేటగిరీ) విభాగంలోకి వస్తాయి. వీటిని మెట్రోపాలిటన్ నగరాలుగా పిలుస్తారు. భారతదేశంలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, అహ్మదాబాద్, పూణే టైర్ 1 విభాగంలో ఉన్నాయి. ఈ నగరాల్లో అధిక జనసాంద్రతతోపాటు అంతర్జాతీయ విమానాశ్రయాలు, పరిశ్రమలు, టాప్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, విద్య, పరిశోధన సంస్థలు ఉంటాయి. ఈ నగరాల్లో జీవన వ్యయమూ అధికంగా ఉంటుంది. వీటిని బాగా అభివృద్ధి చెందిన నగరాలుగా చెప్పవచ్చు.

టైర్ 2 సిటీలు

భారతదేశంలో 104 నగరాలు టైర్ 2 విభాగంలో ఉన్నాయి. ఇవి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలు. అయితే, టైర్ 1, టైర్ 2 నగరాల మధ్య పెద్దగా తేడా లేదని అర్బన్ ప్లానర్లు, ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఈ నగరాల్లో జీవన శైలి, అభివృద్ధి వేగంగా జరుగుతుందని, జీవన వ్యయం మాత్రం టైర్ 1 సిటీలతో పోలిస్తే తక్కువగా ఉంటుందని అంచనా. పెట్టుబడులకు, అంతర్జాతీయ వ్యాపార సంస్థలకు ఈ నగరాలు అనువైనవిగా ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. మన రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, నెల్లూరు, కర్నూలు టైర్ 2 సిటీలుగా ఉన్నాయి.

టైర్ 3 నగరాలు అంటే..

టైర్ 2 ఉన్నవి తప్ప మిగిలిన నగరాలు, పట్టణాలను టైర్ 3 విభాగంలో చేర్చారు. ఒకవిధంగా చెప్పాలంటే గ్రేడ్ 2, 3 మున్సిపాలిటీలు వీటి పరిధిలోకి వస్తాయి. ఈ పట్టణాల్లో వసతులను మెరుగుపచడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించవచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.



తెలుగు 'వికీ'కి వందనం!



ఆంగ్ల వికీపీడియాకు దీటుగా 'తెలుగు వికీ'

- ఉభయ రాష్ట్రాల్లోని జిల్లా పునర్వ్యవస్థీకరణ సమగ్ర సమాచారం నిక్షిప్తం
- 27 వేల రెవెన్యూ గ్రామాల వివరాలతో తెలుగు వికీపీడియా బలోపేతం

సాక్షి, అమరావతి: మనకు ఏదైనా సమాచారం అవసరమైతే మొదటగా వెదికేది వికీపీడియా. ప్రపంచంలో ఎటువంటి సమాచారాన్నైనా ఒక్క క్లిక్‌తో మనకు అందిస్తుంది వికీపీడియా. ఇప్పుడు వికీపీడియా తెలుగులోనూ విశ్వ విజ్ఞానాన్ని అందిస్తోంది. మధురమైన తెలుగు భాషను ప్రపంచానికి పరిచయం చేస్తూనే.. ప్రపంచ విశేషాలను తెలుగు వారికి అందిస్తోంది 'తెలుగు వికీపీడియా'. తొలినాళ్లలో ఎవరూ గుర్తించని ఈ 'అద్భుత తెలుగు సమాచార వేదిక' ఆంగ్ల వికీపీడియాను సైతం అధిగమిస్తోంది. దేశంలోని ఇతర భారతీయ భాషల వికీపీడియాలు కూడా ఇవ్వలేనంతగా తెలుగులో ఖచ్చితత్వంతో కూడిన సమాచారాన్ని సమకూరుస్తోంది. ఈ క్రమంలోనే 2016లో తెలంగాణలో, తాజాగా ఏపీలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత వాటి భౌగోళిక సరిహద్దుల వివరాలను ఒకచోట చేర్చి సమగ్రమైన రూపాన్ని తెలుగు వికీపీడియన్లు అందించడం విశేషం. 2003లో డిసెంబర్ 10న తెలుగు వికీపీడియా అందుబాటులోకి వచ్చినప్పటికీ, 2006 నుంచి పూర్తి స్థాయిలో సమాచారాన్ని అందిస్తోంది.

27వేలకుపైగా గ్రామాల సమాచారం

ఆంగ్ల వికీపీడియాలో వేలాది మంది లక్షల వ్యాసాలు రాస్తుంటారు. కానీ తెలుగు వికీపీడియాలో రాసే వాళ్లను వేళ్లపై లెక్కించవచ్చు. ఐతేనేం .. ఆ కొద్దిమందే సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో 27 వేలకు పైగా రెవెన్యూ గ్రామాలు, వాటి మండలాలు, జిల్లాలపై వ్యాసాలు రాయడం ఒక చరిత్ర. ఈ సమాచారం ఒక్క తెలుగు వికీలో తప్ప ఎక్కడా లభించదు. ఈ మొత్తం సమాచారాన్ని ముద్రిస్తే 60 వేల పేజీల గ్రంథం అవుతుంది. దీనిని ఎవరైనా ఉచితంగా వినియోగించుకోవచ్చు.

ముఖ్యంగా ఇవి..

- ▲ ఆంగ్ల వికీలో ఇప్పటి వరకు 66.10లక్షల వ్యాసాలు నాలుగు బిలియన్లకుపైగా పదాలతో ఉన్నాయి. నిత్యం ఎన్నో అప్‌డేట్‌లు వస్తున్నాయి
- ▲ కానీ, తెలుగు వికీలో సమాచారం ఆశించినంత స్థాయిలో లేదు. తెలుగులో 80,778 వ్యాసాలు మాత్రమే ఉన్నాయి.
- ▲ వాస్తవానికి వందల సంఖ్యలో ఔత్సాహికులు స్వచ్ఛందంగా తెలుగు వికీపీడియాకు వ్యాసాలు రాస్తుండగా, ఇందులో నిత్యం పని చేసే వారు 50 మంది లోపే.
- ▲ తెలుగు వికీపీడియన్లలో రిటైర్డ్ ఉద్యోగులు, ఔత్సాహిక తెలుగు ప్రేమికులు, గృహిణులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, విద్యార్థులు ఇలా అనేక వర్గాలు పని చేస్తూ తెలుగు పరిరక్షణకు కృషి చేస్తున్నారు.
- ▲ 2014లో విజయవాడలో జరిగిన తెలుగు వికీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 80 మంది వికీపీడియన్లు హాజరయ్యారు. ఇందులో 20 మంది ఇతర భాషల వారు ఉన్నారు. 2015లో తిరుపతిలో జరిగిన 11వ వార్షికోత్సవంలో 80 మంది వరకు పాల్గొన్నారు.

అడ్మిన్ల పర్యవేక్షణలో..

తెలుగు వికీపీడియాలో ఖచ్చితమైన సమాచారానికి మాత్రమే చోటు లభిస్తుంది. ఔత్సాహికుల్లో అనుభవజ్ఞులు అడ్మిన్లుగా వ్యవహరిస్తూ నిత్యం వ్యాసాలను పరిశీలిస్తుంటారు. పొరపాట్లు ఉంటే వాటిని సరి చేస్తూ పాఠకులకు చేరవేస్తున్నారు. ఇక్కడ ఓటింగ్ ద్వారా అడ్మిన్లను ఎంపిక చేయడం, అవసరమైతే తొలగించడం కూడా చేస్తారు. తెలుగు వికీలో 14 మంది అడ్మిన్లుగా పని చేస్తున్నారు. ప్రపంచంతో పాటు భారతదేశ రాష్ట్రాలు, జిల్లాల సమాచారం తెలుగులో అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల అనువాద వ్యాసాలను కూడా పెంచుతున్నారు.

మీరూ వికీపీడియన్ కావొచ్చు

వెబ్‌సైట్‌లో ఖాతాను సృష్టించుకోవడం లేదా గెస్ట్‌గా అయినా ఎవరైనా వికీపీడియన్‌గా మారవచ్చు. ఎటువంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. పెన్‌నేమ్‌తో కూడా వ్యాసాలు అందించవచ్చు. కొత్తగా వచ్చిన వారికి ఒక గురువును కూడా జత చేస్తారు. వారి సూచనలతో నెమ్మదిగా అక్షర దోషాలను గుర్తించడం, వ్యాసాలు రాయడం అలవాటు చేస్తారు. ప్రతి వికీపీడియా వ్యాసానికి ప్రత్యేక శైలి ఉంటుంది. దానిని అనుసరించే వ్యాసాలు రాయాలి. మారుమూల గ్రామాల్లోని విశేషాలు, సంస్కృతితో పాటు ఎవరైనా సామాజిక కోణంలో స్వయంగా తీసిన ఫొటోలు కూడా పొందుపరచవచ్చు.

మరింత బలోపేతానికి కృషి

నేను ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూ తెలుగు వికీపీడియాకు పని చేస్తున్నాను. ప్రభుత్వాలు విడుదల చేసిన డేటాపై ఆధారపడి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వాడి జిల్లాలు, మండలాల సరిహద్దులు, మ్యాపులను స్వయంగా తయారు చేశాం. ఈ పేజీల్లో రాసిన ప్రతి అంకె, ప్రతి సమాచారమూ ఖచ్చితత్వంతో ఉండేలా చూస్తాం. ఆధారాన్ని ప్రతి పేజీలోనూ మూలాలుగా చూపిస్తాం. అంతేకాదు.. ఏ పేజీలోనైనా ఏదైనా సమాచారం తప్పుగా ఉందనో, అసలు లేదనో మీరు గమనిస్తే, మీరే స్వయంగా మార్పులు చెయ్యవచ్చు. తెలుగు వికీపీడియాలో ఉన్న సమాచారానికి కాపీరైట్ ఉండదు. తెలుగు వికీపీడియా బలోపేతానికి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం.

– పవన్ సంతోష్,
తెలుగు వికీపీడియన్, విజయవాడ

5 కొత్త మెడికల్ కాలేజీల్లో వచ్చే ఏడాది అడ్మిషన్లు!

2024 - 25లో మరో ఐదు వైద్య కళాశాలల్లో మొదలు

- రూ.8,480 కోట్ల వ్యయంతో 17 కొత్త వైద్య కళాశాలలు
- వరుసగా మూడేళ్లలో అదనంగా 2,550 మెడికల్ సీట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైద్య విద్యకు మహర్దశ పట్టనుంది. వరుసగా మూడేళ్లలో 750, 750, 1,050 చొప్పున ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. వైద్య విద్యా రంగంలో విద్యార్థులకు విస్తృత అవకాశాలు కలగనున్నాయి. ఎన్నికల హామీలను నెరవేరుస్తూ ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం రూ.8,480 కోట్లు వ్యయం చేస్తోంది. 2023–24 విద్యా సంవత్సరంలో ఐదు కొత్త వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. 2024–25లో మరో ఐదు కళాశాలల్లో అకడమిక్ కార్యకలాపాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

యుద్ధ ప్రాతిపదికన..

రానున్న విద్యా సంవత్సరం నుంచి నంద్యాల, మచిలీపట్నం, విజయనగరం, ఏలూరు, రాజమండ్రిల్లో కొత్త వైద్య కళాశాలల అకడమిక్ కార్యకలాపాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యుద్ధప్రాతిపదికన ఆయా ప్రాంతాల్లోని జిల్లా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా తీర్చిదిద్దుతున్నారు. మచిలీపట్నం మినహా మిగిలిన నాలుగు చోట్ల ప్రీ–ఇంజనీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. వీటిల్లో అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా వచ్చే ఏడాది రాష్ట్రంలో 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా సమకూరనున్నాయి.



అదనపు భవనాలు, పడకలు

2024–25లో అకడమిక్ కార్యకలాపాలు మొదలయ్యే వాటిల్లో పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని మెడికల్ కాలేజీలున్నాయి. పాడేరులో ఇప్పటికే 150 పడకల ప్రభుత్వాస్పత్రి ఉండగా మిగిలిన నాలుగు చోట్ల వంద పడకల సామర్థ్యం కలిగిన ప్రభుత్వాస్పత్రులున్నాయి. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం కొత్త వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలంటే 330 పడకల సామర్థ్యం కలిగిన బోధనాస్పత్రి అందుబాటులో ఉండాలి. ఈ క్రమంలో ఆయా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా తీర్చిదిద్ది అదనపు భవనాల నిర్మాణం, పడకల పెంపు చేపట్టనున్నారు. మిగిలిన ఏడు వైద్య కళాశాలలు 2025–26లో అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయనున్నారు.

చేరువలో స్పెషాలిటీ వైద్యం

కొత్త వైద్య కళాశాలల్లో అకడమిక్ కార్యకలాపాలపై లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. వచ్చే విద్యా సంవత్సరంలో 5 వైద్య కళాశాలల్లో అకడమిక్ కార్యకలాపాలు మొదలవుతాయి. అనంతరం మరో ఐదు కళాశాలల్లో ప్రారంభించేలా కృషి చేస్తున్నాం. పెద్ద ఎత్తున వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్యతోపాటు ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను మరింత చేరువ చేయడం సీఎం వైఎస్ జగన్ లక్ష్యం.

– ఎం.టి.కృష్ణబాబు,
వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి

మరింత వేగంగా రక్షణ

- అందుబాటులోకి ఆటోమేటెడ్ జియో అలర్ట్ వ్యవస్థ
- దీనిద్వారా ఘటనాస్థలికి దగ్గరలోని అన్ని స్టేషన్లకు సమాచారం
- అవసరమైనంత సిబ్బంది వేగంగా చేరుకునేలా చర్యలు
- ఇప్పటికే డయల్ 112తో అనుసంధానం
- త్వరలో డయల్ 100, దిశ యాప్‌లోనూ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజా భద్రతా వ్యవస్థను పోలీసు విభాగం మరింతగా బలోపేతం చేస్తోంది. ఏదైనా ఘటన జరిగితే ఆ పరిధిలోని పోలీస్ స్టేషన్‌తో పాటు సమీపంలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు తక్షణమే స్పందించే విధంగా ఆటోమేటెడ్ జియో అలర్ట్(ఏజీఏ) వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీనిని డయల్ 100, డయల్ 112, దిశ వ్యవస్థలను అనుసంధానించనుంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా డయల్ 112కు ఏజీఏను అనుసంధానించారు. డయల్ 100, దిశ వ్యవస్థలకు కూడా త్వరలోనే ఈ ఫీచర్‌ను అనుసంధానించనున్నారు.

మరిన్ని పోలీస్‌స్టేషన్లు అప్రమత్తం..

ఇప్పటివరకు రాష్ట్రంలో డయల్ 100, డయల్ 112, దిశ యాప్‌లను పోలీసు శాఖ అందుబాటులో ఉంచింది. ఎవరైనా వీటి ద్వారా సంప్రదిస్తే వెంటనే రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు సమాచారం అందుతోంది. అక్కడి సిబ్బంది.. ఘటన జరిగిన ప్రదేశం ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందో.. ఆ స్టేషన్ పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు ఘటనాస్థలికి వెళ్లి భద్రత కల్పిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఘటన జరిగిన ప్రదేశం సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు దూరంలో ఉంటోంది. మరోవైపు ఆ పరిధిలోకి రాకపోయినప్పటికీ మరో పోలీస్‌స్టేషన్ ఘటనాస్థలికి సమీపంలోనే ఉంటోంది. ఇలాంటి సందర్భాల్లో సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది కంటే కూడా.. ఘటనా స్థలికి సమీపంలోని పోలీస్‌స్టేషన్ సిబ్బందే త్వరగా చేరుకునే అవకాశముంది. అందుకే ఏదైనా ఘటన జరిగితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌తో పాటు సమీపంలోని పోలీస్‌స్టేషన్ల అధికారులను కూడా రంగంలోకి దించాలని పోలీసు శాఖ నిర్ణయించింది. దొంగతనాలు, దోపిడీలు, హత్యలు వంటి నేరాలకు పాల్పడి పరారయ్యేవారిని వెంటనే పట్టుకునేందుకు.. ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

దశలవారీగా విస్తరణ..

ఏజీఏ వ్యవస్థను డయల్ 100, డయల్ 112, దిశ మొబైల్ యాప్‌లలో అందుబాటులోకి తేవాలని పోలీసు విభాగం నిర్ణయించింది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా డయల్ 112తో ఈ వ్యవస్థను అనుసంధానించారు. సహాయం కోసం డయల్ 112కు ఎవరైనా ఫోన్ చేస్తే.. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు కనెక్ట్ అవుతోంది. వెంటనే కమాండ్ కంట్రోల్.. సంబంధిత పోలీస్‌స్టేషన్‌తో పాటు సమీపంలోని పోలీస్‌స్టేషన్లను కూడా అప్రమత్తం చేస్తారు. దాంతో తీవ్రతను బట్టి రెండు, మూడు పోలీస్‌స్టేషన్ల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంటున్నారు. ఈ వ్యవస్థ పనితీరును పరిశీలించి అవసరమైన మార్పులు చేసిన తర్వాత.. డయల్ 100, దిశ మొబైల్ యాప్‌లలోనూ ఏజీఏను అనుసంధానించాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. తద్వారా ప్రజా భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేయగలమని భావిస్తోంది.

బలహీన గిరిజనానికి బలమైన ఊతం

అంతరించే ప్రమాదమున్న గిరిజనుల కోసం ఏపీ సర్కారు ప్రత్యేక చర్యలు

- దేశంలో ఈ జాబితాలో 75 గిరిజన సమూహాలు.. ఏపీలో 9 తెగలు
- ఇప్పటికే నవరత్నాలతో సంక్షేమాన్ని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రానున్న మూడేళ్లలో రూ.15 వేల కోట్లు వెచ్చించేందుకు ప్రతిపాదించిన కేంద్రం

సాక్షి, అమరావతి: దేశంలో అంతరించే ప్రమాద జాబితాలో ఉన్న 75 గిరిజన తెగలను ప్రత్యేక బలహీనమైన గిరిజన సమూహాలు (పీవీటీజీ)గా గుర్తించి ఆయా తెగల సంరక్షణతోపాటు వారికి బలమైన ఊతమిచ్చేలా చర్యలు ఊపందుకున్నాయి. రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఇదే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యాచరణ ప్రకటించడం మరింత కలిసివచ్చే అంశంగా మారనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో గిరిజన సంక్షేమానికి, అభివృద్ధికి చేపట్టిన చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఎస్టీ కాంపోనెంట్ (ఉప ప్రణాళిక) ద్వారా చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో రూ.12,487.48 కోట్లను గిరిజనుల కోసం ఖర్చు చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేవలం మూడున్నరేళ్లలోనే రూ.15,589.38 కోట్లు ఖర్చు చేసింది. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేటాయించిన మొత్తం కంటే ప్రస్తుత ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో రూ.3,101.90 కోట్లు అదనంగా ఖర్చు చేయడం రికార్డు.

అనేక చర్యలతో..

కాగా, గిరిజన తెగల సంక్షేమానికి సైతం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. నవరత్నాలతోపాటు వారికి అనేక విధాలుగా నేరుగా లబ్ధి చేకూరుస్తోంది. గిరిజనులకు భూమి హక్కు(ఆర్వోఎఫ్ఆర్, డీకేటీ పట్టాలు) ఇవ్వడంలో దేశంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అగ్రస్థానం కావడం గమనార్హం. రాష్ట్రంలో గడచిన 12 ఏళ్లలో 2.34 లక్షల ఎకరాలను పట్టాలుగా (దీనిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ పంచిందే ఎక్కువ) పంపిణీ జరిగింది. కాగా, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా 2,48,887 లక్షల ఎకరాలను పంచి రికార్డు సృష్టించింది. ప్రత్యేక గిరిజన విశ్వవిద్యాలయం, వైద్య కళాశాల, ఇంజనీరింగ్ కాలేజీ, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వంటివి నెలకొల్పి ఎస్టీలకు సాంకేతిక, వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చింది. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు, మార్కెటింగ్‌కు ఊతమిస్తోంది. అరకు కాఫీ, నల్లమల నన్నారి వంటి అటవీ ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్‌ను కల్పించి గిరిజనులను ప్రోత్సహిస్తున్నారు.



రాష్ట్రపతి ఆదేశాలతో..

అంతరించే ప్రమాదమున్న జాతుల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలతో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశంలో అంతరించే ప్రమాద జాబితాలో ఉన్న 75 గిరిజన తెగల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం మరింత ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా దేశవ్యాప్తంగా 75 పీవీటీజీల స్థితిగతులపై క్షేత్రస్థాయి అధికారులు అధ్యయనం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో 9 పీవీటీజీల జీనవ పరిస్థితులపై పరిశీలన జరుగుతోంది. గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం యంత్రాంగం సహకారంతో కేంద్ర బృందాలు క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టాయి. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలోని మూడు ప్రాంతాల్లో కేంద్ర బృందాలు డొంగ్రీయా కోండ్, బోండా పోర్జా, పరంగి పోర్జా తెగల జీవన పరిస్థితిని, వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాయి. వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ఆ బృందాలు కేంద్రానికి నివేదించనున్నాయి.

మూడేళ్ల మిషన్

దేశంలో బలహీన గిరిజన సమూహాల (పీవీటీజీ) సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మూడేళ్లపాటు ప్రత్యేక మిషన్(కార్యాచరణ)ను అమలు చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఇందుకోసం మూడేళ్లలో రూ.15 వేల కోట్లను ఖర్చు చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బడ్జెట్‌లో ప్రతిపాదించడం గమనార్హం. ఈ పథకంలో దేశంలోని 75 గిరిజన తెగలకు ప్రత్యేక లబ్ధి చేకూర్చనున్నారు. తద్వారా ఏపీలోని గిరిజన తెగలకు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా కూడా మరింత మేలు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం

గుంటూరు మెడికల్: ఓ టీవీ ఛానల్ ప్రోగ్రాంలో సినీనటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నర్సులపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని నర్సులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వచ్ఛంద ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్‌స్టాపబుల్ అనే కార్యక్రమంలో జనసేన అధినేత, సినీనటుడు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. బాలకృష్ణ గతంలోనూ తనకు వైద్య సేవలు అందించిన ఒక నర్స్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. నర్సులపై చేసిన వ్యాఖ్యలకు బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

బాబు, దత్తపుత్రుడి ఎత్తులను ప్రజలు చిత్తు చేస్తారు

- జగనన్న విదేశీ విద్యా దీవెన చరిత్రాత్మకం
- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు కలిసి అధికారం కోసం మళ్లీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని, వారి ఎత్తులను ప్రజలు చిత్తు చేస్తారని రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ అడపా శేషగిరి అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం చరిత్రాత్మకమని చెప్పారు. శనివారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ పథకం కింద అడ్మిషన్ పొందిన 213 మందిలో 45 మంది కాపు విద్యార్థులు ఉండటం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకానికి సంబంధించి గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం రాజకీయ వారసత్వం కోసమే లోకేశ్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. చంద్రబాబు రోడ్డుపై సమావేశం పెట్టి జనాన్ని చంపేశాడని, లోకేశ్ పాదయాత్ర ప్రారంభం రోజునే అపశ్రుతి చోటు చేసుకుందని చెప్పారు. పవన్ వారాహి రాష్ట్రంలో అతిపెద్ద వింత అని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సీఎం వైఎస్ జగన్‌కు రాష్ట్ర ప్రజల అండదండలు, దేవుడి ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు.

అశ్వాలేవీ..? లొట్టిపిట్టలెక్కడ




దేశంలో తగ్గుతున్న గుర్రాలు, ఒంటెలు

గార్దభాలు, సూకరాలు సైతం గుర్రాల బాటలోనే

దేశంలో మొత్తంగా పశు సంపద కొంతమేర పెరిగినా.. ఒంటెలు, గుర్రాల వంటి జంతువుల సంఖ్యలో 9 శాతం క్షీణత నమోదైంది. 2.90 లక్షల గుర్రాలు తగ్గిపోగా.. 1.50 లక్షల ఒంటెలు కనుమరుగయ్యాయి. గాడిదలు, పందుల సంఖ్య సైతం గణనీయంగా తగ్గిపోయింది. అయితే సంకర జాతి పశువుల సంఖ్య 26.9 శాతం పెరిగింది. దేశవ్యాప్తంగా 6.60 లక్షల గ్రామాలు.. 89 వేల పట్టణాల్లోని 27 కోట్లకు పైగా గృహాలు, ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన 20వ పశుగణన నివేదిక ఈ విషయాల్ని తేటతెల్లం చేసింది.

పశుగణన ఏం తేల్చిందంటే..

- 2012 – 2019 మధ్య మొత్తం పశువుల జనాభాలో 4.6 శాతం పెరుగుదల నమోదైంది.
- దేశంలో ఒంటెలు 84 శాతం రాజస్థాన్‌లో ఉండగా.. 11 శాతం గుజరాత్‌లో ఉన్నాయి.
- 2012 నుంచి 2019 సంవత్సరం నాటికి దేశంలో ఒంటెల జనాభా 4 లక్షల నుంచి 2.5 లక్షలకు తగ్గింది.
- ఇక 2012 నుంచి 2019 మధ్య గుర్రాల సంఖ్య 6.3 లక్షల నుంచి 3.4 లక్షలకు తగ్గింది.
- ఇతర దేశాలకు చెందిన, సంకర జాతి పశువుల జనాభా 2012తో పోలిస్తే 2019లో 26.9 శాతం పెరిగింది.
- 2012తో పోలిస్తే దేశీయ (దేశవాళీ) పశువులలో 6 శాతం క్షీణత ఉంది.
- గత గణనతో పోలిస్తే.. 2019లో దేశంలో మొత్తం పౌల్ట్రీ 851.81 మిలియన్లకు చేరటం ద్వారా 16.8 శాతం వృద్ధి నమోదు చేసింది.
- 2012తో పోలిస్తే 2019 నాటికి దేశంలో పెరటి కోళ్ల పెంపకం 48.8 శాతం పెరిగి.. 317.07 మిలియన్లకు చేరింది.



దేశంలో పశు జనాభా ఇలా.. (మిలియన్లలో)

కేటగిరీ	2012	2019	వృద్ధి శాతం
పశువులు	190.90	192.49	0.83
గేదెలు	108.70	109.85	1.06
గొర్రెలు	65.07	74.26	14.13
మేకలు	135.17	148.88	10.14
పందులు	10.29	9.06	-12.03
అడవి దున్నలు	0.30	0.38	26.66
జడల బర్రె	0.08	0.06	-25.00
గుర్రాలు	0.63	0.34	-45.58
కంచర గాడిదలు	0.23	0.08	-57.09
గాడిదలు	0.32	0.12	-61.23
ఒంటెలు	0.40	0.25	-37.05
మొత్తం	512.06	535.78	4.63

తగ్గుదలకు కారణాలివీ..

- ఒంటెలు, గుర్రాల సంఖ్య తగ్గిపోవడానికి వ్యవసాయ రంగంలో వాటి వినియోగం తగ్గటమే కారణమని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ పేర్కొంది.
- గతంలో రవాణాకు ఒంటెలను వినియోగించే వారు. ఇది క్రమంగా తగ్గుతోంది.
- రాజస్థాన్‌లో మేత భూములు తగ్గడంతో వాటి పెంపకం కష్టంగా మారింది.
- ఇక విదేశాల నుంచి దిగుమతి చేసుకునే గుర్రాల పోషణకు పెట్టుబడి ఎక్కువగా అవుతోంది. దీంతో వీటి పెంపకం ఆర్థికంగా సాధ్యం కావడం లేదు.
- దేశీయ గుర్రపు జాతులను ఎక్కువగా పోలీస్ సేవలు లేదా వినోదాల కోసమే ఉపయోగిస్తున్నారు. – గుర్రాల పెంపకానికి పేరొందిన గుజరాత్‌లో తప్ప ఇతర రాష్ట్రాల్లో వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.
- అయితే ఒంటె జాతిని రక్షించడానికి రాజస్థాన్ ప్రభుత్వం ఒంటెను రాష్ట్ర జంతువుగా ప్రకటించి పలు రక్షణ చర్యలు చేపట్టింది. అలాగే గుజరాత్ ప్రభుత్వం వాటి రక్షణకు చర్యలు తీసుకుంది. కచ్ ప్రాంతంలో ఒంటె పాల సేకరణ, ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసింది.

ఏపీలో 15.79 శాతం వృద్ధి

రాష్ట్రంలో పశు సంపదలో 15.79 శాతం వృద్ధి నమోదైంది. 2012 పశుగణనలో 2.94 కోట్ల పశు సంపద ఉండగా.. 2019 నాటికి 3.40 కోట్లకు పెరిగింది. పౌల్ట్రీ రంగంలోనూ భారీగా వృద్ధి నమోదైంది. 2012 గణన ప్రకారం రాష్ట్రంలో 80.6 మిలియన్ పౌల్ట్రీ జనాభా ఉంటే.. 2019 గణన నాటికి 107.9 మిలియన్లకు చేరింది. అంటే 33.85 శాతం వృద్ధి నమోదైంది. గొర్రెల జనాభాలోనూ 30 శాతం వృద్ధిరేటు నమోదైంది. 2012 గణన ప్రకారం రాష్ట్రంలో 13.6 మిలియన్లు గొర్రెలు ఉండగా.. 2019 నాటికి 17.60 మిలియన్లకు పెరిగాయి. అయితే గేదెల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. 2012లో 6.50 మిలియన్లు గేదెలుంటే.. 2019 నాటికి 6.20 మిలియన్లకు తగ్గాయి.

– సాక్షి, అమరావతి



వాణి అని ఎందుకు పెట్టారంటే?

వాణీ జయరామ్ అసలు పేరు 'కలైవాణి'. పదకొండు మంది పిల్లల్లో ఎనిమిదో సంతానం అయిన వాణి నామకరణ వేడుక చేయడానికి ఆమె తల్లిదండ్రులకు ఆర్థిక కష్టాలొచ్చాయట. దీంతో వాణి పదిరోజుల పాపగా ఉన్నప్పుడు ఓ సిద్ధాంతి దగ్గరకు వెళ్లి మా పాపకు ఏదైనా పేరు సూచించమని అడిగితే 'పాపకు పూర్వజన్మ పుణ్యఫలం ఉంది. దేవుణ్ణి తేనెతో అభిషేకాలు చేసింది. అందుకే 'కలైవాణి' అని పేరు పెట్టండి' అని ఆ సిద్ధాంతి చెప్పారట. ఆ సమయంలో సిద్ధాంతి మాటలకు దురైస్వామి హాయిగా నవ్వుకున్నప్పటికీ, పాప భవిష్యత్తు గురించి ఇప్పుడే కలలు కనడం ఎందుకని అనుకున్నారట. కానీ పేరు మాత్రం కలైవాణి అని పెట్టారు. సిద్ధాంతి చెప్పినది నిజం అయింది. సినీ గాయనిగా, భక్తి గీతాల గాయనిగా వాణి ఎంతటి విశేష ప్రతిభ కనబరిచారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఇక తన తల్లి పద్మావతి తెలుగువారు కాబట్టి తెలుగులోనూ మంచి పాటలు పాడటం పట్ల వాణి పలు సందర్భాల్లో ఆనందం వ్యక్తం చేశారు.

స్కూల్ సెలబ్రిటీ

తమిళనాడులోని వెల్లూరులో జన్మించిన వాణీ జయరామ్ విద్యాభ్యాసం అక్కడే ప్రారంభమైంది. అయితే చెన్నై వెళితే తమ పిల్లలకు మరింత సంగీతం నేర్పవచ్చనే ఉద్దేశంతో చెన్నైకి మారారు దురైస్వామి, పద్మావతి. దీంతో ఐదో తరగతి నుంచి వాణి చదువు చెన్నైలో సాగింది. టీఆర్ బాలసుబ్రమణియన్, త్రివేండ్రం ఆర్.ఎస్ మణి వంటి సంగీత విద్వాంసుల దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటూనే మరోవైపు చదువుల్లో కూడా విశేషంగా రాణించారు వాణి. క్లాస్‌లో టాపర్. కాగా పదేళ్ల వయసులో ఆల్ ఇండియా రేడియోలో స్కూల్ తరపున ఓ పాటల కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా వాణి గొంతు బయటి ప్రపంచానికి వినిపించింది. ఆమె గొంతు, సంగీతం సూపర్‌హిట్ కావడంతో తక్కువ సమయంలోనే ఎక్కువ అవకాశాలు వచ్చాయి. స్కూల్‌లోనే సెలబ్రిటీ అయిపోయారు. తోటి విద్యార్థులే వాణి దగ్గర ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు. ఆ తర్వాత సినీ గాయనిగా ఎన్నో ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు.



ఇంట్లో ఒప్పించి సినీ గాయనిగా...

వాణీ జయరామ్ సంగీత ప్రియుల కుటుంబంలోనే జన్మించినప్పటికీ వారి కుటుంబ సభ్యులకు సినిమా సంగీతం పట్ల మంచి అభిప్రాయం ఉండేది కాదు. సినిమాలు, సినిమా పాటలు వారి ఇంట్లో నిషేధం. సంగీతం అంటే వారి దృష్టిలో శాస్త్రీయ సంగీతమే. అయితే వాణీకి సినిమాల్లో నేపథ్య గాయనిగా పేరు తెచ్చుకోవాలని కల. కానీ ఆమె తల్లి పద్మావతి ఇష్టపడలేదు. ఇంట్లో ఒప్పించి, స్వయంకృషితో తన కలను నెరవేర్చుకున్నారు వాణి. కూతురి కీర్తి చూసి, తల్లి సంతోషించారు. అయితే వాణి విజయాలను ఆమె తండ్రి దురైస్వామి చూడలేకపోయారు. 1969లోనే ఆయన మరణించారు. తన సక్సెస్‌ను తండ్రి చూడలేకపోవడం కాస్త బాధ కలిగించిందని వాణి ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు.

ఒకేరోజులో చెన్నై.. బెంగళూరు!

భర్త వృత్తిరీత్యా ముంబయ్‌లో స్థిరపడినప్పుడు హిందీ సినిమాలకు పాటలు పాడటం మొదలుపెట్టారు వాణి. అయితే అక్కడ పలు కారణాల వల్ల అవకాశాలు సరిగ్గా రాకపోవడంతో మద్రాస్‌కు మకాం మార్చారు. ఆ టైమ్‌లో ఎక్కడ విన్నా వాణి గొంతే. ఒకేరోజు ఇటు మద్రాస్ అటు బెంగళూరులో రికార్డింగ్ ఉంటే.. ఉదయం ఫ్లయిట్‌లో బెంగళూరు వెళ్లి, పాడి అదే రోజు మద్రాస్ చేరుకుని తమిళ సినిమాకి పాడారు. దాదాపు నాలుగేళ్ల పాటు ఇలానే సాగింది.

మూగబోయిన వాణి

● ప్రముఖ గాయని వాణీ జయరామ్ కన్నుమూత ● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



వాణీ జయరామ్
(1945-2023)

'తెలి మంచు కరిగింది తలుపు తీయనా ప్రభూ'.. ఎంత కమ్మని గొంతు. ఉషోదయం వేళ మనసుని ఉల్లాసంగా తట్టిలేపే మృదు మధురమైన కంఠస్వరం వాణీ జయరామ్ సొంతం.. అలాంటి ఆ కంఠస్వరం మూగబోయింది. ప్రముఖ గాయని వాణీ జయరామ్ (78) కన్నుమూశారు. చెన్నైలోని నుంగంబాక్కమ్‌లో ఉన్న తన స్వగృహంలో అనుమానాస్పద స్థితిలో మరణించారామె. వాణి నుదురు, భుజంపై రక్తపు గాయాలు ఉండడంతో ఆమె మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. పోలీసులు ఐపీసీ 174 సెక్షన్ కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఇంటిలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. అలాగే ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. వాణి మృతదేహానికి ఓమందూరార్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం కేసు విచారణ ముమ్మరం అయ్యే సూచనలున్నాయి.

తమిళనాడులోని వెల్లూరులో దురైస్వామి, పద్మావతిలకు 1945 నవంబరు 30న జన్మించారు వాణీ జయరామ్. ఆమె అసలు పేరు కలైవాణి. పదకొండు మంది పిల్లల్లో వాణి ఎనిమిదో సంతానం. ఆమె తల్లి పద్మావతి కర్నూలులో జన్మించడంతో వాణికి తెలుగులో పాడటం అలవాటైంది. రంగరామానుజ అయ్యంగార్ వారి వద్ద పద్మావతి సంగీత శిక్షణ పొందారు. తన కుమార్తె వాణిని కూడా ఆయన వద్దే కర్ణాటక సంగీత శిక్షణ కోసం చేర్పించారామె. వెల్లూరులో వాణి నాలుగో తరగతి పూర్తయ్యాక, ఆమెకు మరింత మంచి సంగీత శిక్షణ ఇప్పించేందుకు వారి కుటుంబం చెన్నైకి తరలి వెళ్లింది. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు జీఎస్ బాలసుబ్రహ్మణ్యం శిష్యుడైన టీఆర్ బాలసుబ్రహ్మణ్యం వద్ద సంగీతం నేర్చుకున్నారు వాణి. తన ఎనిమిదవ ఏటనే మద్రాసులో ఆకాశవాణిలో పాడారు. పదేళ్ల నుంచే పూర్తి స్థాయి కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీలు చేశారామె. స్కూలులో 22 వేర్వేరు కళలతో బహుముఖ ప్రజ్ఞ కలిగిన స్టూడెంట్‌గా అవార్డును పొందారు వాణి. బీఏ ఎకనామిక్స్ చదువుతున్న సమయంలో కళాశాలల స్థాయిలో డిబేట్ కార్యక్రమాల్లో బహుమతులు పొందారామె. చదువు పూర్తయ్యాక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెన్నై బ్రాంచిలో ఉద్యోగంలో చేరారు వాణి. 1967లో ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆ తర్వాత 1969లో జయరామ్‌ని వివాహం చేసుకుని, ముంబయ్‌కి వెళ్లారు వాణి. భర్త జయరామ్ ప్రోత్సాహంతో ఉస్తాద్ అబ్దుల్ రెహ్మాన్ ఖాన్ వద్ద హిందుస్తానీ శాస్త్రీయ సంగీత శిక్షణను పొందారామె. ఆ సమయంలోనే బ్యాంకు ఉద్యోగానికి స్వస్తి చెప్పి పూర్తి స్థాయి సంగీత సాధనకు సమయాన్ని వెచ్చించారామె. కర్ణాటిక్, హిందుస్థానీ సంగీతాలను నేర్చుకున్న ఆమె 1969లో ముంబయ్‌లో తొలి కచేరి ఇచ్చారు. సంగీత దర్శకుడు వసంత్ దేశాయ్‌కి ఆమె గొంతు నచ్చడంతో 1971లో హృషికేశ్ ముఖర్జీ దర్శకత్వంలో వచ్చిన 'గుడ్డి' చిత్రంలో తొలిసారి పాట పాడే అవకాశమిచ్చారు. ఆ చిత్రం కోసం వాణీ జయరామ్ పాడిన 'బోలె రే పపీ హరా..' పాటకు మంచి స్పందన వచ్చింది. వాణికి 'తాన్సేన్ సమ్మాన్, బెస్ట్ ప్రామిసింగ్ సింగర్, ఆలిండియా సినీగోయర్స్' వంటి అవార్డులు దక్కాయి. ఇక 'అభిమానవంతుడు' (1973) చిత్రంలో 'ఎప్పటివలె కాదురా స్వామి' అనే పాటను వాణీ జయరామ్‌తో పాడించారు దర్శకుడు ఎస్.పి. కోదండపాణి. తెలుగులో ఆమెకు ఇదే తొలి చిత్రం. 1974లో ముంబయ్ నుండి చెన్నైకి వచ్చి స్థిరపడిన ఆమె తెలుగు, తమిళ, కన్నడ,



● తొలి సినిమా పాట రికార్డింగ్‌లో వాణీ జయరామ్, వసంత దేశాయ్, హృషికేశ్ ముఖర్జీ, జయబాదురి

మలయాళ, హిందీ, భోజ్‌పురి, మరాఠీ, ఒరియా.. ఇలా 14 భాషల్లో పదివేలకుపైగా పాటలు పాడారు. కేవీ మహదేవన్, ఎం.ఎస్. విశ్వనాథన్, ఇళయరాజా, పెండ్యాల, చక్రవర్తి, సాలూరి రాజేశ్వర రావు వంటి సంగీత దర్శకుల సినిమాల్లో ఎక్కువ పాటలు పాడారామె. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'అపూర్వ రాగంగళ్' చిత్రానికి తొలిసారి జాతీయ పురస్కారం అందుకున్నారామె. ఆ తర్వాత 'శంకరాభరణం' చిత్రంలోని 'మానస సంచరరే..' గీతానికి ఆమెకు రెండోసారి జాతీయ పురస్కారం దక్కింది. 'స్వాతికిరణం'లోని 'ఆనతి నీయరా హరా..' పాటకు ఉత్తమ గాయనిగా జాతీయ అవార్డు అందుకున్నారు వాణి. జాతీయ స్థాయిలోనే తెలుగు, గుజరాతీ, ఒడియా, తమిళ భాషల్లో ప్రాంతీయ స్థాయి ఉత్తమ గాయని అవార్డులు పొందారామె. 'కలైమామణి, సంగీత పీఠ్ సమ్మాన్, ఎంకే త్యాగరాజ భాగవతార్ జీవన సాఫల్య పురస్కారం, ఫిలింఫేర్ జీవన సాఫల్య పురస్కారం, కాముకర అవార్డు, సుబ్రహ్మణ్య భారతి అవార్డు, ఘంటసాల జాతీయ పురస్కారం, దక్షిణ భారత మీరా అవార్డు' వంటి ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు వాణీ జయరామ్.

సినిమా పాటలే కాదు.. ఎన్నో భక్తి గీతాలను, లలిత గీతాలను ఆలపించారు వాణి. 'మొరటోడు' చిత్రంలోని 'హే కృష్ణా మళ్లీ నీవే జన్మిస్తే' పాటతో పాటు 'ప్రేమలేఖలు'లోని 'ఈరోజు మంచిరోజు' అంటూ సుశీలతో కలసి పాడిన పాట తనకెంతో ఇష్టం అని వాణి గతంలో పేర్కొన్నారు. తమకు పిల్లలు లేకున్నా ఆ లోటును సంగీతమే తీర్చిందని చెప్పేవారామె. వాణి భర్త జయరామ్ 2018లో మృతి చెందారు. కాగా సంగీత రంగానికి ఆమె చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022కిగాను ఇటీవల 'పద్మ భూషణ్' అవార్డు ప్రకటించింది. అయితే ఆ పురస్కారాన్ని స్వీకరించకుండానే వాణి ఈ లోకాన్ని వదిలి వెళ్లడం బాధాకరం. ఆమె మృతిపట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. నేడు ఆమె భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

భర్త ప్రోత్సాహంతో...



● భర్త జయరామ్‌తో...

ప్రతి మగాడి విజయం వెనక మహిళ ఉంటుందంటారు. కానీ వాణీ జయరామ్ విజయం వెనక ఆమె భర్త జయరామ్ ఉన్నారు. పెళ్లి తర్వాత కూడా సంగీతంలో ఆమెను ఎంతగానో ప్రోత్సహించారు. ముంబయ్‌లోని ఇండో–బెల్జియం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా చేసిన జయరామ్ సంగీతప్రియులు. పండిట్ రవిశంకర్ దగ్గర ఆరేళ్లు ఆయన సితార్ నేర్చుకున్నారు. వాణీతో వివాహం తర్వాత తన భార్యలోని సంగీత ప్రావీణ్యతను గుర్తించారు జయరామ్. అప్పటికే కర్ణాటిక్, శాస్త్రీయ సంగీతాలను ఔపోసన పట్టిన ఆమెను హిందుస్థానీ సంగీతాన్ని కూడా నేర్చుకోవాలని కోరారు జయరామ్. కేవలం నేర్చుకోమని చెప్పడమే కాకుండా.. ఉస్తాద్ అబ్దుల్ రహమాన్ దగ్గర సంగీత పాఠాలు నేర్పించారు. ఉస్తాద్ అబ్దుల్ రహమాన్ శిష్యరికంలో ఆరు నెలల కఠోర శిక్షణ తర్వాత హిందుస్థానీ సంగీతంలో కూడా వాణి ప్రతిభ చూపారు. 18 గంటల పాటు ఏకధాటిగా శిక్షణ తీసుకున్న రోజులు కూడా ఉన్నాయి. ఇక బ్రహ్మాండంగా కచేరీలు చేసుకోవచ్చని వాణీకి భరోసా ఇచ్చారు రహమాన్. ఆత్మవిశ్వాసం, గురువు రహమాన్ ఇచ్చిన భరోసాతో చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి స్వస్తి పలికారు వాణి. 1969లో తొలిసారిగా ముంబయ్‌లో కచేరి ఇచ్చారామె. ఆ తర్వాత సినీ గాయనిగా ఎంతో బిజీ అయ్యారు.

సంగీతమే సంతానం... వాణీ జయరామ్ దంపతులకు సంతానం లేరు. సంగీతాన్నే సంతానంలా భావించారు. ''సంగీతంతో సంతానం లేని లోటు తీరిపోయిందనుకుంటాం'' అని పలు సందర్భాల్లో వాణి పేర్కొన్నారు.

➡ భారత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రసంశలు పొందారు వాణీ జయరామ్. ఓ కచేరీలో ఇందిరా గాంధీ తన ప్రతిభను ఎంతగానో మెచ్చుకున్నట్లు పలు సందర్భాల్లో వాణి స్వయంగా చెప్పారు.

➡ హేమమాలిని, వినోద్ ఖన్నా ప్రధాన తారాగణంగా గుల్జార్ దర్శకత్వంలో 1979లో హిందీలో 'మీరా' అనే చిత్రం వచ్చింది. ఈ సినిమాలో ఉన్న 13 పాటల్లో 12 పాటలను వాణీ జయరామ్ పాడటం విశేషం.


➡ గంగామహోత్సవ్, స్వామి హరిదాస్ ఫెస్టివల్, ఛండీఘఢ్‌లోని పంచకుల, ఛిత్తోడ్‌ఘడ్‌లో మీరా ఫెస్టివల్స్.. ఇలా పలు పండగలకు ఆమె కచేరిలు చేశారు. బద్రినాథ్‌లో రెండుసార్లు పాడారు.



● 'మీరా'లో హేమమాలిని



● డి.కె.పట్టమ్మాళ్, జయలక్ష్మి, ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి, రాధ, ఎస్.జానకి, ఎల్.ఆర్.ఈశ్వరి, వాణీ జయరామ్



● 'అందెల రవమిది'లో భానుప్రియ

కొత్త నాయికలకు ఆ వాణీయే...

ఓ కొత్త హీరోయిన్ వెండితెరకు పరిచయం అవుతుందంటే వెంటనే వాణీ జయరామ్‌కు కబురు వెళ్లేది. అలా పలువురు హీరోయిన్లు నటించిన తొలి సినిమాకు పాటలు పాడారు వాణీ జయరామ్. శ్రీదేవి హీరోయిన్‌గా పరిచయమైన తొలి తమిళ ('మూండ్రు ముడుచ్చు – 'ఆడి వెళ్లి'), హిందీ (సోల్వా సావన్ – గోరియా హో గోరియా) చిత్రాల్లో పాటలు పాడారు వాణీ జయరామ్. అలాగే షబానా ఆజ్మీ, జూహీ చావ్లా, పర్వీన్ బాబీ, జయ బాధురీ హీరోయిన్లుగా పరిచయం అయిన తొలి చిత్రాలకు వాణీ జయరామ్ పాటలు పాడారు.



● 'గోరియా హో గోరియా' పాటలో శ్రీదేవి



● 'తెలిమంచు కరిగింది'లో... మంజునాథ్



● 'సాగర సంగమమే'లో ముచ్చెర్ల అరుణ

లత–ఆశా–వాణి



● ఆశా భోంస్లే, లతా మంగేష్కర్

ఏ వృత్తిలో అయినా పోటీ సహజం. అలా వాణీ జయరామ్ బాలీవుడ్‌కి తన వాణి వినిపించడానికి వెళ్లినప్పుడు అప్పటికే అక్కడ 'స్టార్ సింగర్స్'గా వెలుగుతున్న అక్కచెల్లెళ్లు లతా మంగేష్కర్, ఆశా భోంస్లేల నుంచి గట్టి పోటీ ఎదురైంది. హిందీ చిత్రం 'గుడ్డి' (1971)లో పాడిన 'బోలె రే పపీ హరా..' పాట ద్వారా బాలీవుడ్‌కి పరిచయమై 'మధురమైన కంఠం' అని శ్రోతల నుంచి కితాబులు అందుకున్నారు వాణీ జయరామ్. అయినప్పటికీ ఆ తర్వాత పెద్దగా అవకాశాలు రాలేదు. లత, ఆశాలు వాణీకి అవకాశాలు రాకుండా చేశారనే ఓ టాక్ ఇప్పటికీ ఆ నోటా ఈ నోటా వినిపిస్తుంటుంది. ఇదే విషయం గురించి ఓ ఇంటర్వ్యూలో వాణీ జయరామ్ మాట్లాడుతూ – ''కెరీర్ పరంగా నేను ఎవరి పేర్లూ ఉద్దేశించి మాట్లాడను. లతాజీ, ఆశాజీ గొప్ప గాయనీమణులు. వాళ్లు నాకేమైనా చేశారా? చేయలేదా? అనే విషయం గురించి నేను మాట్లాడను. ఒకరు ఏం చేశారనే విషయంపై నేను ఓ నిర్ణయానికి రాకూడదు. అయితే హిందీలో నేను విజయాలు సాధించినప్పటికీ నన్ను పెద్దగా పట్టించుకోలేదు. అది దురదృష్టం. అలా ఎవరికీ జరగకూడదు'' అని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఆమె గాయనీమణులు శంషాద్ బేగం, సుమన్ కల్యాణ్‌పూర్‌ల పేర్లను ప్రస్తావించారు. ''శంషాద్, సుమన్‌లు మంచి సింగర్స్ అయినప్పటికీ అనుకున్నంతగా రీచ్ కాలేకపోయారు. ఇలా ఎందరికో జరిగి ఉండి ఉంటుంది. వారిలో నేను ఒకదాన్ని... అంతే. అయితే ఇలా జరగడానికి ఏదో ఒక కారణం ఉండే ఉంటుంది'' అని కూడా వాణి అన్నారు.

ప్రముఖుల నివాళి

తన మధురమైన గాత్రంతో సినీ సంగీతానికి విశేష సేవలందించి ఎంతోమంది హృదయాలను గెలిచారు వాణీ జయరామ్ గారు. పాన్ ఇండియా స్థాయిలో బలమైన శాస్త్రీయ పునాదిని నిర్మించారామె. వాణీగారి మృతి భారత సినీ పరిశ్రమకు, సంగీత ప్రపంచానికి తీరని లోటు. ఆమె ఆత్మకు శాంతి కలగాలి.. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. **- వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి**

* * *

వాణీ జయరామ్‌గారి మృతి బాధాకరం. 14 భాషల్లో 10 వేలకుపైగా పాటలు పాడిన ఆమె సినీ రంగానికి అందించిన సేవలు మరువలేనివి. ఆమె మృతి భారత సినీ పరిశ్రమకు, సంగీత ప్రపంచానికి తీరని లోటు.. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. **- కేసీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి**

* * *

ప్రఖ్యాత భారతీయ సినీ సంగీత గాయనీమణిగా ఖ్యాతి సంపాదించుకున్న 'కలైమామణి' వాణీ జయరామ్ మరణ వార్త చాలా బాధించింది. ఆమె లేని లోటును భారతీయ సినిమాలో ఎవరూ భర్తీ చేయలేరు. వాణీ జయరామ్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. **- ఎంకే స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి**

* * *

పదాలకు పదోన్నతి చేకూరేలా ఒక వినూత్నమైన బాణీతో ప్రపంచానికి ఎన్నో పాటలను బహుమతిగా ఇచ్చిన కోకిలలా జీవించిన వాణీ జయరామ్‌గారు ఇప్పుడు ప్రశాంతించారు. ఆవిడ పాటలు మనతోనే ఉంటాయి. **- కమల్‌హాసన్**

మీరు (వాణీని) నాకు పాడిన తొలి పాటనే మీకు నివాళిగా అర్పిస్తున్నాను. 'మేఘమే మేఘమే.. పాల్ నిలా తేయందదే. దేగమే తేయినుమ్ తేనొళి వీసుదే.. ఎనక్కొరు మలర్ మాలై నీ వాంగ వేండుమ్' (తమిళ చిత్రం 'పాలవన్న చోలై'లోని పాట.. ఈ చిత్రం తెలుగులో 'మంచు పల్లకి'గా రీమేక్ అయింది. తెలుగులో 'మేఘమా..' పాటని ఎస్. జానకి పాడారు). పాటలో 'ఎనక్కొరు మలర్ మాలై నీ వాంగ వేండుమ్' అంటే నాకోసం నువ్వొక పూలదండ కొనాలని అర్థం. ఈ సాహిత్యాన్ని 'ఉనక్కొరు మలర్ మాలై నాన్ వాంగ వేండుమ్'.. (నీకోసం నేనో పూలదండ కొనాలని అర్థం) అని మార్చి... 'ఆ పూల దండ దీనికోసమేనా?' (వాణి మరణాన్ని ఉద్దేశించి) అంటూ ముగించారు **తమిళ ప్రముఖ రచయిత వైరముత్తు.**

* * *

చాలా షాక్‌కి గురి చేసే వార్త ఇది. నమ్మశక్యంగా లేదు. జస్ట్ రెండు రోజుల క్రితమే వాణీ అమ్మతో మాట్లాడాను. నిజమైన లెజెండ్. బలమైన శాస్త్రీయ పునాదితో బహుముఖ ప్రతిభ గల బహు భాషా గాయనిని కోల్పోయాం. **- చిత్ర**

* * *

నిన్న (శుక్రవారం) రాత్రి కె. విశ్వనాథ్ సార్ సినిమాల్లో వాణీగారి పాటలు వింటూ, 'ఎంత అద్భుతంగా పాడారో వినండీ.. అని మా ఆయన (నటుడు శరత్‌కుమార్)తో అన్నాను. ఆ మర్నాడే ఆమె మరణ వార్త విని షాకయ్యాను. **- రాధికా శరత్‌కుమార్**

* * *

ఎంత గొప్ప గాత్రం. చివరిసారిగా ఆమెను కలిసినప్పుడూ ఆ గాత్రంలో అదే స్పష్టత. 'ఏళు స్వరంగళ్, మల్లిగై, నానే నానా వంటి పాటలతో పాటు నాకు పాడిన 'మేఘమే మేఘమే'... ఇలా ఆమె పాడిన ఎన్నో పాటలు హృదయాల్లో నిలిచిపోతాయి. **- సుహాసినీ మణిరత్నం**

అలా తన వాణిని కాపాడుకున్నారు



ఎన్నో వేల వైవిధ్యమైన పాటలు పాడినప్పటికీ వాణీ జయరామ్ స్వరంలో మార్పు రాలేదు. వాణి తన వాణి (గాత్రం)ని జాగ్రత్తగా కాపాడుకున్నారు. ఎలా అంటే.. ఆమె ఏది పడితే అది తినేవారు కాదు. బయట ఆహారాన్ని తీసుకునేవారు కాదు.. స్వయంగా వండుకునేవారు. రికార్డింగ్, సింగింగ్ తప్ప ఇతర విషయాల గురించి ఎక్కువగా ఆలోచించేవారు కాదు. బుక్స్ బాగా చదివేవారు. ముఖ్యంగా గొప్ప వ్యక్తుల ఆత్మకథలను చదివేవారు. చాలామందికి తెలియని విషయం ఏంటంటే... వాణీ జయరామ్‌లో ఓ రచయిత్రి కూడా ఉన్నారు. తీరిక సమయాల్లో ఆమె పద్యాలు రాసేవారు. పెయింటింగ్ వేసేవారు. ఎంబ్రాయిడరీ కూడా చేసేవారు.

వాణి తెలుగు హిట్ సాంగ్స్ కొన్ని...

అభిమానవంతులు – 'ఎప్పటివలె కాదురా నా సామి...'
'స్వాతి కిరణం' – తెలి మంచు కరిగింది తలుపు తీయనా ప్రభూ, ఆనతినీయరా హరా..., శివానీ భవానీ..
'శంకరాభరణం' – దొరకునా ఇటువంటి సేవ.., ఏ తీరుగ నను.., పలుకే బంగారమాయెనా..
'పూజ' – పూజలు చేయ పూలు తెచ్చాను...
'సీతామాలక్ష్మి' – ఏ పాట నే పాడను...
శ్రుతిలయలు – ఆలోకయే శ్రీ బాలకృష్ణమ్...
'తిరుపతి' – తప్పెట్లోయి తాళాలోయి
'సీతాకోక చిలుక' – సాగర సంగమమే..., అలలు కలలు ఎగసి ఎగసి అలసి సొలసి
'స్వర్ణకమలం' – అందెల రవమిది పదములదా...
'మంగమ్మగారి మనవడు' – శ్రీ సూర్యనారాయణ మేలుకో...
'గుప్పెడు మనసు' – నేనా పాడనా పాట.. మీరా అన్నదీ మాట..
'ఘర్షణ'– ఒక బృందావనం సోయగం...

అది దైవ సంకల్పం



1970 నుంచి 1990 వరకూ బిజీ గాయనిగా సాగిన వాణీ జయరామ్ ఆ తర్వాత కాస్త స్లో అయ్యారు. కాగా పలు భాషల సినిమాలకు పాడుతూనే మరోవైపు ఎన్నో భజన పాటలు కూడా పాడారు వాణి. 'అది పూర్తిగా దైవ సంకల్పం. ఆ దేవుడికి ధన్యవాదాలు. భజనలు పాడినప్పుడు నా మనసెంతో ఆనందంగా ఉంటుంది' అని పలు సందర్భాల్లో ఆమె పేర్కొన్నారు. హిందీలో తొలి చిత్రం 'గుడ్డి'కి తొలుత ఆమె పాడినది భజన పాటే. అయితే సినిమా విడుదల తర్వాత చూస్తే సిల్వర్ స్క్రీన్‌పై ఆ పాట వినబడలేదు. అలా ఎందుకు జరిగిందో ఎప్పటికీ అర్థం కాలేదని ఓ సందర్భంలో వాణి పేర్కొన్నారు. ఈ ఒక్క పాటే కాదు.. వాణి పాడిన పాటల్లో తెరపై వినిపించనవి ఎన్నో ఉన్నాయి. 'ఇలాంటివాటి గురించి తలచుకుంటే బాధ రెట్టింపు అవుతుందే కానీ, తగ్గదు. అందుకే వాటి గురించి ఆలోచించను' అని ఓ సందర్భంలో వాణి పేర్కొన్నారు. వాణీ జయరామ్ అంత పాజిటివ్ పర్సన్.



తేజ్‌నారాయణ్ అర్ధ సెంచరీ

జింబాబ్వే, వెస్టిండీస్ జట్ల మధ్య తొలి టెస్టు తొలి రోజు ఆటకు వర్షం దెబ్బ కొట్టింది. బులవాయోలో శనివారం మొదలైన ఈ మ్యాచ్‌లో తొలి రోజు వర్షం కారణంగా ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 51 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 112 పరుగులు సాధించింది. విండీస్ దిగ్గజ క్రికెటర్ శివనారాయణ్ చందర్‌పాల్ కుమారుడు తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (170 బంతుల్లో 55 బ్యాటింగ్; 8 ఫోర్లు) కెరీర్‌లో రెండో అర్ధ సెంచరీ చేశాడు. కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (138 బంతుల్లో 55 బ్యాటింగ్; 2 ఫోర్లు) కూడా క్రీజులో ఉన్నాడు.

ముంబైను నిలువరించిన హైదరాబాద్

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నీలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. ముంబై సిటీ ఎఫ్‌సీ జట్టుతో శనివారం ముంబైలో జరిగిన మ్యాచ్‌ను హైదరాబాద్ 1-1తో 'డ్రా'గా ముగించింది. 23వ నిమిషంలో డియాజ్ గోల్‌తో ముంబై 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 65వ నిమిషంలో హితేశ్ శర్మ గోల్‌తో హైదరాబాద్ స్కోరును సమం చేసింది. 16 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 36 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.



జాతీయ రికార్డుతో జ్యోతికి రజతం

సాక్షి, హైదరాబాద్: మిరామస్ ఎలైట్ ఇండోర్ ట్రాక్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ 60 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకం సాధించింది. అంతేకాకుండా 60 మీటర్ల హర్డిల్స్‌లో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. ఫ్రాన్స్‌లో జరిగిన ఈ మీట్‌లో విశాఖపట్నంకు చెందిన జ్యోతి ఫైనల్ రేసును 8.17 సెకన్లలో ముగించింది. సైప్రస్ అథ్లెట్ డాఫ్నీ జార్జియు కూడా 8.17 సెకన్లలోనే రేసును ముగించింది. అయితే రియాక్షన్ టైమ్ ఆధారంగా డాఫ్నీ (0.145 సెకన్లు) స్వర్ణ పతకం దక్కించుకోగా... జ్యోతి (0.175 సెకన్లు) ఖాతాలో రజతం చేరింది. అంతకుముందు హీట్స్‌లో జ్యోతి 8.18 సెకన్లతో జాతీయ రికార్డును సృష్టించగా... ఫైనల్లో తన రికార్డును ఆమె మరోసారి సవరించింది.



ప్రణయ్‌కు పసిడి పతకం


ప్రణయ్


రుచిత


ఆశీర్వాద్

సాక్షి, హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ క్రీడాకారుల తమ పతకాల వేట కొనసాగిస్తున్నారు. భోపాల్‌లో జరుగుతున్న ఈ క్రీడల్లో శనివారం అథ్లెటిక్స్ బాలుర ట్రిపుల్ జంప్‌లో తెలంగాణ ప్లేయర్ కొత్తూరి ప్రణయ్ పసిడి పతకాన్ని సొంతం చేసుకోగా.. బాలికల 100 మీటర్ల హర్డిల్స్‌లో నామాయి రుచిత రజత పతకాన్ని గెల్చుకుంది. శుక్రవారం 1500 మీటర్ల రేసులో సుమిత్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. శనివారం జరిగిన జూనియర్ పురుషుల సైక్లింగ్ కెరిన్ రేసు వ్యక్తిగత విభాగంలో ఆశీర్వాద్ సక్సేనా మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. బ్యాడ్మింటన్‌లో అండర్-19 బాలుర సింగిల్స్ విభాగంలో కె.లోకేశ్ రెడ్డి తెలంగాణకు స్వర్ణ పతకాన్ని అందించాడు. ఫైనల్లో లోకేశ్ రెడ్డి 21-19, 15-21, 22-20తో అభినవ్ ఠాకూర్ (పంజాబ్)పై గెలుపొందాడు. బాక్సింగ్‌లో బాలుర 51 కేజీల విభాగంలో బిలాల్... బాలికల 75 కేజీల విభాగంలో గుణనిధి పతంగె కాంస్య పతకాలు సాధించారు. పతకాల పట్టికలో ప్రస్తుతం తెలంగాణ పది పతకాలతో 14వ ర్యాంక్‌లో ఉంది.

వరల్డ్ గ్రూప్-2కు పడిపోయిన భారత్

డెన్మార్క్ చేతిలో పరాజయం


సుమిత్

హిలెరాడ్ (డెన్మార్క్): ప్రపంచ పురుషుల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్ డేవిస్ కప్‌లో 2019లో కొత్త ఫార్మాట్ మొదలుపెట్టాక... భారత జట్టు తొలిసారి వరల్డ్ గ్రూప్-2కు పడిపోయింది. డెన్మార్క్ జట్టుతో ఆదివారం ముగిసిన వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ 2-3 తేడాతో ఓడిపోయింది. తొలి రోజు రెండో సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 4-6, 6-3, 6-4తో ఆగస్ట్ హోమ్‌గ్రెన్‌ను ఓడించడంతో భారత్ స్కోరును 1-1తో సమం చేసింది. అయితే రెండో రోజు డబుల్స్ మ్యాచ్‌లో హోల్గర్ రూన్-ఇంగిల్డ్‌సెన్ జోడీ 6-2, 6-4తో 65 నిమిషాల్లో రోహన్ బోపన్న-యూకీ బాంబ్రీ ద్వయంపై గెలిచి డెన్మార్క్‌కు 2-1తో ఆధిక్యం అందించింది. నాలుగో మ్యాచ్‌లో హోల్గర్ రూన్ 7-5, 6-3తో సుమిత్ నగాల్‌పై నెగ్గడంతో డెన్మార్క్ 3-1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. ఫలితం తేలిపోవడంతో... నామమాత్రమైన ఐదో మ్యాచ్‌లో భారత ప్లేయర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 6-4, 7-6 (7/1)తో ఎల్మెర్ మోలెర్‌ను ఓడించాడు.

'మా వద్దా స్పిన్ అస్త్రాలు ఉన్నాయి'

- ఆసీస్ బౌలింగ్ బృందంపై కమిన్స్ విశ్వాసం
- తొలి టెస్టుకు అందుబాటులో గ్రీన్!


మీడియా సమావేశంలో ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ కమిన్స్, కోచ్ మెక్‌డొనాల్డ్

బెంగళూరు: భారత గడ్డపై టెస్టు సిరీస్ అంటే స్పిన్ బౌలింగ్ ప్రాధాన్యత ఏమిటో అందరికీ తెలుసు. అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్‌లాంటి స్పిన్నర్లను ఎదుర్కొని ఆస్ట్రేలియా ఎలా పరుగులు సాధిస్తుందనేది ఆసక్తికరం. అయితే మరోవైపు తమ స్పిన్ కూడా బలమైందేనని ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ నమ్ముతున్నాడు. ఈ నెల 9 నుంచి బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో కమిన్స్ శనివారం మీడియాతో మాట్లాడాడు. తమ జట్టులోనూ నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారని, భిన్నమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని కమిన్స్ అన్నాడు. ఈ సిరీస్‌లో నాథన్ లయన్ ఆసీస్ ప్రధానాస్త్రం కాగా, ఇతర స్పిన్నర్లు అతనికి అండగా నిలవనున్నారు. 'మా జట్టులోనూ ఆఫ్‌స్పిన్నర్, లెగ్‌స్పిన్నర్, లెఫ్టార్మ్ పేసర్... ఇలా భిన్నమైన బౌలర్లు అందుబాటులో ఉన్నారు. అయితే పరిస్థితులను బట్టి 20 వికెట్లు తీయగల సామర్థ్యం ఉన్న బౌలింగ్ బృందాన్నే ఎంచుకుంటాం. నాగపూర్‌లో తొలి టెస్టు సమయానికే స్పష్టత వస్తుంది' అని కమిన్స్ చెప్పాడు. తమ స్పిన్నర్లపై మేనేజ్‌మెంట్‌కు గట్టి నమ్మకం ఉందని అతను వెల్లడించాడు. 'ఆస్టన్ అగర్ మంచి ప్రతిభావంతుడు. గత రెండు విదేశీ పర్యటనల్లో ఆడిన స్వెప్సన్‌కు అనుభవం వచ్చింది. మర్ఫీ కూడా గత సిరీస్ ఆడాడు. ట్రవిస్ హెడ్ కూడా మంచి ఆఫ్‌స్పిన్ వేయగలడు. కాబట్టి వీరంతా లయన్‌కు సహకరించగలరు' అని ఆసీస్ కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. అయితే స్పిన్‌పై చర్చలో తమ పేస్ బౌలర్ల పదును గురించి ఎవరూ చర్చించడం లేదని కమిన్స్ వ్యాఖ్యానించాడు. 'అన్ని పరిస్థితుల్లోనూ సత్తా చాటగల పేస్ బౌలర్లు మాకు ఉన్నారు. పేస్‌కు పెద్దగా సహకరించని సిడ్నీ పిచ్‌లపై కూడా వారు చెలరేగారు. గత భారత పర్యటనలో రాంచీ టెస్టులో నేను మంచి ప్రదర్శన కనబర్చడం మరచిపోలేను. ఈసారి నాపై మరింత బాధ్యత ఉంది' అని కంగారూ టీమ్ సారథి పేర్కొన్నాడు. మరోవైపు వేలి గాయం నుంచి కోలుకుంటున్న ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ తొలి టెస్టు ఆడే అవకాశాలు మెరుగవుతున్నాయి. తాజా సన్నాహక శిబిరంలో అతను బాగా బౌలింగ్ చేశాడని, బ్యాటింగ్‌లో కొంత అసౌకర్యంగా ఉన్నా... మ్యాచ్ సమయానికి కోలుకుంటే తుది జట్టులో స్థానం ఖాయమని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ వెల్లడించాడు. గ్రీన్ టీమ్‌లోకి వస్తే అదనపు స్పిన్నర్‌ను ఆడించేందుకు ఆసీస్‌కు అవకాశం ఉంటుంది.

'రివర్స్ స్వింగ్' పని చేస్తుంది: క్యారీ

భారత్‌లో స్పిన్ బౌలింగ్ ప్రభావం గురించే అంతా మాట్లాడుతున్నారని, అయితే రివర్స్ స్వింగ్ తమను ఇబ్బంది పెట్టవచ్చని ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ అభిప్రాయపడ్డాడు. 2018లో ఆసీస్ 'ఎ' తరఫున ఇక్కడ ఆడినప్పుడు స్పిన్ కోసం సిద్ధమైతే భారత పేసర్లు రివర్స్ స్వింగ్‌తో తమను పడగొట్టారని గుర్తు చేసుకున్నాడు. బుమ్రా, పంత్‌లాంటి ఆటగాళ్లు లేక ప్రస్తుత భారత జట్టు కొంత బలహీనంగా కనిపిస్తోందని, కొద్దిగా కష్టపడితే ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ గెలిచే అవకాశం ఉందని మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్ వ్యాఖ్యానించాడు. టీమిండియా కోహ్లిపై అతిగా ఆధారపడుతోందన్న చాపెల్... ఖాజా, లబుషేన్‌లాంటి ఆటగాళ్లకు ఇది అతి పెద్ద పరీక్షగా అభివర్ణించాడు.

'నా అకాడమీని ఆక్రమిస్తున్నారు'

భారత దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష ఆవేదన

తిరువనంతపురం: అథ్లెటిక్ దిగ్గజం, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష కన్నీళ్ల పర్యంతమైంది. కోజికోడ్‌లోని తన అకాడమీలో ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలపై ఆవేదన వ్యక్తం చేసింది. అక్కడి భద్రతపై కూడా ఉష తన బాధను వెల్లడించింది. 'నా అకాడమీ మధ్యలోనే అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. మేం బౌండరీ నిర్మించుకునేందుకు కూడా అడ్డు పడుతున్నారు. అదేమని అడిగితే దురుసుగా మాట్లాడుతూ బెదిరిస్తున్నారు. దీనిపై కేరళ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశాను. ఆయన చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నా అకాడమీలోని 25 మంది మహిళా అథ్లెట్లలో 11 మంది ఉత్తరాదికి చెందినవారు. వారి భద్రత మాకు ముఖ్యం' అని ఉష పేర్కొంది. సుమారు 30 ఎకరాల ఈ అకాడమీ స్థలాన్ని కేరళలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం ఉషకు 30 సంవత్సరాల కాలానికి లీజుకు ఇచ్చింది. గత జూలైలో రాజ్యసభకు నామినేట్ అయిన తర్వాత తనపై ఇలాంటి వేధింపులు పెరిగాయని ఉష చెబుతోంది. దురదృష్టవశాత్తూ ప్రతీ రాజకీయ పార్టీ తనను మరో పార్టీ సానుభూతిపరురాలిగా చూస్తోందని, అయితే తనకు ఎలాంటి రాజకీయాలు తెలియవని ఉష తన బాధను ప్రకటించింది.



కోల్‌కతా శుభారంభం



బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) రెండో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా థండర్‌బోల్ట్స్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో కోల్‌కతా 15-11, 15-11, 15-14, 10-15, 14-15తో బెంగళూరు టోర్పెడోస్ జట్టును ఓడించింది. కోల్‌కతా వరుసగా మూడు సెట్‌లు గెలిచి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ లీగ్ నిబంధనల ప్రకారం ఫలితంతో సంబంధం లేకుండా రెండు జట్లు నిర్ణీత ఐదు సెట్‌లు ఆడాల్సి ఉంటుంది. ఈ గెలుపుతో కోల్‌కతా ఖాతాలో రెండు పాయింట్లు చేరాయి. నేడు జరిగే మ్యాచ్‌లో కాలికట్ హీరోస్‌తో ముంబై మిటియోస్ తలపడతాయి.


'టాప్'లోకి శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ


డేవిడ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఫుట్‌బాల్ 'ఐ' లీగ్ చాంపియన్‌షిప్‌లో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ (హైదరాబాద్) 3-0 గోల్స్ తేడాతో చర్చిల్‌బ్రదర్స్ (గోవా) ఎఫ్‌సీ జట్టును ఓడించింది. 15 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 31 పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. చర్చిల్ బ్రదర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు తరఫున డేవిడ్ కాస్టనెడా (55వ ని.లో), రాముల్ ఉన్‌చుంగా (71వ ని.లో), లూయిస్ ఒగానా (90+2వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

రంజీ ట్రోఫీ సెమీస్‌లో సౌరాష్ట్ర

- క్వార్టర్ ఫైనల్లో పంజాబ్‌పై గెలుపు
- పార్థ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన


పార్థ్

రాజ్‌కోట్: మాజీ చాంపియన్ సౌరాష్ట్ర రంజీ ట్రోఫీ దేశవాళీ క్రికెట్ టోర్నీలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. పంజాబ్ జట్టుతో ముగిసిన ఐదు రోజుల క్వార్టర్ ఫైనల్లో జైదేవ్ ఉనాద్కట్ నాయకత్వంలోని సౌరాష్ట్ర 71 పరుగుల తేడాతో గెలుపొందింది. 252 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి ఓవర్‌నైట్ స్కోరు 52/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పంజాబ్ 89.1 ఓవర్లలో 180 పరుగుల వద్ద ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ మన్‌దీప్ సింగ్ (45; 4 ఫోర్లు) టాప్ స్కోరర్. సౌరాష్ట్ర స్పిన్నర్లు పార్థ్ భుత్ (5/89), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/56), యువరాజ్ డోడియా (2/35) పంజాబ్ జట్టును దెబ్బ తీశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పార్థ్ భుత్ (162 పరుగులు; 8 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సౌరాష్ట్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈనెల 8 నుంచి జరిగే సెమీఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌తో బెంగాల్ (ఇండోర్‌లో); కర్ణాటకతో సౌరాష్ట్ర (బెంగళూరులో) ఆడతాయి.

మామూలు ఆరోగ్య సమస్యలుగా పొరబడే క్యాన్సర్లు

జబ్బులో కాలేయకండి!

ఎక్కడైనా పొరబడితే 'పప్పులో కాలేశార'ని అంటుంటారు. ఇలా పప్పులో కాలేసినా పర్లేదు కానీ జబ్బుల్లో కాలేయకూడదు. ఎందుకంటే ఒక్కోసారి ఆ జబ్బు క్యాన్సర్ కూడా కావచ్చు. తలనొప్పి వస్తుంది. పెయిన్ కిల్లర్ కొనుక్కుంటాం. మలవిసర్జనలో కాస్త రక్తం కనిపించవచ్చు. పైల్స్ అనుకుంటాం. ఇంటర్‌నెట్లో ఏదో చూస్తాం. ఇంకేదో అనుకుంటాం. ఈ 'ఇంకేదో' అనేది వేడి చేయడం వల్లనో, ఎక్కువగా ప్రయాణాలు చేయడం వల్ల వచ్చిన అలసట, నీరసం, నిస్సత్తువగానో పొరబడి మెడికల్ షాపుకు వెళ్లి 'ఓవర్ ద కౌంటర్' మెడిసిన్స్ కొనుక్కుంటాం. కానీ జబ్బును కొనుక్కుంటున్నామేమో, జబ్బులో కాలేస్తున్నామేమో, ఆ జబ్బు క్యాన్సర్ కావచ్చేమో అని కూడా ఒకసారి ఆలోచించాలి. ఆ ఆలోచన, మనం పెంపొందించుకునే అవగాహన మన ప్రాణాలు రక్షించవచ్చు.

మనం 'చాలా మామూలే' అనుకునే కొన్ని సమస్యలున్నాయి. వాస్తవంగా చూసినా అవి చాలా సాధారణ ఆరోగ్య సమస్యలే. కానీ ఒకవేళ అవి కాస్తంత ఎక్కువ కాలమో లేదా కనిపించాల్సిన దానికంటే ఎక్కువ తరచుగానో కనిపిస్తే.. నిర్లక్ష్యం చేయకూడదు. కొద్దిగా ఎక్కువగా దృష్టి పెట్టాలి. మామూలు సమస్యలుగా పొరబడే కొన్ని క్యాన్సర్ల గురించి తెలుసుకుందాం.



తలనొప్పి : తరచుగా అందరికీ వచ్చేదే. చికాకు, పనుల ఒత్తిడి, ఎండ, కొన్ని రకాల వాసనలవంటి కారణాలతో మైగ్రేన్ లేదా తలనొప్పి అప్పుడప్పుడు రావడం చాలా సాధారణమే. కానీ తలనొప్పి వచ్చినప్పుడల్లా మందులు వేసుకుంటూపోతే కాలేయం, కిడ్నీల మీద తీవ్ర ప్రభావం పడవచ్చు. అప్పటికీ తలనొప్పి తరచూ వస్తుంటే కారణం తెలుసుకోవడం అవసరం. మైగ్రేన్ వచ్చినప్పుడు తక్షణం వాడాల్సిన మందులు, మరోసారి రాకుండా తీసుకోవాల్సిన దీర్ఘకాలిక మందులు తీసుకుంటే మైగ్రేన్ తగ్గుతుంది. అయితే ఉదయం లేవగానే తల భారంగా అనిపించడం, నొప్పి తీవ్రంగా ఉండటం, వాంతులు, వికారం లాంటి లక్షణాలు కనిపిస్తుంటే మాత్రం అది బ్రెయిన్ ట్యూమర్‌కు సంకేతం కావచ్చు.

గొంతునొప్పి : చల్లటి పదార్థాలు తీసుకున్నా, కొత్తప్రదేశంలో తాగేనీరు మారినా గొంతునొప్పి, గొంతు బొంగురుపోవడం వంటి సమస్యలు కనిపిస్తాయి. రెండుమూడు రోజుల్లో తగ్గితే సరి. కానీ ఓ కోర్సుగా మందులు వాడాక కూడా అదే సమస్య మళ్లీ మళ్లీ కనిపిస్తుంటే మాత్రం డాక్టర్‌ను సంప్రదించడం తప్పనిసరి. థైరాయిడ్ క్యాన్సర్, గొంతు సంబంధిత క్యాన్సర్, లంగ్ క్యాన్సర్‌లోని కొన్ని లక్షణాలు తొలిదశలో ఇలాగే ఉంటాయి.

దగ్గు, ఆయాసం : ముఖ్యంగా సిగరెట్టు తాగే వాళ్లలో ఇలాంటి లక్షణాలు మామూలే. అందుకే వాళ్లు కాస్త నిర్లక్ష్యం చేసే అవకాశమూ ఉంది. కానీ స్మోకింగ్ అలవాటు క్యాన్సర్‌కు దారితీయవచ్చనీ, అప్పుడు ఆగకుండా దగ్గు రావడం, కళ్లె/తెమడ పడటం, ఆయాసం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలా కనిపిస్తే లంగ్ క్యాన్సర్ కావచ్చేమో అని పరీక్షలు చేయించుకుని, లేదని తెలిస్తే హాయిగా ఉండవచ్చు. కాకపోతే పొగతాగే అలవాటు మానేయాలి.

కడుపు ఉబ్బరం, మంట : వేళకు ఆహారం తీసుకోకపోవడం, నోరూరించే అనారోగ్య పదార్థాలు, నిద్రలేమి, ఒత్తిడి వంటి కారణాలతో కడుపులో మంట, తేన్పులు, ఉబ్బరం, ఆకలి తగ్గడం, వికారం వంటి లక్షణాలు తరచూ కనిపిస్తుంటాయి. వెంటనే ఓ యాంటాసిడ్స్ మాత్ర వాడేస్తాం. ఇలాంటివారు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకోవాలి. ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకుంటూ, నీళ్లు ఎక్కువగా తాగుతూ ఉన్నప్పటికీ ఇదే సమస్య మాటిమాటికీ వస్తూ ఉంటే ఒకసారి ఎందుకైనా మంచిది ఎండోస్కోపీ, స్కానింగ్ లాంటి పరీక్షలు చేయించాలి. ఎందుకంటే జీర్ణవ్యవస్థకు సంబంధించిన క్యాన్సర్లు, కాలేయం, పాంక్రియాస్, గాల్‌బ్లాడర్ క్యాన్సర్లు తొలిదశలోనే బయటపడతాయి.

మూత్రవ్యవస్థలో తేడాలు : తరచూ మూత్రంలో రక్తం కనిపించడం, ఆగిఆగిరావడం, మంట వంటి లక్షణాలు కనిపించినప్పుడు వేడి చేసిందని చాలామంది అంటుంటారు. మూత్రంలో ఇన్ఫెక్షన్లు, కిడ్నీలో రాళ్లు వంటి కారణాలతో ఈ లక్షణాలు కనిపించవచ్చు. ఇవి మరీ తీవ్రంగా ఉండి చికిత్సలకు లొంగకపోతే యూరినరీ బ్లాడర్‌కు సంబంధించిన క్యాన్సర్ కావచ్చేమోనని అనుమానించాలి. 50 ఏళ్లపైబడిన పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ లక్షణాలూ ఇలాగే ఉండవచ్చు.

మహిళల విషయంలో... నెలసరిమధ్య రక్తస్రావం, పొట్టభారంగా ఉండటం, ఆకలి మందగించడం, స్త్రీలలో నెలసరి ముందు ఉండే సమస్యలుగా (పీఎమ్‌ఎస్)గా పొరబడవచ్చు. కానీ ఒవేరియన్, యుటిరైన్ క్యాన్సర్లు ఇలాగే వ్యక్తం కావచ్చు.

మలవిసర్జనలో తేడాలు : అజీర్తి, విరేచనాలు, మలవిసర్జనలో రక్తం పడటం వంటి లక్షణాలు.... ఆహారపు అలవాట్లు మారినప్పుడు పైల్స్, ఫిషర్, ఫిస్టులా సమస్యల్లో కనిపించవచ్చు. కానీ మలవిసర్జన సమయంలో ఎప్పుడూ రక్తం పడుతుంటే మాత్రం దాన్ని పైల్స్ అనుకోకూడదు. కొలోన్ క్యాన్సర్ కూడా కావచ్చు. అందుకే ఒకసారి సిగ్మాయిడోస్కోపీ, కొలనోస్కోపీ వంటి పరీక్షలు చేయించుకుని సమస్య ఏమిటో తెలుసుకుని, అది క్యాన్సర్ కాకపోతే నిశ్చింతగా ఉండవచ్చు.

డా. సీహెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్,
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్ నంబరు: 9849022121



హెల్త్

● మోడ్రన్ అడ్వాన్స్‌డ్ యాప్స్ ఫర్ హార్ట్ అండ్ హెల్త్

గుండె గుబులు... ముందే పసిగట్టు!

నడక కోసం మొబైల్‌లోనో లేదా మీ వాచ్‌లోనో 'యాప్'లు ఉండి... రోజుకు ఎన్ని అడుగులు వేస్తున్నారు, ఎన్ని క్యాలరీలు బర్న్ చేస్తున్నారు, ఎంత నిద్రపోతున్నారు... ఇంకెంత అవసరం లాంటి విషయాలు తెలుపుతుండటం అందరికీ తెలిసిందే. కానీ కొన్ని అడ్వాన్స్‌డ్ యాప్స్ ఉన్నాయి. అవి ఇంకా చాలా విషయాలు చెబుతాయి. ఈ యాప్స్ గురించి తెలుసుకుంటే... అకస్మాత్తు ప్రమాదాల్ని, చాలా మరణాల్ని నివారించుకోవచ్చు. మన ఆత్మీయులను రక్షించుకోవచ్చు. పైగా ఇవన్నీ ఫ్రీ యాప్స్. అలాంటి కొన్ని 'అడ్వాన్స్‌డ్ యాప్స్' గురించి తెలుసుకుందాం.



అంతా ఆరోగ్యంగా కనిపిస్తుంటారు. వ్యాయామాలు చేస్తూ ఫిట్‌గా ఉన్నట్టూ ఉంటారు. కానీ.. ఉన్నట్టుండి గుండెపట్టుకుని కూలబడిపోతుంటారు. ఇలాంటి సంఘటనలు మనకు తెలిసిన వాళ్లలోనే ఎన్నెన్నో చూస్తుంటాం. ఈ కింది యాప్స్‌తో వీటిలో చాలావరకు నివారించడానికి వీలవుతుంది. అవేమిటంటే...

'హార్ట్ ఫెయిల్యూర్ అండ్ స్ట్రోక్ హెల్పర్' : ఇది 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' (ఏహెచ్ఏ) అండ్ 'అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్'ల సాంకేతికతతో సహాయంతో రూపొందిన యాప్. గుండెపోటు, గుండెజబ్బులు, పక్షవాతాల గురించి ఎంతో విలువైన సమాచారాన్ని అనునిత్యం ఇస్తుంటుంది. గుండె లక్షణాలను గమనిస్తుంటుంది. వాటిని బట్టి మందుల వాడకాన్ని గమనిస్తూ... మనం డాక్టర్‌తో ఏయే అంశాల గురించి చర్చించాల్సిన అవసరముందో ముందునుంచే హెచ్చరిస్తుంటుంది.

ఏ విషయాలు చెబుతుందంటే/ఫీచర్స్ ఏమిటంటే...

- మన అలవాట్లు, జీవనశైలిని గమనిస్తూ... వాటి వల్ల గుండెకు ఏం జరుగుతుందో ఓ కన్నేసి ఉంచి, డాక్టర్‌ను కలిసినప్పుడు ఏయే అంశాల గురించి మాట్లాడాలో వివరిస్తుంది.
- ముందే 'హార్ట్ ఫెయిల్యూర్' కండిషన్‌తో బాధపడే రోగులకు ఇంకా ఎక్కువ మార్గదర్శకంగా ఉంటుంది.
- మీరు ఇదే యాప్‌తో డాక్టర్‌తో అనుసంధానితమై ఉంటే... మీ లక్షణాల్ని డాక్టర్‌కూ చేరవేస్తూ ఉంటుంది. దాంతో ఏదైనా విషయం మీరు డాక్టర్‌తో చర్చించడం మరచినా... ఆ విషయాలన్నీ డాక్టర్‌కు తెలిసి ఉండటంతో ఫాలో అప్ సులువవుతుంది.
- మందుల వాడకం (మెడికేషన్ మేనేజ్‌మెంట్) గురించి కూడా హెచ్చరికలిస్తుంది.
- ఆరోగ్య ప్రస్థానంలో నమ్మకమైన సమాచారాన్ని సమకూరుస్తుంది.

రెడ్ క్రాస్ ఫస్ట్ ఎయిడ్ : దీన్నే సంక్షిప్తంగా 'ఐఆర్‌సీఎస్' ఆప్‌గా చెబుతుంటారు. ఇది మెడికల్ ఎమర్జెన్సీ సమయాల్లో ఎలాంటి మార్గదర్శకాలు పాటించాలో వివరిస్తుంది. ఆ అత్యవసరాల్లో చేయాల్సినవి చెబుతుండటం వల్ల ప్రాణ రక్షణకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.



ఏయే విషయాలు చెబుతుందంటే/ఫీచర్స్ ఏమిటంటే...

- మెడికల్ ఎమర్జెన్సీ సమయంలో ముందుగా ఏం చేయాలో చెబుతుంది కదా... ఆ తర్వాత నుంచి ఒకదాని తర్వాత మరొకటిగా (స్టెప్ బై స్టెప్) ఏయే ప్రక్రియలు చేస్తూ పోవాలో చెబుతుంది. చేయాల్సిందల్లా... ఓ ప్రక్రియ ముగియగానే స్క్రీన్ టచ్ చేయాలి. ఆ తర్వాతి ప్రక్రియ తెలుస్తుంది. ఇలా మెడికల్ ఎమర్జెన్సీలో డాక్టర్‌ను లేదా హాస్పిటల్‌ను చేరే లోపు చేయాల్సిన పనులన్నీ చేస్తూనే... పేషెంట్‌ను హాస్పిటల్‌కు తరలించవచ్చు. దాంతో ప్రాణరక్షణకు అవకాశాలు చాలా మెరుగవుతాయి.
- అవి చేయాల్సిన అవసరం వచ్చిన వారు... దగ్గరి మిత్రులు లేదా బంధువుల వంటి వారికి అదే సమయంలో మెసేజ్ పంపుతుంది.
- మనం ఆ సమయంలో చదవడానికి వీలుగా కీలకమైనవి 'పెద్ద పెద్ద' అక్షరాల్లో, అంతగా ముఖ్యం కానివి చిన్న అక్షరాల్లో కనిపిస్తుంటాయి. మనకు మనంగా చేసుకోలేనివి... అవి చూస్తూ చేయాలంటూ సహాయం కల్పించేవారిని కోరవచ్చు.

గూగుల్ ఫిట్ : 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (డబ్ల్యూహెచ్ఓ)తో మాత్రమే కాదు... మరో పక్క 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్'తోనూ అనుసంధానితమై ఉంటుందీ గూగుల్ ఫిట్ యాప్.

ఏయే విషయాలు చెబుతుందంటే/ఫీచర్స్ ఏమిటంటే...

గుండె ఆరోగ్యంగా ఉంచుకునేందుకు మీరు సాధించాల్సిన లక్ష్యాలను, అందుకు ఓ స్కోర్‌ను సూచిస్తుంది. మీరెన్ని పాయింట్‌లు సాధించాలో గుర్తుచేస్తుంటుంది. ఉదాహరణకు గుండె ఆరోగ్యం బాగుండాలంటే వారానికి కనీసం '150 హార్ట్ పాయింట్స్' సంపాదించేలా వ్యాయామం ఉండాలి. మనం హాయిగా లేదా తాపీగా నడుస్తూ పదివేల అడుగులు వేసినా దాంతో పెద్దగా ప్రయోజనం లేదు. నిమిషంలో 100 అడుగులు పడేలా నడిస్తే హార్ట్ స్కోర్‌లో 'ఒక పాయింట్' సాధించినట్టు అవుతుంది. అలా వారంలో 150 హార్ట్ పాయింట్స్ గనక సంపాదిస్తే అది గుండె ఆరోగ్యానికి ఎంతగానో మేలు. ఈ విధంగా గుండె ఆరోగ్యానికి కావాల్సిన పాయింట్లు మనం సాధిస్తున్నామా, మనం లక్ష్యానికి ఎంత దూరంలో ఉన్నాం... ఇలా ఎప్పటికప్పుడు చెబుతూ... గుండె ఆరోగ్యంగా ఉంచుకోవడంలో సహాయం చేస్తుంది.

పీజీ సీపీఆర్ : పీజీ సీపీఆర్ అనే యాప్‌తో ఎన్నో ఉపయోగాలుంటాయి. 'కార్డియాక్ అరెస్ట్' అయినప్పుడు అత్యవసరంగా 'కార్డియో పల్మునరీ రిససియేషన్' (సీపీఆర్) అనే ప్రక్రియ చేయాలి. ఇందులో ఒక చేతి వేళ్లలో మరో చేతి వేళ్లు దూర్చినట్టుగా ఉంచి, సరిగ్గా ఎదుర్రొమ్ముపై మధ్యన ఉండే (స్టెర్నమ్) ఎముకపై ఒత్తిడి పడేలా లయబద్ధంగా నొక్కుతుంటారు. ఇందులో నిమిషానికి 100 - 120 సార్లు... ఇలా వేగంగా నొక్కుతుండాలి. ఇలా 5 సెం.మీ. నుంచి 6 సెం.మీ. మేరకు ఒత్తిడి పడేలా నొక్కాలి. ఇందులో ప్రతి 30 సార్లకు (కంప్రెషన్లకు) రెండుసార్లు నోటి దగ్గర శ్వాస ఇవ్వాల్సి ఉంటుంది. ఇది పేషెంట్‌ను బతికించే తక్షణ చికిత్స. అంటే 'బేసిక్ లైఫ్ సపోర్ట్' కోసం చేసేదన్నమాట. దాంతో ఆగిన గుండెను మళ్లీ స్పందించేలా చేయవచ్చు. ఈ సీపీఆర్ ప్రక్రియ అంతా పీజీ సీపీఆర్‌లో విపులంగా ఉంటుంది.

ఇవన్నీ పూర్తిగా ఉచితంగా లభ్యమయ్యే యాప్స్. గుండె రక్షణకు ఎంతో ఉపయోగపడతాయి. ఇవేగాక కొంత మొత్తం చెల్లించాల్సిన యాప్స్, కొంతవరకు ఉచిత సేవలు ఇచ్చి అటు తర్వాత డబ్బులు వసూలు చేసేవి చాలా ఉన్నాయి. కానీ మనకు ఉచితంగా సేవలందించే యాప్స్ గురించి తెలుసుకోవడం, అందుబాటులో ఉంచుకోవడం ఎంతైనా మేలు చేసే అంశం.



డాక్టర్ శరణ్ రెడ్డి,
సీనియర్ క్రిటికల్ కేర్ కన్సల్టెంట్

మెడి టిప్

తరచూ తలనొప్పా?

- చేతి గడియారాల రిపేర్ల వంటి అతి సూక్ష్మమైన పనిముట్లతో పనిచేసేవారు, ఎంబ్రాయిడరీ వంటివి చేతిపనులుగా చేసేవారు కంటిని ఒత్తిడికి గురికాకుండా చూస్తూ, కొద్దికొద్దిసేపు బ్రేక్ తీసుకోవడం అవసరం.
- పిల్లలు క్లాస్‌రూమ్‌లో బోర్డు కనిపించడం లేదన్నా, తలనొప్పి వస్తోందని చెప్పినా ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. తక్షణం ఐ సైట్ చెక్ చేయించాలి. కంటి చూపు బాగుందని తెలిశాక కూడా తలనొప్పి... దాంతో పాటు తల తిరగడం, వాంతుల వంటివి కనిపిస్తే తక్షణం న్యూరాలజిస్టును సంప్రదించాలి.
- రోజూ ప్రశాంతంగా కనీసం ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలి.
- తమకు సరిపడని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. కాఫీ, చాక్లెట్లు, కెఫిన్ ఎక్కువగా ఉండే శీతల పానియాలకు దూరంగా ఉండాలి.
- ఆల్కహాల్, పొగతాగడం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. ఈ జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నప్పటికీ రెండువారాలకు పైగా తలనొప్పి వస్తున్నా, తెల్లవారుజామున నిద్ర లేవగానే తలనొప్పి కనిపిస్తున్నా వెంటనే డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి.



క్లుప్తంగా...

మార్చి 29 నుంచి కువైట్‌కు విమాన సర్వీస్


ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి మరో అంతర్జాతీయ విమాన సర్వీస్‌ను ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే షార్జాకు వారానికి రెండు విమాన సర్వీస్‌లు నడుపుతున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మార్చి 29వ తేదీ నుంచి కువైట్ సిటీకి మరో కొత్త సర్వీస్‌ను ప్రారంభించనుంది. విజయవాడ – కువైట్ మధ్య వారానికి ఒక సర్వీస్ నడుపుతున్నట్లు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విడుదల చేసిన సమ్మర్ షెడ్యూల్‌లో ప్రకటించింది. ఈ సర్వీస్ ప్రతి బుధవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి కువైట్‌కు 3.25 (భారత కాలమానం ప్రకారం 5.55) గంటలకు చేరుతుంది. తిరిగి ఈ విమానం కువైట్‌లో సాయంత్రం 4.25 (భారత కాలమానం ప్రకారం 6.55) గంటలకు బయలుదేరి రాత్రి 11.50కు ఇక్కడికి చేరుకుంటుంది. విజయవాడ నుంచి కువైట్‌కు ప్రారంభ టికెట్ ధరను రూ.17,400, కువైట్ నుంచి ఇక్కడికి రూ.15,624గా నిర్ణయించారు. భవిష్యత్‌లో ఇక్కడి నుంచి దుబాయి, సింగపూర్‌కు విమాన సర్వీస్‌లు నడిపేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి.

10న ఎస్ఎస్ఎల్‌వీ-డి2 ప్రయోగం


ఎస్ఎస్ఎల్‌వీ-డి2 రాకెట్ అనుసంధానం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈ నెల 10వ తేదీ ఉదయం 9.18 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ–డీ2)ను ప్రయోగించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. ఈ ప్రయోగంలో ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈవోఎస్-07) అనే ఉపగ్రహంతోపాటు మరో రెండు చిన్నతరహా ఉపగ్రహాలను నింగిలోకి పంపనుంది. గత ఏడాది ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్‌వీ–డి1 పేరుతో చేసిన మొదటి ప్రయోగం సక్సెస్ అయినా కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందకపోవడంతో ఆ ప్రయోగం విఫలమైనట్లు అధికారులు ప్రకటించారు. ఆ ప్రయోగంలో చోటు చేసుకున్న సాంకేతిక లోపాలను సరిచేసి రెండో ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు సందర్శకులు ఆదివారం నుంచి www//shar.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తెలిపారు.

మౌలిక వసతులపై కేంద్రం మరోవిడత సర్వే

ఈ నెల 9న లాంఛనంగా ప్రారంభం

సాక్షి, అమరావతి: 'మిషన్ అంత్యోదయ' పేరుతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై మరో విడత సర్వే చేయనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఈ నెల 9వ తేదీన సర్వేను లాంఛనంగా ప్రారంభించనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ అంత్యోదయ కార్యక్రమం పేరుతో ఇప్పటికే 2017–18లో ఒక విడత, 2019లో మరో విడత సర్వే నిర్వహించింది. ఆయా సర్వే అంశాల నివేదికల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వస్థాయిలో వివిధ పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపడుతుందని అధికారులు వెల్లడించారు. కాగా, ఈ సర్వేలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పేర్కొన్న ప్రశ్నావళి ప్రకారం రాష్ట్రంలో ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని మౌలిక వసతుల వివరాలను కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

టీడీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వేపాడ చిరంజీవి

సాక్షి, అమరావతి : తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వేపాడ చిరంజీవిని చంద్రబాబు ఖరారు చేశారు. బోడవరం నియోజకవర్గం రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన చిరంజీవిని పార్టీ అభ్యర్థిగా నిర్ణయించినట్లు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

నేటినుంచి పెద్ద గట్టు జాతర

సూర్యాపేట: తెలంగాణలో రెండో అతి పెద్దదైన లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఆదివారం గంపల ప్రదక్షిణతో ప్రారంభం కానుంది. జాతర సందర్భంగా విజయవాడ వైపు వెళ్లే వాహనాలను సూర్యాపేట మండలం టేకుమట్ల వద్ద జాతీయ రహదారి 365 బీబీ మీదుగా మళ్లించనున్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను స్వామి నారాయణ్ గురుకుల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్ఆర్ఎస్పీ కెనాల్ రోడ్డు మీదుగా రోళ్లబండ తండా వరకు మళ్లించి రాయినిగూడెం వద్ద యూటర్న్ చేసి హైదరాబాద్ వైపు పంపనున్నారు.

భద్రం బ్రదర్.. సీవోడీనే బెటర్

మహేశ్వరి అనే మహిళ ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా ల్యాప్‌టాప్ కొనుగోలు చేసింది. డెలివరీ తీసుకున్న తరువాత తెరిచి చూస్తే ఆమె ఆర్డర్ పెట్టిన కంపెనీ ఆపరేటింగ్ సిస్టమ్ కాకుండా వేరే సాఫ్ట్‌వేర్‌తో ఉన్న నకిలీ ల్యాప్‌టాప్ వచ్చినట్టు గ్రహించింది. ఈ-కామర్స్ కంపెనీ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌కు ఫిర్యాదు చేస్తే ఏడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. కానీ.. పట్టించుకోలేదు. కంపెనీ కార్యాలయానికి వెళితే ఆమె ఫిర్యాదును పరిష్కరించే బాధ్యులెవరూ కనిపించలేదు. చేసేది లేక అదనంగా సొమ్ము చెల్లించి ఆ ల్యాప్‌టాప్‌లోనే తనకు కావాల్సిన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయించుకోవాలని నిర్ణయించుకుంది. ఇలా ఎంతోమంది.. ఎన్నో విధాలుగా మోసపోతున్నారు.

– సాక్షి, అమరావతి

ఈ-కామర్స్ కంపెనీల పేరిట పెరుగుతున్న మోసాలు

- 'క్యాష్ ఆన్ డెలివరీ' ఆప్షన్ ఉపయోగించుకుంటే మంచిదని నిపుణుల సూచన
- వినియోగదారుల రక్షణ చట్టం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాల పరిధిలోకి ఈ-కామర్స్ సంస్థలు
- ఈ-కామర్స్ సైట్ అడ్రస్‌ను 'రిజిస్ట్రీ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్'లో తనిఖీ చేసుకోవచ్చు



ఆన్‌లైన్ షాపింగ్ మారుమూల పల్లెలకూ అందుబాటులోకి వచ్చింది. ఆన్‌లైన్ షాపింగ్ చేస్తే కొన్ని సందర్భాల్లో తాము ఆర్డర్ చేసిన వస్తువుకు బదులుగా వేరొకటి రావడం.. వస్తువును రిఫండ్ చేస్తే డబ్బులు తిరిగి రాకపోవడం వంటి మోసాలు పెరుగుతున్నాయి. నగదు చెల్లించినా వస్తువు రాకపోవడం.. క్రెడిట్, డెబిట్ కార్డులను తస్కరించి వేరొకరు ఆన్‌లైన్ షాపింగ్ చేయడం వంటి మోసాలెన్నో జరుగుతున్నాయి. ఇలా మోసపోతున్న వారికి ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతోంది. మన దేశంలో ఈ-కామర్స్ వ్యాపారంపై నిర్దిష్ట నిబంధనలు లేవు. కానీ.. వినియోగదారుల రక్షణ చట్టం –1986, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సవరణ చట్టం 2008, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మొదలైన నియంత్రణ సంస్థలచే నిర్దేశించిన విధానాలు ఈ-కామర్స్ సంస్థలకు కూడా వర్తిస్తాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఎవరికి ఫిర్యాదు చేయాలంటే..

ఈ-కామర్స్ సంస్థల చేతిలో ఎవరైనా మోసపోతే.. 'కన్స్యూమర్ కోర్ట్ ఆన్‌లైన్ ఇండియా', కన్స్యూమర్ ఫోరమ్, కమిషన్‌లలో ఫిర్యాదు చేయొచ్చు. వీటికి వెబ్‌సైట్, యాప్, టీవీ షాపింగ్ షో ద్వారా ఆర్డర్ చేసి రిఫండ్ లేదా రీప్లేస్‌మెంట్ పొందకపోవడం, ఆలస్యంగా డెలివరీ చేయడం, తప్పుదారి పట్టించే ప్రమోషన్ల వంటి వాటిపై పైన పేర్కొన్న సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి ముందు ఈ-కామర్స్ కంపెనీ కస్టమర్ కేర్ నంబర్‌కు కాల్ చేయాలి. ప్రతి ఈ-కామర్స్ కంపెనీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం నిర్దేశించిన విధంగా ఫిర్యాదు అధికారిని అందుబాటులో ఉంచాలి. ఆ వివరాలు కంపెనీ వెబ్‌సైట్‌లో ఉండాలి. మీ ఫిర్యాదును సదరు అధికారికి తెలియజేయండి. కొన్ని ఈ-కామర్స్ కంపెనీలు మధ్యవర్తిత్వ విధానాన్ని అనుసరిస్తాయి. అది సమస్యను పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఇలా చేసినా ప్రయోజనం లేకపోతే డీలర్, తయారీదారు, సర్వీస్ ప్రొవైడర్ పేర్లు, చిరునామాలను సేకరించండి. ఆ చిరునామాలకు సమస్యను రిజిస్టర్ పోస్ట్ ద్వారా రాసి పంపండి. గడువు ముగిసిన తర్వాత మీకు ఎలాంటి స్పందన రాకపోతే వినియోగదారుల ఫోరమ్, కమిషన్‌ను ఆశ్రయించండి. 2017 ఆగస్టులో సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ఈ-కామర్స్ వినియోగదారులు తమ సొంత నగరంలోని వినియోగదారుల ఫోరమ్‌లో ఫిర్యాదులను దాఖలు చేయవచ్చు.

'సైబర్' భద్రత ఇలా..

ఇటీవల రోగ్ (నకిలీ) వెబ్‌సైట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కాపీరైట్ ఉల్లంఘనకు పాల్పడటం ద్వారా తప్పుడు వివరాలతో నకిలీ ఈ-కామర్స్ వెబ్‌సైట్లు వినియోగదారులను మోసగిస్తున్నాయి. వీటిని గుర్తించి నిషేధించినా మరో పేరుతో మళ్లీ వస్తున్నాయి. వాటిని తెరిస్తే మనకు తెలియకుండానే మన కార్డుల్లో నగదు ఖర్చవుతుంటుంది. ఇలాంటి నకిలీ, పైరసీ వంటి నేరాల బారినపడిన బాధితులు 24 గంటల్లోపు 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్'లో ఫిర్యాదు చేయాలి. సంబంధిత అధికారులు ఐపీ చిరునామా ఆధారంగా సైబర్ మోసగాళ్లను కనిపెడతారు. నకిలీలను ప్రోత్సహించే డొమైన్‌పై నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయవచ్చు. బ్యాంకుకు వెళ్లి అనధికార లావాదేవీలపై ఫిర్యాదు చేయడం ద్వారా కార్డును బ్లాక్ చేసి, నగదును తిరిగి పొందవచ్చు. అన్నిటికంటే ముందు ఈ-కామర్స్ సైట్ అడ్రస్‌ను ప్రభుత్వం అందిస్తున్న రిజిస్ట్రీ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వెతికితే అది అసలైనదో, నకిలీదో తెలిసిపోతుంది.

సురక్షిత ఆన్‌లైన్ షాపింగ్ కోసం..

- తెలియని ఈ-కామర్స్ కంపెనీల నుంచి కొనుగోలు చేయడానికి ముందు వాటిని పరిశోధించండి. అనుమానం ఉంటే కొనుగోలును ఆపేయాలి.
- మొదటిసారి సైట్ నుంచి కొనుగోలు చేస్తుంటే క్యాష్ ఆన్ డెలివరీని ఎంచుకోండి.
- కొనుగోలు చేయడానికి ముందు నిబంధనలు, గోప్యతా విధానాన్ని చదవండి.
- డెబిట్, క్రెడిట్ కార్డ్ నంబర్ థర్డ్ పార్టీతో షేర్ చేస్తున్నారా లేదా అనే వివరాలు తెలుసుకోండి.
- ఆర్డర్ రద్దు, వాపసు విధానాలను, నియమాలను చదివి అర్థం చేసుకోండి.
- ఈ-కామర్స్ కంపెనీ చిరునామా, ఈ-మెయిల్, ఫోన్ నంబర్, హెల్ప్‌లైన్ వంటి కస్టమర్ కేర్ వివరాలు వాస్తవమో కాదో నిర్ధారించుకోండి.
- ఉత్పత్తి, వారంటీ వివరాలు తెలుసుకోవడానికి అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉందో లేదో తనిఖీ చేయండి.
- నగదు చెల్లించడానికి ముందు, ఆ వస్తువును కంపెనీ మీ పిన్‌కోడ్‌కు డెలివరీ చేస్తుందో లేదో చూసుకోండి.
- ఒకవేళ కంపెనీ ధర, వస్తువు వివరణను ఆర్డర్ చేసిన తర్వాత మార్చవచ్చు. కాబట్టి కొనుగోలు చేసిన వెంటనే ఆర్డర్ వివరాలు స్క్రీన్‌షాట్ తీసుకోండి.
- ఎక్స్ఛేంజ్ , రిఫండ్ వంటి క్లెయిమ్‌ల విషయంలో జాగ్రత్త వహించండి. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వస్తువు లోపభూయిష్టంగా ఉంటే కంపెనీలు ఎక్స్ఛేంజ్, రిఫండ్ చేయాలి.

క్రికెటర్ షబ్నంకు నేవీ సత్కారం


షబ్నంతో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానించిన తూర్పు నావికాదళం అధికారులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): అండర్–19 మహిళ క్రికెట్ టీ–20 ప్రపంచ కప్ విజేత జట్టు క్రీడాకారిణి ఎం.డి.షబ్నంను శనివారం మెటీరియల్ ఆర్గనైజేషన్‌లో తూర్పు నావికాదళం అధికారులు ఘనంగా సన్మానించారు. నావికాదళంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆమె తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, షకీల్‌తో పాటు క్రికెటర్ అయిన సోదరి షాజహాన్ బేగంను కూడా తూర్పు నావికాదళం తరపున మెటీరియల్ సూపరింటెండెంట్ కమడోర్ గోచ్‌కే సత్కరించారు. భవిష్యత్‌లో షబ్నం మరింత ఉన్నత స్థాయికి వెళ్లి ప్రపంచ క్రీడాకారిణిగా విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేవీ అధికారులు, సివిలియన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వందేభారత్‌పై మళ్లీ రాళ్ల దాడి

- ఖమ్మంలో గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో గ్లాసు ధ్వంసం

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర)/ఖమ్మం క్రైం: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై మరోసారి రాళ్ల దాడి జరిగింది. రైలు శుక్రవారం సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వస్తున్న సమయంలో ఖమ్మం స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సి–12 కోచ్‌పై రాళ్లు విసరడంతో గ్లాసు అద్దం పగిలింది. దీనిని విశాఖపట్నంలో తీసి వేసి అత్యవసర గ్లాసును అమర్చడం వల్ల ఈ రైలు శనివారం 3 గంటలు ఆలస్యంగా బయల్దేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి కార్యాలయం అధికారులు ఖమ్మం ఆర్పీఎఫ్ కార్యాలయానికి శనివారం ఫోన్ చేసి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయమై ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వందేభారత్ రైలు లోపల, బయట ఉన్న అత్యాధునిక సీసీ కెమెరాల ద్వారా ఏం జరిగినా పీఎంవోలోని వందేభారత్ విభాగానికి తెలిసిపోతుందని తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా రాళ్లతో దాడి చేసింది ముగ్గురు బాలురని తేలడంతో వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కొద్దిరోజుల కిందట ఖమ్మం శివారు రామన్నపేట ప్రాంతంలోనూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లు విసిరిన వారిని కూడా గుర్తించటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఏపీలో మహిళాభ్యుదయం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని



దొండపర్తి(విశాఖ దక్షిణ): మహిళా సాధికారత విషయంలో ఆంధ్రప్రదేశ్‌ని దేశంలోనే ముందు వరసలో నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. జాతీయ మహిళా కమిషన్, ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' పేరుతో మహిళా ప్రజాప్రతినిధుల సదస్సు విశాఖలో ప్రారంభమైంది. ఈ సదస్సులో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్ తొలిరోజున హాజరైన మంత్రి విడదల రజిని మాట్లాడుతూ కార్యనిర్వాహక రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖలో ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమన్నారు. ఏపీలో మహిళ అయి ఉంటే చాలు.. ఆమె పుట్టిననాటి నుంచి మరణించే వరకు ప్రతి దశలో ప్రభుత్వం నుంచి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందుతుందని చెప్పారు. అధికార, రాజ్యాంగ, స్థానిక సంస్థల పదవులు.. ఇలా అన్నింటిలోనూ సగభాగం మహిళలకే కేటాయిస్తూ నిజమైన మహిళా సాధికారత దిశగా ఏపీని ముఖ్యమంత్రి ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. కాగా, తొలి రోజు వర్క్‌షాప్‌లో 'సాధికారత కలిగిన మహిళా నాయకత్వం–సాధికార ప్రజాస్వామ్యం' అనే అంశంపై మహిళా శాసనసభ్యులు సదస్సులో చర్చించారు.

శ్రీ చైతన్య స్కూల్స్‌కు ఎన్‌డీసీఏ పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: శ్రీచైతన్య విద్యాసంస్థలకు ప్రతిష్టాత్మక 'నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమి' (ఎన్‌డీసీఏ) సంస్థ పురస్కారాలు ప్రకటించింది. భారతదేశంలో విద్యావేత్తలు, వివిధ రంగాల్లో నిపుణులైన వారిని గుర్తించి గౌరవించే ఈ సంస్థ.. శ్రీ చైతన్య స్కూల్స్‌కు 'బెస్ట్ స్కూల్ ఆఫ్ ఇండియా', శ్రీ చైతన్య డైరెక్టర్ సీమకు 'బెస్ట్ అకడమిక్ డైరెక్టర్' పురస్కారాలను ప్రకటించింది. బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమి ప్రతినిధులు బింగి నరేంద్ర గౌడ్, డాక్టర్ విజయకుమార్ తదితరుల నుంచి శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఈ పురస్కారాలను అందుకున్నారు.

అనిల్ కుమార్ సింఘాల్ బాధ్యతల స్వీకారం

సాక్షి, అమరావతి: సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్ గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1993 బ్యాచ్‌కు చెందిన సింఘాల్ ఇప్పటి వరకు దేవదాయ శాఖ ముఖ్యకార్యదర్శిగా విధులు నిర్వ హించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను సింఘాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. సింఘాల్ కేంద్రంలో అత్యంత కీలకమైన డీఓపీటీ డైరెక్టర్‌గా వ్యవ హరించారు. ఏపీ భవన్ ప్రత్యేక కమిషనర్‌గా పనిచేశారు. కీలకమైన కరోనా సమయంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా సేవలు అందించి రాష్ట్ర ప్రజల మన్ననలు అందుకున్నారు. టీటీడీ ఈవో గా పలు సంస్కరణలను చేపట్టారు. విశాఖపట్నం, తూర్పు గోదావరి, మెదక్ కలెక్టర్‌గానూ, చి త్తూరు, గుంటూరు సంయుక్త కలెక్టర్‌గానూ పని చేశారు. కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికా రిగా, గద్వాల్ సబ్ కలెక్టర్‌గా ప్రజలకు సేవలందించారు. సర్వీసు తొలి రోజుల్లో నెల్లూరు, అనంతపురం ఉప కలెక్టర్‌గా వ్యవహరించారు.

పాత పద్ధతిలోనే కృష్ణా జలాల పంపిణీ

- కృష్ణా బోర్డుకు తేల్చిచెప్పిన కేంద్ర జల్ శక్తి శాఖ

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలను 2022–23 సంవత్సరంలోనూ ఏపీ, తెలంగాణకు పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని కృష్ణా బోర్డుకు కేంద్ర జల్ శక్తి శాఖ తేల్చిచెప్పింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో పాత విధానంలోనే నీటి పంపిణీకి అంగీకరించిన తెలంగాణ సర్కారు.. ఆ తర్వాత అడ్డం తిరిగి సగం వాటా కావాలని డిమాండ్ చేయడంతో కేంద్ర జల్ శక్తి శాఖ ఈ స్పష్టతనిచ్చింది. 2015 జూన్ 19న రెండు రాష్ట్రాల అంగీకారంతో ఏపీకి 512.04 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీలు పంపిణీ చేసేలా తాత్కాలిక సర్దుబాటు చేశామని పేర్కొంది. 2016–17లో ఇదే విధానానికి రెండు రాష్ట్రాలు అంగీకరించాయని తెలిపింది. 2017 నుంచి 2022 వరకు ఇదే విధానంలో నీటిని వినియోగించుకున్నాయని గుర్తు చేసింది. ఈ నీటి సంవత్సరంలోనూ ఇదే విధానాన్ని అమలు చేయాలని పేర్కొంది. ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసే వరకూ ఈ విధానంలోనే రెండు రాష్ట్రాలకు జలాలను పంపిణీ చేయాలని కృష్ణా బోర్డుకు కేంద్ర జల్ శక్తి శాఖ స్పష్టం చేసినట్లు బోర్డు అధికారవర్గాలు తెలిపాయి.

• తెలంగాణ

'హైటెక్ సెక్స్‌రాకెట్'లో అసిస్టెంట్ డైరెక్టర్

- టాలీవుడ్‌కు చెందిన సురేశ్ బోయిన తోసహా మరొకరి అరెస్టు
- ముంబై, ఢిల్లీ నుంచి మోడల్స్ అక్రమ తరలింపు
- వాట్సాప్ గ్రూప్‌లు, వెబ్‌సైట్లలో ఫొటోలు పెట్టి దందా
- పాస్‌పోర్టు, ఆధార్, పాన్‌కార్డులు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: సంచలనం సృష్టించిన హైటెక్ సెక్స్‌రాకెట్ కేసులో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. తాజాగా మరో ఇద్దరు నిందితులను సైబరాబాద్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) అరెస్టు చేసింది. ఈ కేసులో సురేశ్ బోయిన అనే టాలీవుడ్ అసిస్టెంట్ డైరెక్టర్ కూడా పోలీసులకు చిక్కాడు. ఈ ముఠా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలను అక్రమంగా తరలించి వాట్సాప్ గ్రూప్‌లు, వెబ్‌సైట్లలో వారి ఫొటోలను పెట్టి, కాల్ సెంటర్ల ద్వారా విటులను ఆకర్షిస్తూ స్టార్ హోటళ్లు, ఓయో రూమ్‌లలో వ్యభిచారదందా నిర్వహిస్తోంది. ఇప్పటివరకు ఈ కేసులో సైబరాబాద్ పోలీసులు 33 మంది నిర్వాహకులను అరెస్టు చేశారు. వీరిలో బాలీవుడ్‌లో కథారచయిత ముంబైకి చెందిన మోహిత్ సత్పాల్ అలియాస్ గార్గ్ ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన మేకల అఖిల్‌కుమార్, నెల్లూరు జిల్లా కావలిలోని వెంగళ్రావునగర్‌కు చెందిన సురేశ్ బోయిన అలియాస్ కుమార్ శెట్టిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై మాదాపూర్, పంజగుట్ట ఠాణాలో ఇప్పటికే నాలుగు కేసులున్నాయి. నిందితుల నుంచి ఐదు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, స్వైపింగ్ మిషన్, పాస్‌పోర్ట్, ఆధార్, పాన్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

- బంజారాహిల్స్‌లోని హయత్ హైట్స్‌లో ఉండే సురేశ్ బోయిన ఓ ప్రముఖ టాలీవుడ్ దర్శకుడి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సినీపరిశ్రమకే చెందిన నందు అనే వ్యక్తితో కలిసి సురేశ్ ఫ్లాట్ అద్దెకు తీసుకొని వ్యభిచారదందా మొదలుపెట్టాడు.
- పశ్చిమ బెంగాల్, ముంబై, ఢిల్లీ వంటి నగరాల నుంచి సినిమా అవకాశాలు ఇప్పిస్తానని సురేశ్ నమ్మించి మోడల్స్, సినీతారలను అక్రమంగా తరలించి హైదరాబాద్‌లోని పెద్దలకు పరిచయం చేసేవాడు. లొకాంటో, స్కోక్కా, బ్లాక్‌పేజ్ వంటి వెబ్‌సైట్లలో అమ్మాయిల ఫొటోలు పెట్టి విటులను ఆకర్షించేవాడు. 35–40 శాతం కమీషన్ తీసుకొని మహిళలను సరఫరా చేసేవాడు. సురేశ్ ఈ దందాను కొంతకాలం గోవాలో కూడా నిర్వహించాడు. ఇప్పటివరకు 450–500 మంది బాధితులను వ్యభిచారకూపంలోకి దింపాడు.
- 2019లో గచ్చిబౌలిలోని క్లబ్‌రోగ్ పబ్‌లో వ్యభిచారగృహాన్ని నిర్వహిస్తున్న దీపక్ రాయ్‌తో అఖిల్‌కు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అఖిల్ మాదాపూర్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకొని దందా మొదలుపెట్టాడు. కొన్ని నెలల్లోనే పోలీసులు దాడి చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ముంబై, ఢిల్లీ, బెంగళూరు నుంచి 400–500 మంది మహిళలను తీసుకొచ్చి వ్యభిచార కూపంలోకి దింపి, హైదరాబాద్‌లో కాల్ సెంటర్ నిర్వహిస్తూ విటులను ఆకర్షించేవాడు.

'ఫోన్'తో ఆడుకోమంటున్నారు!

82 శాతం మందిలో మానసిక సమస్యలు



సౌరాష్ట్ర యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి

తమ పనికి అడ్డురాకుండా పిల్లలకు ఫోన్ అలవాటు చేసిన 54% మంది తల్లులు

క్రీడల కంటే ఫోన్‌లో గేమ్స్ ఆడటానికే 93% పిల్లలు మొగ్గు

సాక్షి, అమరావతి: తల్లిదండ్రుల వల్లే పిల్లలు స్మార్ట్ ఫోన్‌లకు అడిక్ట్ అవుతున్నారని ఓ అధ్యయనంలో తేలింది. ఏడుస్తున్నప్పుడు బుజ్జగించడానికో, పని చేస్తున్నప్పుడు అడ్డొస్తున్నారనో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్‌ఫోన్ ఇస్తున్నారని.. వారేమో క్రమంగా వాటికి అలవాటు పడిపోయి.. బానిసలైపోతున్నారని గుజరాత్‌లోని సౌరాష్ట్ర యూనివర్సిటీ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. వర్సిటీ సైకాలజీ విభాగం స్మార్ట్ ఫోన్ల వాడకం, అనర్థాలపై ఇటీవల ఓ అధ్యయనం నిర్వహించింది. తాము పని చేసుకుంటున్నప్పుడు అడ్డురాకుండా ఉండాలని 54 శాతం మంది తల్లులు తమ పిల్లలకు ఫోన్లు ఇస్తున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. స్మార్ట్ ఫోన్ వినియోగానికి అలవాటుపడిన ఆ పిల్లలు.. క్రమంగా బానిసలుగా మారినట్టు గుర్తించారు. మరోవైపు 82 శాతం మంది పిల్లలు తల్లిదండ్రుల నుంచి ఫోన్‌ను డిమాండ్ చేస్తున్నట్టు వెల్లడైంది. 78 శాతం మంది అయితే ఫోన్ చూస్తూనే భోజనం తింటున్నారని తేలింది. ఒకవేళ ఫోన్ ఇవ్వకపోతే తినకుండా మొండికేస్తున్నట్లు గుర్తించింది.



నిద్రలోనూ ఫోన్ గోలే..

అతిగా స్మార్ట్‌ఫోన్‌కు బానిసలైన 64 శాతం మంది పిల్లలైతే నిద్రలో కూడా ఆన్‌లైన్ గేమ్స్, ఫోన్ గురించే కలవరిస్తున్నట్లు తేలింది. 73 శాతం మంది స్కూళ్లకు వెళ్లిన సమయంలో ఫోన్‌ను మిస్ అవుతున్నట్లు, స్క్రీన్ ప్రభావంతో 77 శాతం మందిలో సగటు నిద్ర వేళలు తగ్గిపోగా, 83 శాతం మంది కంటి చూపు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని వెల్లడైంది. 67 శాతం మంది చూపు, 82 శాతం మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు పసిగట్టారు. 93 శాతం మంది ఔట్ డోర్ కంటే ఫోన్‌లో గేమ్స్ ఆడటానికి పిల్లలు మొగ్గు చూపుతున్నారని సైకాలజీ విభాగాధిపతి యోగేష్ చెప్పారు. తమ అధ్యయనంలో అసలు ఫోన్ స్క్రీన్ చూడనిదే అన్నం ముద్ద ముట్టకపోవడంతో పాటు, హోమ్ వర్క్ కూడా చేయని ఒక పిల్లాడిని చూసినట్లు ఆయన తెలిపారు. పిల్లవాడు ఆ స్థాయిలో ఫోన్‌కు బానిసవ్వడంతో తల్లిదండ్రులు ఇప్పుడు బాధపడుతున్నారని పేర్కొన్నారు.

తల్లిదండ్రుల్లో మార్పు ముఖ్యం



చిన్న పిల్లలు స్మార్ట్ ఫోన్‌లకు బానిసలవ్వడానికి తల్లిదండ్రులే కారణం. సాధారణంగా ఇంట్లో పెద్దలు ఏం చేస్తారో పిల్లలు కూడా వాటిని అనుసరిస్తారు. అందువల్ల పేరెంటింగ్‌లోనే మార్పులు రావాలి. చిన్న పిల్లలున్న తల్లిదండ్రులు సాధ్యమైనంత వరకు ఇంట్లో స్మార్ట్ ఫోన్ వినియోగం తగ్గించాలి. రాత్రి పూట బెడ్‌రూమ్‌కు బయటే ఫోన్‌లను వదిలేయాలి. అతి వినియోగంతో వచ్చే దుష్ప్రభావాలను వివరంగా వారికి తెలియజేయాలి. అవుట్ డోర్ గేమ్స్ వైపు వారి దృష్టిని మరల్చాలి. పుస్తకాల్లో కథలు చదివి వినిపించడం, నీతి కథలు చెప్పడం చేస్తుండాలి.

– డాక్టర్ ఇండ్ల విశాల్ రెడ్డి, చిన్నపిల్లల మానసిక వైద్యుడు, విజయవాడ

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943